కాలము సంపూర్ణమైయున్నది. దేవుని రాజ్యము సమీపించి యున్నది
మారుమనస్సు పొంది సువార్త నమ్ముడి... మార్కు 1:15

# క్రీస్తు ఉపమానములు
# దేవుని రాజ్యమర్మములు

సహో. ధర్మా మల్లు (M.Min.)





సహో. ధర్మా మల్లు తన యవ్వన వయస్సులోనే రక్షింపబడి,
తెలుగు క్రైస్తవులపట్ల తనకున్న భారమును బట్టి
ఈ పుస్తకమును రచించెను.
పరిశుద్ధ గ్రంథములో ప్రభువైన ఏసు క్రీస్తు ఉపమాన
రూపములో బోధించిన సంగతులు

**క్రీస్తు ఉపమానములు - దేవుని రాజ్య మర్మములు**

అను ఈ పుస్తకములో తెలియపరచబడినవి.
దైవ సేవకులకు, వాక్య పరిచర్య చేయువారికి
సహకారిగా ఉండవలెనను ప్రధాన ఉద్దేశ్యముతో
యీ పుస్తకము రూపొందించబడినది.

**వాక్యమును ప్రకటించుము. సమయమందును,**
**అసమయమందును ప్రయాసపడుము (2 తిమోతి 4:2)**

ప్రతులకు సంప్రదించండి :
**GRACE PUBLICATIONS**
D.No. 6-38-20/1, L.V. Nagar, Driver's Colony,
Gajuwaka, Visakhapatnam-530 026. A.P. India
Phones : 0891-2511689, 91 98481 22449
E-mail : dmbooks075@gmail.com

# క్రీస్తు ఉపమానములు
# దేవుని రాజ్యమర్మములు

**కాలము సంపూర్ణమైయున్నది.**

**దేవుని రాజ్యము సమీపించి యున్నది.**

**మారుమనస్సు పొంది సువార్త నమ్ముడి.......మార్కు 1:15**

**సహో. ధర్మా మల్లు** (M.Min.)

# KRISTU UPAMANAMULU DEVUNI RAJYAMARMAMULU (Telugu)

First Edition: June 2010

Copyright: Bro. Dharma Mallu

Published by: **Grace Ministries**
D.no.6-38-20
L.V.Nagar
Gajuwaka - 530026
Visakhapatnam. India

Written permission must be obtained from the Author at the above address, for reprinting or translating any part of this book.

# ఉపోద్ఘాతము

ప్రియ సహోదర, సహోదరిలారా, ప్రభువైన యేసుక్రీస్తు నామమున మీకందరికీ నా వందనములు. 'క్రీస్తు ఉపమానములు - దేవుని రాజ్యమర్మములు' అను పుస్తకము ద్వారా పరిశుద్ధ గ్రంథమందు యేసుక్రీస్తు దేవుని రాజ్యము (లేక పరలోక రాజ్యము)ను గూర్చి తెలియ జెప్పిన ఉపమానములను పాఠకలోకముతో పంచుకొనుటకు ప్రభువు కృపనిచ్చినందుకు ప్రభువుకు నా వందనములు.

ఉపమానమనగా పరలోక సంబంధమైన అర్థమునిచ్చెడు భూ సంబంధమైన కథ లేక వర్ణన. ప్రతి ఉపమానము ఒక సత్యమును తెలియజేయుచున్నది. ప్రతి ఉపమానము అది బోధించుచున్న ప్రధానాంశమును బట్టి విషయ సూచికలో పొందుపరచబడియున్నది.

యేసు క్రీస్తు శిష్యులు నీవు ఉపమాన రీతిగా వారితో (జనులతో) యెందుకు మాటలాడుచున్నావని అడిగినపుడు, ఆయన, 'పరలోక రాజ్య మర్మములు ఎరుగుట మీకు అనుగ్రహింపబడియున్నది గాని వారికి అనుగ్రహింపబడలేదు. వారు చూచుచుండియు చూడరు. వినుచుండియు వినకయు, గ్రహింపకయు నున్నారు. ఇందు నిమిత్తము నేను ఉపమానరీతిగా వారికి బోధించుచున్నాను' అని చెప్పెను (మత్తయి 13:10-13). యీ మాటలను బట్టి యేసుక్రీస్తు ఉపమానముల ద్వారా ప్రజలందరూ దేవుని రాజ్య మర్మములను గూర్చి తెలిసి కొనుటయనునది దేవుని ఉద్దేశ్యమై యున్నది. యీ పుస్తకము చదివి, అనేకులు ఆత్మీయమైన మేలు పొందుదురని ఆశిస్తున్నాను.

యీ పుస్తకమును ప్రచురించుటలో ఎంతో శ్రమించిన పాస్టర్ డేవిడ్ రాజుగారికి, సహో.సుందర్ గారికి, సహో.హానోకు గారికి మరియు ప్రచురణ కర్తలకు నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నాను. యిందు నిమిత్తమై ప్రార్థించిన విశ్వాసులందరికి నా వందనములు.

ప్రభువునందు,
సహో॥ ధర్మా మల్లు (M.Min)
E.mail: dmbooks075@gmail.com

# దేవుని రాజ్యము

చరిత్రలో యెన్నో రాజ్యములు, సామ్రాజ్యములు ఏర్పరచబడి, గతించిపోయినవి. ఎంతో మంది రాజులు ఏలిరి, గతించి పోయిరి. కానీ, యే రాజును, యే రాజ్యమును మానవునికి పరిపూర్ణ శాంతి, సంతోషము, సమాధానము యివ్వలేదు. దీనికంతటికీ కారణము మానవునిలో వున్న పాపము. అయితే, దేవుడు ఒక రాజ్యమును స్థాపించబోవు చున్నాడు. ఈ రాజ్యము యేసుక్రీస్తు ద్వారా పాప విమోచన పొందిన మానవులందరి సముదాయముగా (కొలొస్సి 1:13) ప్రస్తుతము అదృశ్యమైయున్నది (లూకా 17:20,21). కానీ, ఒకానొకరోజు యీ రాజ్యము దృశ్యమైనదిగా స్థాపించబడబోవుచున్నది (1 కొరింథి 13:12). యీ రాజ్యమునకు రాజు ప్రభువైన యేసుక్రీస్తు (యెషయా 9:6,7; యోహాను 18:37,38; మత్తయి 2:6).

ఈ రాజు తన మొదటి రాకలో మానవుల పాపపరిహారార్థము ఒక గొఱ్ఱెపిల్లగా వచ్చెను (యోహాను 1:29; 1 కొరింథి 5:7; 1 పేతురు 1:18-19). కలువరి సిలువలో మృతిపొంది, సమాధి చేయబడి, మూడవ దినమున పునరత్థాను డాయెను (రోమా 5:6,8; 14:9; 1 కొరింథి 15:3,4). తదుపరి ఆయన సమస్తమైన ఆధిపత్యము కంటెను, అధికారము కంటెను, శక్తి కంటెను ఎంతో హెచ్చుగా దేవుని కుడి పార్శ్య మునకు హెచ్చింపబడి, సమస్తమును తన పాదముల క్రింద కలిగియున్నాడు (ఎఫెసి 1:20-23). యిట్టి అధికారము కలిగిన ప్రభువైన యేసుక్రీస్తు తన రెండవ రాకడలో శత్రువులను జయించి (ప్రకటన 6:16; 14:10; 17:12-14, 19:11-21), యూదా గోత్రపు సింహముగా (ఆది. కాం.49:8-10; ప్రకటన 5:5) తన రాజ్యమును యేర్పరచును (యిర్మియా 23:5,6; 33:14-18; యెహెజ్కేలు 37:21-28).

ఈ రాజును సకలజనులు స్తుతించెదరు (ప్రకటన 5:11-14; 7:9-17; 11:15-18; 15:4). యీ క్రీస్తు రాజ్యము యొక్క మహిమ ఊహింపశక్యము కానిది. యీ రాజ్యములో నీతి, సమాధానము, ఆనందము వుండును (రోమా 14:17; యెషయా 11:6-10). పాపమువలన మానవుడు కోల్పోయిన మహిమను యీ రాజ్యములో తిరిగి పొందును. అచ్చట వ్యాధులు, కన్నీరు, భయము, మరణము యిక వుండవు (యెషయా 25:8; ప్రకటన 7:17, 21:4). దేవుని రాజ్యము శాశ్వతమైన రాజ్యము (దాని యేలు 7:13-14; ప్రకటన 11:15). ప్రియులారా యిట్టి దేవుని రాజ్యమును గూర్చిన ఉపమానములను చదివి, ఆత్మీయంగా ఆశీర్వదించబడుదురు గాక.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1) | దేవుని రాజ్య సందేశము .... యేసు క్రీస్తు నందు రక్షణ | 1 |
| | a) మంచి సమరయుడు | 1 |
| | b) తప్పిపోయిన గొఱ్ఱె | 4 |
| | c) పోగొట్టుకొనబడిన నాణెము | 6 |
| | d) తప్పిపోయిన కుమారుడు | 9 |
| 2) | దేవుని రాజ్యము యొక్క విలువ | 13 |
| | a) దాచబడిన ధనము | 13 |
| | b) అమూల్యమైన ముత్యము | 15 |
| 3) | దేవుని రాజ్యము యొక్క యెదుగుదల | 18 |
| | a) విత్తబడిన ఆవగింజ | 18 |
| | b) పుల్లని పిండి | 20 |
| | c) యెదుగుతున్న విత్తనము | 21 |
| 4) | దేవుని రాజ్య సమీపత్వము .... క్రీస్తు రెండవ రాకడ | 24 |
| | a) చిగురించు అంజూరపు చెట్టు | 24 |
| 5) | దేవుని రాజ్యమునకు ఆహ్వానము .... తృణీ కారము | 28 |
| | a) యిద్దరు కుమారులు | 28 |
| | b) దుష్టులైన ద్రాక్షతోట కాపులు | 30 |
| | c) పెండ్లి విందు | 33 |
| | d) గొప్ప విందు | 35 |
| 6) | దేవుని రాజ్యమునకు అవరోధములు | 38 |
| | a) వెర్రి ధనవంతుడు | 38 |
| | b) విత్తువాడు | 40 |
| 7) | దేవుని రాజ్యము కొరకైన నిరీక్షణ మరియు సిద్ధపాటు | 44 |
| | a) బుద్ధిగల కన్యకలు .. బుద్ధిలేని కన్యకలు | 44 |
| | b) ద్వారపాలకుడు | 46 |
| | c) నమ్మకమైన దాసులు | 48 |
| | d) నమ్మకమైన, బుద్ధిగల గృహనిర్వాహకుడు | 50 |
| | e) యుక్తి పరుడైన గృహ నిర్వాహకుడు | 52 |
| 8) | దేవుని రాజ్యవారసుల గుణగణములు | 55 |
| | a) ప్రేమ | |
| | i) యిద్దరు ఋణస్థులు | 55 |

b) వినయము, తగ్గింపు
i) నిష్ప్రయోజకు లైన దాసులు 58
ii) కడపటి చోటు 60
c) క్షమించు స్వభావము
i) కనికరము లేని చెడ్డదాసుడు 62
d) జ్ఞానము
i) ఇల్లు కట్టువారు 66
e) ప్రార్థన జీవితము
i) పరిసయ్యుడు .. సుంకరి 69
ii) అవసరములో నున్న స్నేహితుడు 71
iii) గోజాడుచున్న విధవరాలు 74
f) సాక్ష్యపు జీవితము
i) పాత తిత్తులలో క్రొత్త ద్రాక్షరసము .. పాత బట్టపై క్రొత్త గుడ్డ 77
ii) దీప స్తంభము మీద దీపము 79
iii) శాస్త్రి 81
g) త్యాగము .. క్రమ శిక్షణ
i) గోపురము కట్టువాడు .. యుద్ధము చేయువాడు 84
9) దేవుని రాజ్యవారసుల తలాంతులు .. బహుమానములు 88
a) ద్రాక్ష తోటలోని పనివారు 88
b) తలాంతులు 90
c) మినాలు 94
10) దేవుని రాజ్యమును తృణీకరించు వారికి తీర్పు 97
a) ఫలింపని అంజూరపు చెట్టు 98
b) గురుగులు 101
c) వల 104
d) ధనవంతుడు .. లాజరు 105

## I. దేవుని రాజ్యసందేశము - యేసు క్రీస్తునందు రక్షణ

ప్రియులారా, ప్రభువైన యేసుక్రీస్తు భూమిమీద వున్నపుడు దేవుని రాజ్య సందేశమును ప్రకటించెను. అదేమనగా తాను మానవులందరి పాపము పరిహరించుటకు లోకమునకు వచ్చెను (యోహాను 1:29) మరియు తనద్వారానే దేవుని రాజ్యములో ప్రవేశము దొరుకునన్నది. పరిశుద్ధ గ్రంధములో 'కాలము సంపూర్ణమైయున్నది. దేవుని రాజ్యము సమీపించియున్నది. మారు మనస్సు పొంది, సువార్త నమ్ముడని చెప్పచు, దేవుని సువార్తను ప్రకటించుచు యేసుక్రీస్తు గలిలయకు వచ్చెనని' మార్కు 1:15లో వ్రాయబడియున్నది. యేసు క్రీస్తు, 'నేనే మార్గమును, సత్యమును, జీవమును. నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు (యోహాను 14:6), నా మాట విని, నన్ను పంపిన వానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు. వాడు తీర్పులోనికి రాక, మరణములోనుండి జీవములోనికి దాటి యున్నాడని నిశ్చయముగా చెప్పచున్నాను (యెహాను 5:24)' అని దేవుని వాక్యములో సెలవిచ్చెను. పాపములో నశించుచున్న వారినందరినీ రక్షించుటకు తానీలోకమునకు వచ్చెనన్న సత్యమును తెలియజేయుటకు యేసు క్రీస్తు యీ క్రింది ఉపమానములను చెప్పెను.

### (a) మంచి సమరయుడు (లూకా 10:30-37):

యేసుక్రీస్తును ఒక ధర్మ శాస్త్రోపదేశకుడు, 'బోధ కుడా, నిత్యజీవనమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెనని' అడిగినపుడు, ఆయన ధర్మశాస్త్రమంతటికీ ప్రధానమైన రెండు ఆజ్ఞలను (దేవుని ప్రేమించుట, పొరుగు వానిని ప్రేమించుట) పాటించుమని చెప్పెను (లూకా 10:25-27). అంతట ఆ ధర్మ శాస్త్రోపదేశకుడు నా పొరుగువాడెవడని యేసుక్రీస్తును అడుగగా, యేసు తానే 'ఒక మంచి పొరుగువాని'గా మానవుని పాపమునుండి రక్షింపవచ్చెనను అర్ధమిచ్చుటకు 'మంచి సమరయుడు' అను ఉపమానమును చెప్పి, ఆ ధర్మశాస్త్రోపదేశకుని కూడా వెళ్లి, దేవుని ప్రేమను యితరులకు కనుపరచుమని చెప్పెను (లూకా 10:28-37).

లూకా 10:30-37 వచనములలో యీలాగు వ్రాయబడినది. 'అందుకు

యేసు యిట్లనెను - ఒక మనుష్యుడు యెరూషలేమునుండి యెరికో పట్టణమునకు దిగి వెళ్లుచు, దొంగల చేతిలో చిక్కెను. వారు అతని బట్టలు దోచుకొని, అతని కొట్టి, కొరప్రాణముతో విడిచిపోయిరి. అప్పుడొక యాజకుడు ఆత్రోవను వెళ్లుట తటస్థించెను. అతడు అతనిని చూచి, ప్రక్కగా పోయెను. అలాగుననే లేవీయుడొకడు ఆ చోటికి వచ్చి, చూచి, ప్రక్కగా పోయెను. అయితే, ఒక సమరయుడు ప్రయాణమై పోవుచు, అతడు పడియున్న చోటికి వచ్చి, అతనిని చూచి, అతనిమీద జాలిపడి, దగ్గరకుపోయి, నూనెయు, ద్రాక్షారసమును పోసి, అతని గాయములను కట్టి, తన వాహనముమీద యెక్కించి, ఒక పూటకూళ్ల వాని యింటికి తీసుకుని పోయి, అతని పరామర్శించెను. మరునాడతడు రెండు దేనారములు తీసి, ఆ పూటకూళ్లవానికిచ్చి - యితని పరామర్శించుము. నీ వెంకేమైననూ ఖర్చు చేసిన యెడల నేను మరల వచ్చునప్పుడు అది నీకు తీర్చెదనని అతనితో చెప్పిపోయెను. కాగా, దొంగల చేతిలో చిక్కిన వానికి ఈ ముగ్గురిలో ఎవడు పొరుగు వాడా యెనని నీకు తోచుచున్నది అని యేసు అడుగగా అతడు అతని మీద జాలిపడిన వాడే అనెను. అందుకు యేసు - నీవును వెళ్లి, ఆలాగు చేయుమని అతనితో చెప్పెను'.

యెరూషలేమునుండి యెరికో పట్టణమునకు యిరువది మైళ్లదూరము. దీనికి 'రక్తపు త్రోవ' అని పేరు. యిది దిగుడు మార్గము మరియు బందిపోటు దొంగలకు పేరు గాంచిన మార్గము. ఉపమానములో చెప్పబడిన మనుష్యుడు యెరూషలేమునుండి యెరికోకు వెళ్లు చుండెనను మాట, మానవుడు దేవుని సన్నిధివదలి లోకమువైపు వెళ్తున్నాడను సత్యమును సూచిస్తున్నది. ఆ మనుష్యుడు దొంగలచేతికి చిక్కి, దోచుకొనబడి, కొట్టబడి, కొర ప్రాణముతో విడువబడెనను మాట, మానవుడు సాతానుని చేత లోక పాపములోనికి నడిపింపబడి, నాశనము వైపునకు తీసుకెళ్ల బడుతున్నాడని తెలియజేయుచున్నది. మీరు మీ అపరాధముల చేతను, పాపముల చేతను చచ్చినవారై, వాయుమండల సంబంధమైన అధిపతిని అనుసరించి, యీ ప్రపంచధర్మము చొప్పన నడుచుకొంటిరి (ఎఫెసి 2:1,2).

వస్త్రహీనుడై, గాయపడిన ఆ మనుష్యుని యాజకుడు, లేవీయుడు చూచియు, సహాయము చేయకుండా, ప్రక్కగా పోయిరి (లూకా 10:31, 32). యాజకుడనగా దేవుని ధర్మశాస్త్ర విధులను ఇశ్రాయే లీయులకు బోధించువాడు (లేవీ కా.10:11), ఇశ్రాయేలీయుల పక్షమున బలులు అర్పించువాడు (లేవీ కాం. 1:1-17). లేవీయుడనగా యాజకునికి బలులు అర్పించు విషయములో సహాయము చేయువాడు (2దినవృత్తాంతములు 35:10-14) మరియు మందిరమును కాయువాడు (సంఖ్యా కాండము 18:3). వీరిరువురును పరదేశు ల యెడల జాలిగలిగి వారిని ప్రేమించవలెనని ఆజ్ఞాపింప బడిరి (లేవీ. కాం.19:33-34; ద్వితీయోపదేశ కాండం 10:17-19). అయితే, వీరు గాయపడిన ఆ మనుష్యునికి సహాయము చేయక పోయిరి. దీనిని బట్టి, ధర్మ శాస్త్రము, బలులు మరియు మన ధార్మికత, మనలను రక్షించవని తెలుసుకొనుచున్నాము.

అయితే, ఒక సమరయుడు ఆదారిన వెళుతూ, గాయపడిన ఆమనుష్యుని మీద జాలిపడి, అతనికి సహాయము చేసెను (లూకా 10:33,34). యీ సమరయుడు ప్రభువైన యేసుక్రీస్తును సూచిస్తున్నాడు. సమరయులు యూదుల చేత ద్వేషింపబడిరి (యోహాను 4:9). యేసు క్రీస్తు అనేకుల చేత ద్వేషింపబడి, తృణీకరింపబడెను (యెషయా 53:3; యోహాను 1:11).ఉ పమానములో చెప్పబడిన సమరయుడు గాయపడిన మనుష్యుని దగ్గరకు పోయి, నూనెయు, ద్రాక్షారసమును పోసి, అతని గాయములను కట్టి, పూట కూళ్లవాని యింటికి అతనిని తీసుకువెళ్లెననుమాట, యేసు క్రీస్తు మానవుని పాపము తన రక్తము (ద్రాక్షారసము) తో కడిగి, పరిశుద్ధాత్మాభిషేకము (నూనె)నిచ్చి, సంఘము (పూటకూళ్లవాని యిల్లు) లో ప్రవేశ పెట్టునన్న సత్యమును తెలియజేయుచున్నది. యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును (1 యోహాను 1:7). అమూల్యమైన రక్తము చేత, అనగా నిర్దోషమును, నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత మనము విమోంచింప బడుదుము (1 పేతురు 1:19).

యేసుక్రీస్తు ఒక 'మంచి సమరయుడు' గా యీ లోకమునకు వచ్చి,

పాపములో నశిస్తున్న మానవులందరి కొరకూ తన్నుతాను బలిగా అర్పించుకొని, తన రక్తము కార్చి, తన్ను యెందరైతే రక్షకునిగా స్వీకరింతురో వారి పాపములను క్షమించి, క్రీస్తు సంఘములో వారిని ప్రవేశపెట్టి, తన శాంతి, సమాధానములు వారికి అనుగ్రహించునని యీ ఉపమానము ద్వారా మనము తెలుసు కొనుచున్నాము. క్రీస్తు మనపట్ల కనపరచిన యీ ప్రేమను మనముకూడా యితరులకు కనపరచవలెనన్న సత్యమును లూకా 10:37 వచనము ద్వారా గమనించుచున్నాము.

## (b) తప్పిపోయిన గొఱ్ఱె (మత్తయి 18:12-14; లూకా 15:3-7) :

ప్రభువైన యేసు క్రీస్తు బోధవినుటకు సమస్తమైన సుంకరులును, పాపులును వచ్చు చుండిరి (లూకా 15:1). ఆదినములలో శాస్త్రులకును, పరిసయ్యులకును సుంకరులనగా సరిపోదు. సుంకరులు కావలసిన దానికంటే యెక్కువగా పన్ను వసూలు చేయుదురని శాస్త్రులును, పరిసయ్యులును వారిని హేయ భావముతో చూచుచుండిరి. కనుకనే వారు యేసు క్రీస్తునొద్దకు వచ్చినపుడు ఆయన సుంకరులను చేర్చుకుంటున్నాడని సణుగుకొనిరి (లూకా 15:2). అందుకు యేసు క్రీస్తు వారి హృదయాలోచనలెరిగి, పాపముతో పతనమై, తప్పిపోయిన వారి కొరకే తానీలోకమునకు వచ్చెనను సంగతి తెలియబరుస్తూ, 'తప్పిపోయిన గొఱ్ఱె', 'పోగొట్టుకొనబడిన నాణెము' మరియు 'తప్పిపోయిన కుమారుడు' అను మూడు ఉపమానములు చెప్పెను.

'తప్పిపోయిన గొఱ్ఱె' ఉపమాన వాక్య భాగము లూకా 15:3-7 లో యీలాగు వ్రాయబడినది. 'అందుకాయన వారితో ఈ ఉపమానము చెప్పెను. మీలో ఏమనుష్యునికైనను నూరుగొర్రెలు కలిగి యుండగా, వాటిలో ఒకటి తప్పిపోయిన యెడల అతడు తొంబది తొమ్మిదింటిని అడవిలో విడిచిపెట్టి, తప్పిపోయినది దొరకువరకు దానిని వెదకవెళ్లడా ? అది దొరికినప్పుడు సంతోషముతో దానిని తన భుజముల మీద వేసికొని, యింటికి వచ్చి, తన

స్నేహితులను, పొరుగు వారిని పిలిచి - మీరు వారితోకూడా సంతోషించుడి. తప్పి పోయిన నా గొఱ్ఱె దొరికినదని వారితో చెప్పనుగదా. అటువలె మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది మంది నీతిమంతుల విషయముపై కలుగు సంతోషము కంటే మారు మనస్సుపొందు ఒక్క పాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును.'

పై వాక్య భాగమును పరిశీలించిన యెడల యీ క్రింది విషయములను గమనింపవచ్చును.

### (1) గొఱ్ఱెయొక్క తప్పిపోయిన స్థితి :

ఒక 'తప్పి పోయిన గొఱ్ఱె' మందనుండి వేరుపడి, త్రోవ తప్పి, అరణ్యములో చిక్కుకుని, దారి తెలియక, కాపరికొరకు లేదా తోటి గొఱ్ఱెలకొరకు అరచుచుండును. అటువలె మనుష్యులందరూ దేవుని నుండి వేరుపడి, పాపములో తప్పిపోయి, తిరుగులాడుచున్నట్లు పరిశుద్ధ గ్రంధము తెలియజేయుచున్నది. మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలగెను (యెషయా 53:6). మీరు గొఱ్ఱెలవలె దారి తప్పిపోతిరి (1 పేతురు 2:25). తిన్నని మార్గమును విడిచి, త్రోవ తప్పి పోయిరి (2 పేతరు 2:15). తప్పిపోయిన గొఱ్ఱెవలె నేను త్రోవవిడచి, తిరిగితిని (కీర్తన 119:176). వారందరూ దారి తొలగి, బొత్తిగా చెడియున్నారు. మేలు చేయువారెవరును లేరు, ఒక్కడైనను లేడు (కీర్తన 14:3). నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు. గ్రహించువాడెవడును లేడు. దేవుని వెదకువాడెవడును లేడు. అందరును త్రోవతప్పి, యేకముగా పనికిమాలిన వారైరి (రోమా 3:11-12).

### (2) తప్పిపోయిన గొఱ్ఱెకు పొంచివున్న ప్రమాదము :

తప్పిపోయిన గొఱ్ఱెకు అరణ్యములో దుష్టమృగములనుండి ప్రమాదము పొంచియుండును. అటువలె పాపములో తప్పిపోయిన ప్రతి మనిషికీ 'మరణము' అను ప్రమాదము పొంచియున్నది. పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6:23).

### (3) తప్పిపోయిన గొఱ్ఱెపట్ల దేవునికున్న ప్రేమ

యీ ఉపమానములో చెప్పబడిన గొఱ్ఱెల కాపరి నూరు గొఱ్ఱెలలో తొంబదితొమ్మిదింటిని అరణ్యములో వదలివేసి, తప్పిపోయిన ఆ ఒక్క గొఱ్ఱెను వెదక వెళ్లెను (లూకా 15:4). ఆ గొఱ్ఱె దొరకువరకు వెదకెను. అటువలె దేవుడు పాపములో తప్పిపోయిన మానవుని ప్రేమించి, తనకుమారుడు యేసు క్రీస్తును యీలోకమునకు పంపెనని పరిశుద్ధ గ్రంథము సెలవిస్తున్నది (యోహాను 3:16). మనుష్యులందరూ యేసు క్రీస్తు నందలి రక్షణపొంది, సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము గలవారై యుండవలెనని దేవుడు యిచ్ఛయించు చున్నాడు (1 తిమోతి 2:4). సుంకరియైన జక్కయ్యయింటికి వెళ్లినపుడు యేసుక్రీస్తు 'నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెనని' చెప్పెను (లూకా 19:10). యేసుక్రీస్తు 'నేను పాపులనే పిలువ వచ్చితినిగాని నీతి మంతులను పిలువరాలేదు (మార్కు 2:17), నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని. మంచి కాపరి గొఱ్ఱెలకొరకు తన ప్రాణముపెట్టును (యోహాను 10:11)' అని చెప్పి, పాపములో నశిస్తున్న మానవులపట్ల తన ప్రేమను వ్యక్తపరచెను.

తప్పిపోయిన గొఱ్ఱె కాపరిచేత కనుగొనబడి, యింటికి తీసుకు రాబడిన రీతిలో పాపములో తప్పిపోయిన మానవుడు యేసుక్రీస్తును కాపరిగా, రక్షకునిగా చేర్చుకొని, దేవుని రాజ్యములో ప్రవేశింప వలెనను సత్యమును యీ ఉపమానము ద్వారా తెలుసుకొనుచున్నాము. తద్వారా పరలోకమందు యెంతోసంతోషము కలుగును (లూకా 15:7).

## (c) పోగొట్టుకొనబడిన నాణెము (లూకా 15:8-10) :

'తప్పిపోయిన గొఱ్ఱె' అను ఉపమానములో గొఱ్ఱెను పోగొట్టుకున్న మనుష్యుడు దాని కొరకు వెదకుచూ వెళ్లిన విధానములో పాపములో తప్పిపోయిన మానవులను రక్షించుటకు యేసుక్రీస్తు యీలోకమునకు వచ్చెనను సత్యమును చూచితిమి. యిదే అర్థమునిస్తూ, యేసుక్రీస్తు 'పోగొట్టుకొనబడిన నాణెము' అను

మరొక ఉపమానముచెప్పెను. 'తప్పిపోయిన గొఱ్ఱె' తెలియని తనముతో దేవునికి దూరమై జీవించు మానవుని సూచిస్తున్నది. 'పోగొట్టుకొనబడిన నాణెము' గదిలోనే తన యజమానురాలు కనుగొనలేని విధముగా ఒక మూలనే పడియున్నది. యిది తాము దేవునితోవున్నామని అనుకుని జీవించు వేషధారులను, నామకార్థంగా క్రీస్తును వెంబడించ ప్రయత్నించు వారిని సూచిస్తున్నది.

లూకా 15:8-10లో యీలాగు వ్రాయబడినది : ఏస్త్రీకైనను పది వెండి నాణెములుండగా వాటిలో ఒక నాణెము పోగొట్టుకుంటె ఆమె దీపము వెలిగించి, యిల్లు ఊడ్చి, అది దొరుకు వరకు జాగ్రత్తగా వెదకదా ? అది దొరకినప్పుడు తన చెలికత్తెలను పొరుగు వారిని పిలిచి, నాతోకూడా సంతోషించుడి. నేను పోగొట్టు కొనిన నాణెము దొరికినదని వారితో చెప్పనుగదా. అటువలె మారుమనస్సు పొందు ఒక పాపి విషయమై దేవుని దూతల యెదుట సంతోషము కలుగునని మీతో చెప్పచున్నాననెను.

యీ ఉపమానములో పోగొట్టుకొనబడిన నాణెము చీకటిలో పోగొట్టుకొనబడినదని తెలియుచున్నది. కనుకనే నాణెము కలిగినస్త్రీ దానిని కనుగొనలేక, దీపమును వెలిగించెను (లూకా 15:8). దీపమునుండి కలుగు వెలుగువలన అంధకారము పారదోలబడి, అంధకారములో నున్న వన్నియు కనిపించును. యేసుక్రీస్తు, 'నేను లోకమునకు వెలుగును. నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక, జీవపు వెలుగు కలిగియుండునని' చెప్పెను (యోహాను 8:12). ఆయన మరణమును నిరర్థకము చేసి, జీవమును, అక్షయతను సువార్త వలన వెలుగులోనికి తెచ్చెను (2 తిమోతి 1:10). కనుక దీపము యొక్క వెలుగు చీకటిని పారదోలి, నాణెమును కనుగొనినట్లు, మానవుని హృదయములోని చీకటిని యేసుక్రీస్తు సువార్త పారదోలి, వెలుగులోనికి నడిపించును.

మనిమింకను గమనించిన యెడల, నాణెము పోగొట్టు కొనిన స్త్రీ ఒక చేత్తో వెలిగింపబడిన దీపమును పట్టుకొని, రెండవ చేత్తో చీపురు చేత యిల్లు ఊడ్చి, నాణెము దొరుకువరకు జాగ్రత్తగా వెతికెను (లూకా 15:8). 'దీపపు వెలుగులో

యిల్లు ఊడ్చబడుట' అనునది 'లోకమందంతటా చీకటిలో నివసిస్తున్న జనులను సువార్త సత్యపు వెలుగునొద్దకు నడిపించుట' యను సత్యమును సూచిస్తున్నది. యేసుక్రీస్తు రాజ్యసువార్త ప్రకటించుచు, సమస్త పట్టణముల యందును, గ్రామములయందును సంచారము చేసెను (మత్తయి 9:35). పేతురు, యోహానులు యెరూషలేమునకు తిరిగి వెళ్లుచు, సమరయుల అనేక గ్రామములలో సువార్త ప్రకటించుచు వచ్చిరి (అపొ.కా. 8:25). మరియు యీ రాజ్యసువార్త సకలజనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును. అటుతరువాత అంతము వచ్చును (మత్తయి 24:14)

నాణెమును పోగొట్టుకొన్న స్త్రీ దాని కొరకు యిల్లు ఊడ్చి, అది దొరకువరకు జాగ్రత్తగా వెదకెను. దీనిని బట్టి ఆ స్త్రీ యొక్క దీర్ఘశాంతము, పట్టుదల బయలు పరచబడినవి. ఆలాగుననే దేవుడు, యెవరును నశింపక, అందరూ మారుమనసు పొందవలెనని కోరుచూ, అందరియెడల దీర్ఘశాంతము కలిగియున్నాడు (2 పేతురు 3:9). ఆ అజ్ఞానకాలములను దేవుడు చూచి, చూడనట్టుగా వుండెను. యిప్పడైతే, అంతటను అందరును మారుమనసు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించు చున్నాడు (అపొ.కా.17:30). యేసుక్రీస్తు, "నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమై యున్నది" అని చెప్పెను (యోహాను 4:34). అపొస్తలుడైన పౌలు, "సువార్తను ప్రకటింపవలసిన భారము నామీద మోపబడియున్నది. అయ్యో, నేను సువార్తను ప్రకటింపక పోయిన యెడల నాకు శ్రమ" అని చెప్పెను (1 కొరింథి 9:16).

పైవచనములలో దేవుని దీర్ఘశాంతము, యేసుక్రీస్తు యొక్క మరియు పౌలుయొక్క పట్టుదల అగుపడుచున్నవి. తప్పిపోయిన నాణెమును కనుగొనిన స్త్రీ మిక్కిలి సంతోషించినట్లు, మారుమనసు పొందు ఒక పాపి విషయమై పరలోకములో యెక్కువ సంతోషము కలుగును (లుకా 15:9, 10)

## (d) తప్పి పోయిన కుమారుడు (లూకా 15:11-32) :

'తప్పి పోయిన కుమారుడు' అను ఉపమానము తన తండ్రిని తృణీకరించి, దూరదేశమునకు వెళ్లి, వ్యర్థమైన జీవితము జీవించి, పశ్చాత్తాప పడి, తిరిగి తన తండ్రి చెంతకు చేరిన ఒక కుమారుని గురించి తెలియజేయు చున్నది. 'తప్పి పోయిన కుమారుడు' తెలిసి, కావాలనే దేవుని ధిక్కరించి, దేవునికి దూరముగా జీవించు మానవుని సూచిస్తున్నాడు. యీ ఉపమానము క్రింద తెలుపబడిన మూడు భాగములలో విభజింపబడినది.

### (1) తప్పిపోయిన కుమారుని తిరుగుబాటు స్వభావము :

తప్పిపోయిన కుమారుడు తన తండ్రియొద్దనుండి తనకు రావలసిన ఆస్తిని సమకూర్చుకొని, దూరదేశమునకు ప్రయాణమైపోయి, అచ్చట తన ఆస్తి అంతటిని దుర్వ్యాపారము వలన, వేశ్యా సాంగత్యము వలన పాడుచేసెనని లూకా 15:12,13,30 వచనములలో వ్రాయబడియున్నది. దీనిని బట్టి తప్పిపోయిన కుమారునికి తన తండ్రియింటవుండి జీవించుట యిష్టము లేదని, తన తండ్రిని తృణీకరించి, అతని నుండి వేరుపడి జీవించుటకు యిష్టపడినాడని తెలియుచున్నది. తండ్రి యింటిని వదిలి, దుర్వ్యాపారములో, వేశ్యా సాంగత్యములో జీవించడమనునది మానవుడు దేవుని సన్నిధిని వదిలి, పాపములో జీవించుటకు యిష్టపడు చున్నాడనుటకు సాదృశ్యముగావున్నది. ఇశ్రాయేలీయులు తాముకోరిన వాటినిబట్టియు, చూచిన వాటినిబట్టియు వ్యభిచరించిరి (సంఖ్యా కాండం 15:39). వారు అవిధేయులై, దేవుని మీద తిరుగుబాటు చేసి, ప్రవక్తలను చంపి, దేవునికి బహుగా విసుగు పుట్టించిరి (నెహెమ్యా 9:26). యెషయా 1:2, 5 వచనములో వారు దేవుని మీద తిరుగ బడియున్నారనియు, నిత్యము తిరుగు బాటు చేయుచున్నారనియు చదివెదము. అనేకులు నిరీక్షణ లేని వారును, లోకమందు దేవుడు లేని వారునైయుండి, క్రీస్తుకు దూరస్థులుగా యుంటున్నారు (ఎఫెసీ 2:12). వారు అంధకారమైన మనస్సు గలవారై, తమహృదయ కాఠిన్యము వలన తమలోనున్న అజ్ఞానము చేత దేవుని వలన కలుగు జీవములో నుండి వేరు పరచబడిన వారై, తమ మనస్సునకు కలిగిన వ్యర్థత అనుసరించి, నడచుకొను చున్నారని పరిశుద్ధగ్రంథములో వ్రాయబడియున్నది (ఎఫెసీ 4:18)

## (2) తప్పిపోయిన కుమారుని పశ్చాత్తాపము :

తన ఆస్తి అంతయు పాడుచేసి, కరువు కలిగిన దేశములో ఆకలితో జీవిస్తున్న సమయములో తప్పిపోయిన కుమారుడు తన తప్పిదమును బట్టి పశ్చాత్తాప పడసాగెను (లూకా 15:14-17).

**తన పశ్చాత్తాపములో తప్పిపోయిన కుమారుడు :**

(i) తన తండ్రియింటి ఐశ్వర్యమంతటిని జ్ఞాపకము చేసుకొనెను (లూకా 15:17). దేవుని యింట అత్యధికమైన కృప (1 తిమోతి 1:14), సమృద్ధియైన సత్య సమాధానములు (యిర్మీయా 33:6), విస్తారమైన కృపాసత్యములు (నిర్గమ కాండం 34:6) కలవు.

(ii) వినయ మనస్కుడై, తన తండ్రియింటికి తిరిగివెళ్లి, తనతప్పిదమును తన తండ్రితో ఒప్పకొనుటకు నిర్ణయించుకొనెను (లూకా 15:18, 19). 2 కొరింథీ 7:10లో దైవ చిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగ జేయునని వ్రాయబడియున్నది.

## (3) తప్పిపోయిన కుమారుని తండ్రి యింట చేరిక (లూకా 15:20-24) :

**తప్పిపోయిన కుమారుడు తనతండ్రి యింటిని సమీపించగానే, ఆ తండ్రిక్రింద తెలిపిన ప్రకారము చేసెను.**

(i) తన కుమారుడు దూరముగా నున్నప్పుడే వానిని చూచెను. పశ్చాత్తాప హృదయులైన పాపులందరినీ దేవుడు దృష్టించును. యెహోవా మహోన్నతుడైనను, ఆయన దీనులను లక్ష్యపెట్టును (కీర్తన 138:6).

(ii) తన కుమారుని చూచి, కనికర పడెను. యేసుక్రీస్తు మానవుల పట్ల కనికర పడెను (మత్తయి 9:36; 14:14; 15:32; 20:34)

(iii) తన కుమారుడి మెడమీద పడి, ముద్దు పెట్టుకొనెను. దీనిని బట్టి తండ్రికి తన కుమారుని పట్ల ఉన్న ప్రేమ వ్యక్తమవుతున్నది. పరిశుద్ధ గ్రంథము దేవుడు ప్రేమాస్వరూపియని తెలియ జేయుచున్నది (1యోహాను 4:8). దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమైయుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను (రోమా 5:8).

(iv) తన దాసులతో తన కుమారునికి ప్రశస్త వస్త్రములనిమ్మని చెప్పెను. దేవుడు తన పరిశుద్ధులకు రక్షణ వస్త్రములను ధరింపచేయును (యెషయా 61:10, కీర్తనలు 132:9; ప్రకటన 19:8; జెకర్యా 3:4).

(v) తన కుమారుని చేతికి ఉంగరము పెట్టించి, పాదములకు చెప్పలు తొడిగించెను. ఉంగరము ఒక స్థానమును సూచిస్తుంది. ఫరో తన ఉంగరమును తీసి యోసేపు చేతికి పెట్టెను (ఆది కాండము 41:42). పాపి పశ్చాత్తాపముతో దేవుని యొద్దకు వచ్చినపుడు, దేవుడు అతనిని తన కుమారునిగా స్వీకరించును. ఎఫెసీ 6:15లో "పాదములకు సమాధాన సువార్త వలననైన సిద్ధమనస్సను జోడుతోడుగుకొని నిలువబడుడి" అని వ్రాయబడియున్నది.

(vi) క్రొవ్విన దూడను వధించి, విందు చేయించెను. "నా కుమారుడు చనిపోయి, మరల (బతికెను, తప్పిపోయి దొరికెను" అని, తండ్రి తన యింటి వారందరికిని విందు చేయించి, సంతోషించెను. మారుమనసు పొందు ఒక పాపి విషయమై పరలోకములో అధికమైన సంతోషముకలుగును.

ప్రియులారా, ఈ అధ్యాయములో చెప్పబడిన నాలుగు ఉపమానముల ద్వారా యేసుక్రీస్తు పాపములో తప్పిపోయిన మనుష్యులందరినీ వెదకి, రక్షించాలనే సంకల్పము కలిగియున్నట్లు మనము గమనించుదుము (1తిమోతి 1:15). పరిశుద్ధ గ్రంధము. "ఏ భేదమును లేదు అందరూ పాపముచేసి, దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు (రోమా 3:23); పాపము వలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము (రోమా 6:23)" అని సెలవిస్తున్నది. తమ పాపములను బట్టి

పశ్చాత్తాపపడి, వాటిని ఒప్పుకొని, యేసుక్రీస్తును రక్షకునిగా హృదయమందు విశ్వసించి, తమ పాపములను క్షమించుమని అడుగు వారందరికీ దేవుడు నిత్య జీవమిచ్చి రక్షించుటకు యిష్టపడు చున్నాడు (రోమా 10:9; 10). వారి పాపములను యిక యెన్నడును జ్ఞాపకము చేసికొనననని (యెషయా 43:25; హెబ్రీ 10:17; యిర్మియా 31:34) ప్రభువు సెలవిచ్చుచున్నాడు. యూదారాజైన హిజ్కియా ఆరోగ్యము పొందిన తరువాత 'నీ వీపు వెనుక తట్టు నా పాపము లన్నియు నీవు పారవేసితివి' అని రచించెను (యెషయా 38:17). 'వారి పాపములన్నియు సముద్రపు అగాధములో నీవు పడవేతువు' అని మీకా 9:17లో వ్రాయబడియున్నది. 'పడమటికి తూర్పు యెంతదూరమో ఆయన మన అతిక్రమములను మనకు అంతదూరపరచి యున్నాడు' అని దావీదు రాజు కీర్తన 103:12 లో చెప్పెను. ప్రియులారా, యీ ఉపమానముల ద్వారా దేవుడు మీతో మాటలాడుచున్న యెడల, మీరింక యేసు ప్రభువును సొంతరక్షకునిగా యెరుగకుండిన యెడల, "ప్రభువా ! నేను పాపిని. నా పాపములు క్షమించుము. నా కొరకు సిలువలో మీరు రక్తము కార్చినందుకు వందనములు. మీ రక్తముతో నన్ను కడుగుము. మీ శాంతి, సమాధానము నాకు దయచేసి, మీ బిడ్డలలో నన్ను చేర్చుకొనుము" అని ప్రార్థించిన యెడల దేవుడు మీ ప్రార్ధనవిని, మిమ్ములను రక్షించును.

# 2.దేవుని రాజ్యము యొక్క విలువ

ప్రియులారా, యీ లోకములో అనేకులు ఆస్తిపాస్తులకు, అంతస్తులకు, ఉద్యోగములకు యిచ్చెడు విలువ ఆత్మీయమైన, దైవికమైన సంగతులకు యివ్వరు. పరిశుద్ధ గ్రంధములో ఏశావు అనెడువ్యక్తి ఒక పూట కూటి కొరకు యెంతో ప్రాధాన్యమైన తన జ్యేష్టత్వపు హక్కును అమ్మివేసికొనెనని వ్రాయబడియున్నది (హెబ్రీ 12:16). యింకొక వ్యక్తి విస్తారమైన ఆస్తిని సమకూర్చుకొని, సంతోషముతో జీవింతుననుకొనగా, దేవుడు 'వెర్రివాడా, యీ రాత్రి నీ ప్రాణము నడుగు చున్నాను. నీవు సిద్ధ పరచినవి ఎవనివగునని' అతనితో చెప్పెను (లూకా 12:18-20). దేవుని రాజ్యము యొక్క విలువ, మానవుడు దాని పట్ల కలిగియుండవలసిన విధానమును గురించి తెలియజేస్తూ, యేసు క్రీస్తు క్రింద తెలిపిన రెండు ఉపమానములను చెప్పెను.

## (a) దాచబడిన ధనము (మత్తయి 13:44)

మత్తయి 13:44లో ఒక మనుష్యుడు పొలములో దాచబడిన ధనమును కనుగొని, అది దొరికిన సంతోషముతో వెళ్లి, తనకు కలిగినదంతయు అమ్మి, ఆ పొలమును కొనునని వ్రాయబడియున్నది. ప్రియులారా, దేవుని రాజ్యము అత్యధికమైన విలువ గలది గనుకనే దాచబడిన ధనముతో పోల్చబడియున్నది.

### (1) దేవుని రాజ్యము నీతి, సమాధానము, పరిశుద్ధాత్మయందలి ఆనందము కలిగిన రాజ్యము (రోమా 14:17) :

విశ్వాసులు క్రీస్తునందలి విశ్వాసమును బట్టి దేవుడు అను గ్రహించు నీతిని కలిగియుందురు (ఫిలిప్పి 3:9). విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుందుము (రోమా 5:1). క్రీస్తు నందు విశ్వాసముంచువారు చెప్పనశక్యమును, మహిమాయుక్తమునైన సంతోషము గలవారై, ఆనందించుదురు (1 పేతురు 1:8).

## (2) దేవుని రాజ్యము అంధకారశక్తుల నుండి విడుదల కలిగించురాజ్యము

'ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులనుగా జేసెను (కొలొస్సయులకు 1:13).

## (3) దేవుని రాజ్యము కదలింపబడనిది, శాశ్వతమైనది :

మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క నిత్య రాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అను గ్రహింపబడును (2 పేతురు 1:11). అటుతరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి, తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును. ఎందుకనగా తన శత్రువుల నందరినీ తన పాదముల క్రింద ఉంచువరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను (1కొరింథి 15:24, 25).

పైన తెలుపబడిన మూడు సంగతులను బట్టి యేసు క్రీస్తు ద్వారానే మనము నీతి, సమాధానము సంతోషములు కలిగిన, అంధకార శక్తులు లేని, నిత్యమైన దేవుని రాజ్యములో ప్రవేశింపగలమని తెలియుచున్నది. కనుక యేసుక్రీస్తు యెంత వెలగల ధనమో మనము గమనించుదుము. ఆయనయందు సర్వ సంపూర్ణత నివసించును (కొలొస్సయులకు 1:19; యోహాను 1:16).

పొలములో దాచబడిన ధనము కనుగొనిన మనుష్యునికి సంతోషము కలిగినట్లుగా మత్తయి 13:44 లో చదువుచున్నాము. క్రీస్తును కనుగొనిన వారికి మహాసంతోషము కలుగును. ఈధనమును స్వతంత్రించుకొనుటకు ఆ మనుష్యుడు తనకు కలిగినదంతయు అమ్మి, ఆపొలమును కొనెను (మత్తయి 13:44). 'కలిగిన దంతయు అమ్ముట'యనునది ఉపేక్షించుకొనుటను సూచిస్తున్నది. అనగా ఒకడు తనకు కలిగినవన్నియు నష్టముగా యెంచుకొని, క్రీస్తును వెంబడించుట (మత్తయి 16:24-25). నిత్యజీవమును పొందుటకు

నేనేమి చేయవలెనని ఒక అధికారి యేసుక్రీస్తును అడిగినపుడు, 'నీకు కలిగిన వన్నియు అమ్మి, బీదలకిమ్ము. నీవువచ్చి నన్ను వెంబడింపుమని' యేసు అతనితో చెప్పెను (లూకా 18:22). ప్రియులారా, అనేకులకు క్రీస్తును వెంబడించే విషయములో శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములు ఆటంకముగా నిలుచును. అయితే వీటిని అధిగమించినపుడే 'క్రీస్తు' అను మహా విలువ గల ఐశ్వర్యమును మనము స్వతంత్రించుకొనగలము. అపొస్తలుడైన పౌలు క్రీస్తు నిమిత్తము, క్రీస్తునుగూర్చిన అతి శ్రేష్ఠమైన జ్ఞానము నిమిత్తము ఏవేవి తనకు లాభకరములై యుండెనో వాటన్నింటిని క్రీస్తు నిమిత్తము నష్టముగా యెంచుకొనెను (ఫిలిప్పి 3:7,8).

## (b) అమూల్యమైన ముత్యము (మత్తయి 13:45, 46) :

'దాచబడిన ధనము' ఉపమానములో ఒక మనుష్యుడు ఊహించని రీతిలో ఒక పొలములో ధనమును కనుగొనెను.' అమూల్యమైన ముత్యము' అను ఈ ఊపమానములో మంచిముత్యముల కొరకు వెదకుచున్న యొక వర్తకుడు అమూల్యమైన యొక ముత్యమును కనుగొనినట్లు మత్తయి 13:45,46 లో చదివెదము. అనగా ఈ వర్తకుడు మంచి, అమూల్యమైన ముత్యము కొరకు వెదకుచున్నట్లు మనము గమనించ వలెను. ప్రియులారా, ఈ లోకములో సత్యము చేత అనుకోకుండా సంధించబడిన వారు కొందరైతే, సత్యాన్వేషులుగా వుంటున్నవారు మరికొందరు.

పరలోక రాజ్యమునకు పండ్రెండు గుమ్మములు పండ్రెండు ముత్యములు. ఒక్కొక్కగుమ్మము ఒక్కొక్క ముత్యముతో కట్టబడి యున్నది (ప్రకటన 21:21). అది నీతి, సమాధానము, ఆనందములు కలిగిన ప్రదేశము. కనుకనే ఒక 'అమూల్యమైన ముత్యము'గా వర్ణింపబడియున్నది. ఈ ఉపమానములో చెప్పబడిన వర్తకుడు ముందునుండియే ముత్యముల వ్యాపారము బహుశా చేస్తున్నవాడేమో. అయినప్పటికీ, తృప్తి చెందక, ఒక అమూల్యమైన ముత్యముకొరకు వెదకు చున్నాడు. పరిశుద్ధ గ్రంథములో 'నీతికొరకు ఆకలిదప్పలు గలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు'. అని వ్రాయబడియున్నది (మత్తయి 5:6). సత్యము కొరకు అన్వేషిస్తూ, దానిని

కనుగొని, దేవుని రాజ్యమును (అమూల్యమైన ముత్యమును) పొందిన నలుగురు వ్యక్తులను మనము క్రింద చూచెదము.

**(1) నీకొదేము :** నీకొదేము ఒక పరిసయ్యుడు, యూదుల అధికారి (యోహాను 3:1). పరిసయ్యులు యూదుల మతాచారముల యందు యెంతో నిష్టకలిగిన వారు. అతనికున్న ఆశను బట్టి, రాత్రివేళ యేసు క్రీస్తునొద్దకు వచ్చి, సత్యమును గూర్చి విచారించెను (యెూహాను 3:1-12). పిమ్మట యేసునందు విశ్వాసముంచెనని మనము తెలిసికొందుము (యోహాను 19:39,40).

**(2) ఐతియోపీయుడైన నపుంసకుడు :** ఐతియోపీయుడైన నపుంసకుడు యెరూషలేమునకు వచ్చి, ఆరాధించి, తిరిగి తన రథములో వెళుతూ, యెషయా గ్రంథము చదువు చుండెను (అపొ.కా. 8 : 27-28). దేవుడు అతనికున్న ఆశను యెరిగియుండెను గనుకనే ఫిలిప్పను అతని యొద్దకు పంపి, సువార్త వినిపించుట ద్వారా అతడు క్రీస్తునందు విశ్వాసముంచి, బాప్తిస్మము తీసుకొనెను. (అపొ.కా.8:29-38).

**(3) కొర్నేలీ :** కొర్నేలీ భక్తిపరుడై, తనయింటివారందరితో కూడ దేవునియందు భయభక్తులు గలవాడైయుండి, ప్రజలకు బహుధర్మము చేయుచు, ఎల్లప్పడును దేవునికి ప్రార్థన చేయువాడని అపొ.కా.10:1,2 లో వ్రాయబడియున్నది. కొర్నేలీకి సత్యము యెడల వున్న ఆసక్తిని బట్టి దేవుడు పేతురును అతని యొద్దకు పంపడం ద్వారా అతనితోపాటు అన్యజనులు అనేకులు క్రీస్తునందు విశ్వాసముంచిరి (అపొ.కా.10:46).

**(4) లూదియ :** లూదియ తుయతైర పట్టణములో నివసిస్తూ, ఊదారంగు పొడిని అమ్ముతూ, దైవభక్తి గలదైయుండెనని అపొ.కా. 16:14లో చదివెదము. ప్రభువు ఆమె హృదయమును తెరచెను గనుక పౌలు చెప్పిన మాటలయందు లక్ష్యముంచి, క్రీస్తునందు విశ్వాసముంచి, తన యింటి వారితో కూడా రక్షణ పొందెను (అపొ.కా.16:15).

ప్రియులారా, సత్యమును, నీతి, సమాధానమును, ఆనందమును కనుగొనవలెనన్న ఆశ మనకు కలిగియున్న యెడల, ఆశగల ప్రాణమును దేవుడు తృప్తిపరచునని పరిశుద్ధ గ్రంథములో వ్రాయబడియున్నది (కీర్తన 107:9). అమూల్యమైన ముత్యమును కనుగొనిన వర్తకుడు తనకు కలిగినదంతయు అమ్మి, ఆముత్యమును కొనెనని మత్తయి 13:46లో చెప్పబడినది. సత్యమును యెరుగుటకు మనకు కలిగినవన్నీ నష్టముగా యెంచుకొనవలెనని దీనిని బట్టి మనము తెలిసి కొనుచున్నాము. ప్రియులారా, 'క్రీస్తు' అను 'అమూల్యమైన ముత్యము', 'దాచబడిన ధనము'ను మీరు కనుగొని యున్నారా ?

## 3. దేవుని రాజ్యము యొక్క యెదుగుదల

ప్రియులారా, అనాదికాలమునుండి యెంతో మంది తమ పాపపుస్థితిని దేవుని యెదుట ఒప్పుకొని, దేవుడిచ్చు రక్షణను స్వీకరించి, ఆయన రాజ్యములో ప్రవేశించిరి. నేటి దినములలో కూడా, సువార్తను నమ్మి, యెందరో క్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా దేవుని రాజ్యవారసులగుచున్నారు. తద్వారా దేవునిరాజ్యము అంతకంతకూ ప్రబలుచున్నది. ఈ యెదుగుదలను వర్ణిస్తూ, క్రిందనివ్వబడిన మూడు ఉపమానములు పరిశుద్ధ గ్రంథములో చెప్పబడెను.

### (a) విత్తబడిన ఆవగింజ (మత్తయి 13:31,32; మార్కు 4:30-32; లూకా 13:18,19) :

ప్రియులారా, ఆవగింజ మనకు చాలా చిన్నదిగా కనబడును. అయితే అది విత్తబడినపుడు, మొలిచి, కూరమొక్కలన్నిటిలో పెద్దదై, ఆకాశపక్షులు వచ్చి, దాని కొమ్మలయందు నివసించునంత చెట్టగును (మత్తయి 13:32). యేసుక్రీస్తు భూమిమీద జన్మించినపుడు యెవరూ ఊహించని రీతిలో పశువుల పాక యందు పరుండబెట్ట బడియుండెను. అయితే ఆయన పెరిగి, పెద్దవాడైనపుడు అనేకుల నిమిత్తము తన ప్రాణమును పెట్టి, విమోచన క్రయధనముగా తనను అర్పించుకొనెను. యెష్షయి మొద్దు నుండి చిగురు పుట్టును. వాని వేరుల నుండి అంకురము ఎదిగి, ఫలించును (యెషయా 11:1). లేత మొక్కవలెను, యెండిన భూమిలో మొలిచిన మొక్కవలెను అతడు ఆయన యెదుట పెరిగెను (యెషయా 53:2). అయితే క్రీస్తు సంఘము పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ లేనంతగా వృద్ధి చెందుచున్నది (మత్తయి 16:18).

అపొ.కా.1:15లో నూట యిరువది మంది శిష్యులతో మొదలైన సంఘమునకు అపొ.కా.2:41లో మూడువేల మంది చేర్చబడిరి. అపొ.కా.2:47లో ప్రభువు రక్షణపొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెనని వ్రాయబడినది. అపొ.కా. 4:4లో అయిదు వేలమంది పురుషులు చేర్చబడిరి.

అపొ.కా. 5:14లో పురుషులును, స్త్రీలును అనేకులు మరి యెక్కువగా విశ్వాసులై, ప్రభువు పక్షమున చేర్చబడిరని వ్రాయబడినది. మరియు 'దేవుని వాక్యము ప్రబలమై శిష్యుల సంఖ్య యెరూషలేములో బహుగా విస్తరించెననియు(అపొ.కా. 6:7), బహుజనులు ప్రభువు పక్షమున చేరిరనియు (అపొ.కా.11:24) మనము చదివెదము. పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చినపుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ, సమరయ దేశముల యందంతటను, భూదిగంతముల వరకును నాకు సాక్షులై యుందురని యేసుక్రీస్తు తన శిష్యులతో చెప్పెను (అపొ.కా.1:8).

దానియేలు 2:34,35లో రాజైన నెబుకద్నెజరునకు స్వప్నమందు అగుపడిన గొప్ప ప్రతిమ యొక్క పాదముల మీద చేతి సహాయములేక తీయబడిన ఒక రాయిపడి, దాని పాదములను తుత్తు నియలుగా విరగగొట్టెననియు, ఆ రాయి సర్వ భూతలమంత మహాపర్వతమా యెననియు చదువు చున్నాము. యీ రాయి క్రీస్తు స్థాపింపబోవు రాజ్యమును సూచిస్తున్నది. అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి, కొండలకంటె ఎత్తుగా ఎత్తబడును (యెషయా 2:2). ఇది మొదలుకొని, మితిలేకుండ దానికి వృద్ధియు, క్షేమమును కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును, రాజ్యమును నియమించును (యెషయా 9:7).

ప్రియులారా, క్రీస్తు సంఘము (రాజ్యము) బహుచిన్నదిగా మొదలై, బలమైన, శాశ్వతమైన రాజ్యముగా వృద్ధినొందునని పైవచనముల ద్వారా తెలియు చున్నది. విత్తబడిన ఆవగింజ మొలిచి, కూరమొక్కలన్నిటిలో పెద్దదై, ఆకాశపక్షులు వచ్చి, దాని కొమ్మలయందు నివసించునంత చెట్టయినట్లు, క్రీస్తు సంఘమునకు అనేకులు అంటుకట్టబడి, క్రీస్తునుండి దొరికే శాంతి, సమాధానము, ఆనందములను అనుభవించుదురు (రోమా 14:17; మత్తయి 11:28-30; హోషేయ 14:7; యోహాను 14:27).

## (b) పుల్లని పిండి (మత్తయి 13:33; లూకా 13:20,21)

'విత్తబడిన ఆవగింజ' ఉపమానములో దేవుని రాజ్యము యొక్క 'దృశ్యమైన' యెదుగుదల గురించి చెప్పబడినది. 'పుల్లని పిండిని' గూర్చిన ఈ ఉపమానములో దేవుని రాజ్యము యొక్క 'అదృశ్యమైన' యెదుగుదలను మనము గమనించెదము. మత్తయి 13:33 లో పరలోక రాజ్యము ఒక స్త్రీ, పిండి అంతయు పులిసి, పొంగువరకు మూడుకుంచముల పిండిలో దాచిపెట్టిన 'పుల్లనిపిండి'ని పోలియున్నదని వ్రాయబడియున్నది. ప్రియులారా, స్త్రీని 'బలహీనమైన ఘటము'గా పరిశుద్ధ గ్రంథము వర్ణిస్తున్నది (1 పేతురు 3:7). బలహీన మనుష్యుల సముదాయమైన సంఘమునకు లోకమును సువార్త చేత పులియ జేసేపని అప్పగింపబడినది.

**పుల్లని పిండికి యీ క్రింద చెప్పబడిన గుణములున్నవి.**

**(1)** పుల్లనిపిండి పులియ జేయును లేక పొంగజేయును. యిది బలమైన దేవుని వాక్యమును సూచిస్తున్నది. దేవుని వాక్యము సజీవమై, బలముగలదై, రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా వుండి, ప్రాణాత్మలను, కీళ్లను, మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను, ఆలోచనలను శోధించుచున్నది (హెబ్రీ 4:12). పుల్లని పిండి బలముగా, తిగురులేనివిధంగా పనిచేయునట్లు దేవుని వాక్యముకూడా బలముగా పని చేయును. పౌలు, సీలలు సువార్త పరిచర్య జరిపించినపుడు, 'భూలోకమును తలక్రిందు చేసిన వారు'గా యెంచబడిరి (అపొ.కా.17:6).

**(2)** పుల్లని పిండి కంటికి కనిపించని రీతిలో, క్రమక్రమంగా, మౌనముగా పని చేయును. పుల్లని పిండి యేలాగు పని చేస్తున్నది అన్నది అంతర్గతము. అయితే దాని ఫలితము బహిర్గతము. అలాగే, క్రీస్తు సువార్త కంటికి కనిపించని రీతిలో మనిషి హృదయాంతరంగములోనికి ప్రవేశించును. అయితే, తద్వారా ఆమనిషిలో కలిగిన మార్పు అందరికీ కనబడును. యీ సత్యమును

తెలియ జేస్తూ, యేసు క్రీస్తు నీకొదేముతో, 'గాలితన కిష్టమైన చోటను విసరును; నీవు దాని శబ్దము విందువే గాని అది యెక్కడనుండి వచ్చునో, యెక్కడికిపోవునో నీకు తెలియదు. ఆత్మమూలముగా జన్మించిన ప్రతివాడును అలాగే యున్నాడు' అని చెప్పెను (యోహాను 3:8).

**(3)** .పుల్లని పిండి వైఫల్యముగాకుండా, తుదమట్టుకు, ముద్ద అంతయు పులియువరకు పనిచేయును. పుల్లని పిండి సువార్తను సూచిస్తే, ముద్ద లోకమంతటినీ సూచిస్తున్నది. కొంచెముగా కలుపబడిన పుల్లని పిండి ముద్ద అంతయు పులియునట్లు చేయును. అందుకే, 'పులిసిన పిండి కొంచెమైనను ముద్ద అంతయు పులియజేయును' అని గలతి 5:9లో వ్రాయబడియున్నది. యిదే రీతిలో, ఆది సంఘముతో ప్రారంభమైన సువార్త పరిచర్య లోకమంతయు విస్తరించుచున్నది. ఈ సువార్త సర్వలోకములో ఫలించుచు, వ్యాపించును (కొలొస్సయులకు 1:6); ఆకాశము క్రింద వున్న సమస్త సృష్టికి ప్రకటింపబడును (కొలొస్సయులకు 1:23). ఈ రాజ్య సువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును; అటు తరువాత అంతమువచ్చును (మత్తయి 24:14).

ప్రియులారా యీ ఉపమానములో చెప్పబడినట్లు యే ఒక్క దేశము విడిచిపెట్టబడకుండా ప్రపంచ దేశములన్నిటిలోను యీ సువార్త ఆయా రీతులలో ప్రకటింపబడు చున్నది. అనేకులు ప్రపంచమంతటా సువార్తకులోబడి, దేవుని రాజ్యవారసులగుచున్నారు. దేవుని బలమైన వాక్యము మిమ్ములను సంధించినదా?

## (c) యెదుగుచున్న విత్తనము (మార్కు 4:26-29) :

దేవుని రాజ్యము యొక్క యెదుగుదల గురించి చెప్పబడిన ఉపమానములలో యిది మూడవ ఉపమానము. 'విత్తబడిన ఆవగింజ' ఉపమానము ద్వారా మిక్కిలి చిన్నదైన ఆవగింజ విత్తబడి, మహావృక్షముగా యెదిగి, ఆకాశపక్షులకు ఆశ్రయ మిచ్చిన రీతిలో దేవుని రాజ్యము చిన్నదిగా ఆరంభమై, మహాగొప్పరాజ్యముగా చేయబడి, అనేకులకు ఆశ్రయమిచ్చునని చూచితిమి. 'పుల్లని పిండి' ఉపమానములో కొంచెముగా కలుపబడిన పుల్లని పిండి తన పులియజేయు శక్తితో ముద్దంతయు పులియజేసిన రీతిలో దేవుని సువార్త

యెరుషలేములో మొదలై, లోకమంతటా వ్యాపించి, అనేకులను మార్చునని చూచితిమి. 'విత్తబడిన ఆవగింజ ఉపమానము దేవుని రాజ్యపు యెదుగుదలయొక్క 'పరిమాణము'ను సూచిస్తే 'పుల్లని పిండి' ఉపమానము దేవుని రాజ్యపు యెదుగుదల యొక్క' సంపూర్ణత'ను సూచిస్తున్నది. 'యెదుగుచున్న విత్తనము' అను యీ ఉపమానము, దేవుని రాజ్యపు యెదుగుదల 'అంచెలంచెలు'గా వుండునన్న సత్యమును తెలియజేయుచున్నది.

మార్కు 4:26-27 వచనములలో ఒక మనుష్యుడు భూమిలో విత్తనము చల్లి, రాత్రింబగళ్లు నిద్రపోవుచు, మేల్కొనుచునుండగా, వానికి తెలియని రీతిగా ఆ విత్తనము మొలిచి, పెరిగినట్లే దేవుని రాజ్యమున్నదని వ్రాయబడినది. సువార్త వాక్యమను విత్తనము మనిషి హృదయములో నాటబడినపుడు పరిశుద్ధాత్మ దేవుడు మనకు తెలియని రీతిగా ఆ వాక్యము ఆ మనిషి మారుమనస్సు పొందునట్లు చేయును. యిది ఒక మర్మము. కనుకనే, 'సత్యవాక్యము వలన ఆయిన మనలను తన సంకల్ప ప్రకారము కనెననియు' (యాకోబు 1:18), 'లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి' అనియు (యాకోబు 1:21) పరిశుద్ధ గ్రంథములో వ్రాయబడినది. యీ వాక్యము రెండంచులు గల వాడియైన ఖడ్గము కంటెను పదునైనది (హెబ్రీ 4:12). దేవుడు, 'నిష్ఫలముగా నాయొద్దకు మరలక అదినాకు అనుకూలమైన దాని నెరవేర్చును. నేను పంపిన కార్యమును సఫలము చేయును' అని తన వాక్యమును గూర్చి యెషయా 55:11లో చెప్పెను. మనుష్యుడు నిద్రబోవుచు, మేల్కొనుచు నుండగా విత్తనము మొలిచినట్లు, మనిషి హృదయములో నాటబడిన సువార్త బీజము వెనువెంటనే కాకపోయినప్పటికీ, యుక్తకాలమందు మొలుచునని, గమనించుదుము.

భూమి మొదట మొలకను, తరువాతవెన్నును, అటుతరువాత వెన్నులో ముదురు గింజలను తనంతట తానే పుట్టించును (మార్కు 4:28). యీ ప్రకారమే మారుమనస్సు పొందిన మనిషియొక్క జీవితములో ఆత్మీయ యెదుగుదల ఆయా దశలలో అంచెలంచెలుగా జరుగును. పరిశుద్ధ గ్రంథము 2 కొరింథి 3:18లో,

‘మనమందరమును ముసుకులేని ముఖముతో ప్రభువు యొక్కమహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమ నుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము’ అని సెలవిచ్చుచున్నది. మారుమనస్సు పొంది, క్రీస్తును వెంబడిస్తూ ఆత్మీయంగా యెదుగువారుదరూ, ‘సజీవమైన రాళ్లవలెనుండి, ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు’ (1 పేతురు 2:5). విత్తనము మొలిచిన తరువాత మొలకలు ఆత్మీయరూపకముగా చిన్న పిల్లలను సూచిస్తున్నవి (1 యోహాను 2:12); అలాగే వెన్నులు యౌవ్వనస్థులను (1 యోహను 2:13), ముదురు గింజలతో కూడిన వెన్నులు తండ్రులను (1 యోహాను 2:13) సూచిస్తున్నవి.

# 4.దేవుని రాజ్య సమీపత్వము - క్రీస్తు రెండవ రాకడ

ప్రియులారా, యేసుక్రీస్తు భూమి మీద మానవరూపములోనున్నపుడు, తన పరిచర్య ప్రారంభించి, “కాలము సంపూర్ణమై యున్నది. దేవుని రాజ్యము సమీపించి యున్నది; మారు మనస్సు పొంది సువార్త నమ్ముడని” చెప్పచు, దేవుని సువార్త ప్రకటించుచు, గలిలయకు వచ్చెనని మార్కు 11:15లో చదివెదము. అపొస్తులుడైన పౌలు, ‘మీరు కాలము నెరిగి, నిద్ర మేలు కొను వేళయైనదని తెలిసికొని, ఆలాగు చేయుడి. మనము విశ్వాసులమైనప్పటికంటే యిప్పడు, రక్షణ మనకు మరి సమీపముగా వున్నది’ అని చెప్పెను (రోమా 13:11). యింకను, “ఇదిగో నేను త్వరగావచ్చుచున్నాను, ఈ గ్రంథములోని ప్రవచన వాక్యములను గైకొనువాడు ధన్యుడు” (ప్రకటన 22:7) మరియు “అపవిత్రుడైన వాడు ఇంకను అపవిత్రడుగానే యుండనిమ్ము, నీతిమంతుడు ఇంకను నీతిమంతుడుగానే యుండనిమ్ము. పరిశుద్ధుడు ఇంకను పరిశుద్ధుడుగానే యుండనిమ్ము. ఇదిగో త్వరగా వచ్చు చున్నాను. వానివాని క్రియ చొప్పన ప్రతివానికిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నా యొద్ద వున్నది” (ప్రకటన 22:11-12), అని యేసుక్రీస్తు చెప్పెను. అపొస్తలుడైన యోహాను ప్రకటన 22:20లో “ఈ సంగతులను గూర్చి సాక్ష్యమిచ్చువాడు - అవును, త్వరగా పచ్చుచున్నానని చెప్పచున్నాడు. ఆమేన్; ప్రభువైన యేసూ రమ్ము” అని వ్రాసెను. యింకను, ‘ఈ సంగతులు త్వరలో సంభవింపనైయున్నవనియు’ (ప్రకటన 1:1), ‘సమయము సమీపించినదనియు’ (ప్రకటన 1:3) మనము చదివెదము. తన రెండవ రాకడ బహు సమీపముగా వున్నదని తెలియజెప్పటకు యేసు క్రీస్తు “చిగురించు అంజూరపు చెట్టు” అను ఉ పమానమును చెప్పెను.

## (a) చిగురించు అంజూరపు చెట్టు :

### (మత్తయి 24:32-44; మార్కు 13:28-32; లూకా 21:29-33) :

మత్తయి 24:32-35లో “అంజూరపు చెట్టును చూచి ఒక ఉపమానము

నేర్చుకొనుడి. అంజూరపు కొమ్మ లేతదై చిగిరించినప్పుడు వసంతకాలము యింక సమీపముగా ఉన్నదని మీకు తెలియును. ఆ ప్రకారమే మీరీ సంగతులన్నియు జరుగుట చూచునప్పుడు ఆయన సమీపముననే, ద్వారము దగ్గరనే యున్నాడని తెలిసికొనుడి. ఇవన్నియు జరుగువరకు ఈ తరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. ఆకాశమును, భూమియు గతించునుగాని నామాటలు యేమాత్రమును గతింపవు" అని వ్రాయబడియున్నది.

మత్తయి సువార్త 24వ అధ్యాయములో యేసు క్రీస్తు ప్రధానముగా తన రెండవ రాకడకు ముందు జరుగబోవు సూచనలు తెలియజేసెను. వసంత కాల సమీపములో అంజూరపు చెట్టు చిగిరించినట్లు యీ సూచనలు జరుగునపుడు తనరాకడ సమీపముగా వుండునని ఈ ఉపమానము ద్వారా యేసుక్రీస్తు తెలియజేసెను. క్రీస్తు రెండవరాకడ, ఆయన రాజ్యస్థాపన గురించి క్రింది విషయములను మనము గమనించెదము.

### (1) క్రీస్తు రాకడ యే ఘడియలో వుండునో యెవరికీ తెలియదు

తన రాకడను గురించి యేసుక్రీస్తు సూచనలు తెలిపెను గాని సమయము, ఘడియలను తెలుపలేదు (మత్తయి 24:27, 36, 44; మత్తయి 25:13; మార్కు 13:33; లూకా 21:34-36).

### (2) క్రీస్తు రెండవ రాకడను గురించి ముఖ్యమైన సూచనలు :

(i) మత్తయి సువార్త 24వ అధ్యాయములో తెలియజేసిన రీతిగా అబద్ధ క్రీస్తులు వచ్చెదరు. యుద్ధములను గూర్చియు, యుద్ధసమాచారములను గూర్చియు విందుము. జనము మీదికి జనమును, రాజ్యము మీదికి రాజ్యమును లేచును. అక్కడక్కడ కరవులును, భూకంపములును కలుగును (మత్తయి 24:4-8).

(ii) క్రీస్తు రెండరాకడ జరుగు దినములు నోవహు దినములవలె వుండును (లూకా 17:26-27). నోవహు ఓడలోనికి వెళ్లిన దినము వరకు జనులు తినుచు, త్రాగుచు,

పెండ్లాడుచు, పెండ్లి కియ్య బడుచు నుండిరి. అంతలో జల ప్రళయము వచ్చి, వారినందరినీ నాశనము చేసినట్లు క్రీస్తు రెండవ రాకడ సమయములో జరుగును.

(iii) క్రీస్తు రెండవ రాకడకు మునుపు దేవుని రాజ్యసువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును (మత్తయి 24:14; 2 పేతురు 3:9)

## (3) క్రీస్తు రెండవ రాకడ జరుగు విధము :

(i) పరలోకమునకు చేర్చుకొనబడిన రీతిలో భూమికి తిరిగివచ్చును (అపొ.కా.1:9-11)

(ii) మేఘారూఢుడై వచ్చును (మత్తయి 24:30; ప్రకటన 1:7)

(iii) దొంగ వచ్చినట్లు వచ్చును (1 థెస్స 5:2,3; 2 పేతురు 3:10-11)

(iv) అగ్నిజ్వాలలలో వచ్చును (2 థెస్సలొనీకయులకు 1:7,8)

(v) మహిమలో, దూతలతో వచ్చును (మత్తయి 25:31)

## (4) క్రీస్తు రెండవ రాకడలోని ఉద్దేశ్యములు

(i) క్రీస్తు నందలి విశ్వాసులను మహిమ పరచి, వారి రక్షణ పరిపూర్ణము చేయుటకు (కొలొస్సి 3:4; ఫిలిప్పి 3:20, 21; 1యోహాను 3:2; 1 కొరింథి 15:51,52; 1 థెస్సలొనీకయులకు 4:13-18; యోహాను 14:3; హెబ్రీ 9:28)

(ii) క్రీస్తు నందలి విశ్వాసులకు ఫలమిచ్చుటకు (మత్తయి 16:27; ప్రకటన 11:18; 1 కొరింథి 3:12-15; 2 కొరింథి 5:10)

(iii) లోకమునకు తీర్పు తీర్చుటకు (మత్తయి 25:32-46; హెబ్రీ 9:27; యోహాను 5:22,23, యోహాను 12:48; దానియేలు 12:2; ప్రకటన 20:12-15; 2థెస్స 1:8,9; ప్రకటన 21:8)

(iv) నూతన సృష్టి కలుగ జేయుటకు (1కొరింథి 13:12; హెబ్రీ 11:16; 2 పేతురు 3:13; యెషయా 65:17, 66:22; ప్రకటన 21:1-4).

ప్రియులారా, లోకములో ప్రస్తుతము ఉన్న పరిస్థితులు యేసుక్రీస్తు రెండవరాకడ చాలా సమీపముగా ఉన్నదన్న సత్యమును సూచిస్తున్నవి. క్రీస్తు నిత్యరాజ్యములో పాలివారముగా వున్న గోరినయెడల యేసుక్రీస్తును సొంత రక్షకునిగా అంగీకరించి, మారుమనసు పొందవలయును. అట్టివారందరూ దేవుని ఉగ్రతనుండి తప్పించబడుదురు. క్రీస్తు నందలి విశ్వాసులు మహాదేవుడును, మన రక్షకుడునైన యేసు క్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షతకొరకు యెదురు చూచుచు, ఈలోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రతుకుచుండవలెనని పరిశుద్ధ గ్రంథము బోధించుచున్నది (తీతు 2:13). ఆలాగు జీవించుటకు దేవుడు మనకు తోడైయుండును గాక.

## 5. దేవుని రాజ్యమునకు ఆహ్వానము - తృణీకారము

ప్రియులారా, దేవుడులోకమును యెంతోప్రేమించుచున్నాడు. యేసుక్రీస్తునందున్న పాపక్షమాపణ, నిత్య జీవమును పొందవలెనని కోరుకొనుచున్నాడు (యోహాను 3:16; 5:24). మత్తయి 11:28లో యేసుక్రీస్తు 'ప్రయాసపడి, భారము మోసికొనుచున్న సమస్త జనులారా నాయొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగ జేతునని' చెప్పెను, అయితే ఆనాటి యూదులు ఆయన పిలుపును తృణీకరించిరి. యెరూషలేమును గూర్చి 'యెరూషలేమా, యెరూషలేమా, ప్రవక్తలను చంపుచును, నీయొద్దకు పంపబడిన వారిని రాళ్లతో కొట్టుచును ఉ ండుదానా, కోడి తన పిల్లలను రెక్కల క్రింద కేలాగు చేర్చుకొనునో ఆలాగే నేనును నీ పిల్లలను ఎన్నోమారులు చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లకపోతిరి' అని యేసుక్రీస్తు దుఃఖించెను (మత్తయి 23:37). యూదులు క్రీస్తును, క్రీస్తు రాజ్యముయొక్క ఆహ్వానమును తృణీకరించి, ఆయనను సిలువ వేసిన రీతిలో అనేకులు నేటి దినములలో కూడా దేవుని రాజ్య ఆహ్వానమును తృణీకరించుచున్నారనుటకు యీ క్రింది ఉపమానములు పరిశుద్ధ గ్రంథములో చెప్పబడెను.

### (a) యిద్దరు కుమారులు (మత్తయి 21:28-32) :

మత్తయి 21:30 వచనములో ఒక మనుష్యుడు తన రెండవ కుమారునితో ద్రాక్షతోటలో పనిచేయుమని చెప్పగా అతడు, 'నేను పోయెదనని' చెప్పి, పోలేదని వ్రాయబడినది. క్రీస్తును తృణీకరించు వారిలో మొదటిరకము 'చేసెదమని' బాహ్యముగా చెప్పి, చేయకుండు వారు. లూకా 6:46లో యేసు క్రీస్తు, 'నేను చెప్పమాటల ప్రకారము మీరు చేయక, 'ప్రభువా, ప్రభువా' అని నన్ను పిలుచుట యెందుకు ?' అని ప్రశ్నించెను. 'ప్రభువా, ప్రభువా' అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించునని యేసుక్రీస్తు మత్తయి 7:21లో

సెలవిచ్చెను. కొరాజీను, బేత్సయిదా అను పట్టణముల వారు యేసు యెన్ని అద్భుతములు జరిగించినను వారు మారు మనసు పొందకుండుట చూచి, వారిని గద్దించెను (మత్తయి 11:21). యూదులు ఆయన చుట్టు పోగై, నీవు క్రీస్తువైతే మాతో చెప్పమనగా ఆయన, 'మీతో చెప్పితినిగాని మీరు నమ్మరు' అనెను (యెహాను 10:25). యిర్మియా 8:6లో పశ్చాత్తాపడువాడు ఒకడును లేడని వ్రాయబడిన ప్రకారము శాస్త్రులు, పరి సయ్యులు అనేకులు ఆయనను తృణీకరించిరి (మార్కు 8:31).

అయితే, మత్తయి 21:28,29 వచనాల్లో పైన చెప్పబడిన మనుష్యుడు తన పెద్ద కుమారునితో ద్రాక్షతోటలో పని చేయమని చెప్పగా, వాడు 'పోను' అని ఉత్తరమిచ్చి, తరువాత మనసు మార్చుకొని, పోయెనని వ్రాయబడినది. రెండవకుమారుడు శాస్త్రులు, పరిసయ్యులను సూచిస్తే, పెద్ద కుమారుడు సుంకరులు, పాపులను సూచిస్తున్నాడు. కనుకనే యేసుక్రీస్తు మత్తయి 21:31లో సుంకరులును, వేశ్యలును మీకంటే ముందుగా దేవుని రాజ్యములో ప్రవేశించుదురని మీతో నిశ్చయముగా చెప్ప చున్నానని ప్రధాన యాజకులతో చెప్పెను. పరిసయ్యులు, ధర్మశాస్త్రోపదేశకులు బాప్తిస్మమిచ్చు యోహాను బోధను, తమ విషయమైన దేవుని సంకల్పమును తృణీకరించగా, సుంకరులు యోహాను బోధవిని, బాప్తిస్మము పొంది, దేవుడు న్యాయవంతుడని యొప్పకొనిరి (లూకా 7:29,30).

దుష్టుడు తాను చేసిన పాపములన్నింటిని విడిచి, నాకట్టడలను అనుసరించి, న్యాయమును జరిపించిన యెడల అతడు మరణము నొందడు, అవశ్యముగా అతడు బ్రదుకు నని దేవుడు సెలవిచ్చు చున్నాడు (యెహెజ్కేలు 18:21). అవిధేయులుగాను, మోసపోయినవారుగాను, నానా విధములైన దురాశలకును, భోగములకును దాసులైయుండి, దుష్టత్వమునందును, అసూయయందును కాలముగడుపుచు, యొకనినొకడు ద్వేషించుచున్న ప్రతివారును రక్షకుడైన క్రీస్తు యొక్క కృపను కోరుకొని, రక్షింపబడి, పరిశుద్ధాత్మ

ద్వారా నూతన స్వభావము పొందవలెనని దేవుడు మానవులనందరనీ ఆహ్వానిస్తున్నాడు (తీతు 3:3-7)

## (b) దుష్టులైన ద్రాక్షతోట కాపులు

**(మత్తయి 21:33-44; మార్కు 12:1-12; లూకా 20:9-19)**

యేసుక్రీస్తు 'ఆహ్వానమును' త్రోసిపుచ్చి, ఆయనను తృణీకరించు వారిలో రెండవ రకము వారిని గురించి యీ ఉపమానము తెలియ జేయుచున్నది. రెండవ రకమువారు నిక్కచ్చిగా, బాహాటముగా యేసును ధిక్కరింతురు యూదామతపెద్దలు, ప్రధాన యాజకులు, పరిసయ్యులను గూర్చి యేసు ఈ ఉపమానము చెప్పెను. యీ ఉపమానము చెప్పిన వెంటనే తమను గూర్చియే దానిని చెప్పెనని ప్రధానయాజకులును, పరిసయ్యులును గ్రహించి, యేసుక్రీస్తును పట్టుకొన జూచిరి (మత్తయి 21:45,46).

ఈ ఉపమాన వాక్య భాగము (మత్తయి 21:33-44) పరిశీలించినట్లయితే, యీ క్రింది విషయములు మనము గ్రహించుదుము.

### (1) 33వ వచనము : యింటి యజమానుడు ద్రాక్షతోట నాటించెను:

తండ్రియైన దేవుడు యింటియజమానుని, ఇశ్రాయేలు జనులు ద్రాక్షతోటను సూచిస్తున్నారు. దేవుడు ఇశ్రాయేలు జనులను ఏర్పరచు కొనెననియు, వారు ఆయన సేవకులనియు, తనకు కీర్తి, స్తోత్ర మహిమలు కలుగుటకై ఇశ్రాయేలు వంశస్థులను దేవుడు పిలిచెనని పరిశుద్ధ గ్రంథము సెలవిచ్చుచున్నది (యెషయా 41:8; 1దినవృత్తాంతములు 16:12-14; యిర్మియా 13:11)

### (2) యింటి యజమానుడు ద్రాక్షతోటకు కంచెవేయించెను :

కంచె దేవుని ధర్మశాస్త్రమును, న్యాయవిధులను సూచిస్తున్నది. ఆయన తన వాక్యము యాకోబునకు తెలియజేసెను. తన కట్టడలను తన న్యాయవిధులను

ఇశ్రాయేలునకు తెలియజేసెను (కీర్తన 147:19). కంచె ద్రాక్షతోటకు రక్షణనిచ్చినట్లు దేవుని వాక్యము శత్రువు నెదిరించుటకు మనకు సహాయపడును (మత్తయి 4:1-11; ఎఫెసీ 6:17).

## (3) యింటి యజమానుడు ద్రాక్షతోటలో ద్రాక్షలతొట్టి తొలిపించెను :

ద్రాక్షల తొట్టి ద్రాక్షతిత్తుల నుండి ద్రాక్షారసము తీయబడుటకు వాడబడును. తోటలోని ద్రాక్ష తీగెలు ఫలములు ఫలించి, వాటిని తొట్లలో వేయబడుట ద్వారా తియ్యటి ద్రాక్షారసము లభించినట్లు, ఇశ్రాయేలు జనులు యిర్మియా 13:11లో చెప్పబడినట్లు దేవునికి కీర్తి, స్తోత్ర, మహిమలు కలుగు జీవితము జీవించవలెనని దేవుడు ఉద్దేశించియున్నాడు.

## (4) యింటి యజమానుడు ద్రాక్షతోటలో గోపురము కట్టించెను

ద్రాక్షతోట కావలివారు గోపురము(లేక బురుజు) యెక్కి, ద్రాక్షతోటచుట్టూ జంతువులు లేక మనుష్యులెవరైనా వున్నయెడల కనుగొందురు. ద్రాక్ష తోటను కాచుటకు యీ బురుజు ఉపయోగపడును.

యింటి యజమానుడు ద్రాక్ష తోట నాటించి, కంచె వేయించి, ద్రాక్షల తొట్టి తొలిపించి, గోపురము కట్టించిన తరువాత కాపులకు దాని గుత్తకిచ్చెనని మత్తయి21:33లో చదివెదము. ఇశ్రాయేలు జనులు దేవుని మార్గములో నడుచునట్లు చూచు బాధ్యతను ధర్మ శాస్త్రోప దేశకులు, శాస్త్రులు, పరిసయ్యులు, ప్రధానయాజకులు, యూదుల మత పెద్దలు కలిగియుండిరి. ద్రాక్షతోట కావలి వారు బురుజునెక్కి, ద్రాక్షతోటను కాయుచు, ద్రాక్షతీగెలు ఫలించినపుడు ద్రాక్షతొట్టి ద్వారా వాటి రసమును తీసి, యింటి యజమానునికి అప్పగింపవలెను. అదే రీతిలో యూదుల మతపెద్దలు దేవుని న్యాయ విధులను ఇశ్రాయేలు జనులకు బోధించి, వారు దేవునికి తిరగబడి, అన్య దేవతలను పూజింపకుండా హెచ్చరించి, దేవుని మహిమపరచు జీవితములు వారు జీవించునట్లు సహాయపడవలెననునది

దేవుని వుద్దేశ్యమైయున్నది.

అయితే, మత్తయి 21:34-36 వచనాల్లో యింటి యజమానుడు పండ్లకాలము సమీపించినపుడు తన దాసులను కాపుల యొద్దకు పంపినపుడు వారు కొందరిని కొట్టి, కొందరిపై రాళ్లురువ్వి, మరికొందరిని చంపినట్లు మనము చదువుచున్నాము. యిదే విధానములో, దేవుడు తన ప్రవక్తలను పంపినపుడు యూదులమత పెద్దలు, శాస్త్రులు, పరిసయ్యులు జరిగించిరి. 2 దినవృత్తాంతములు 36:15-16లో, 'వారి పితరుల దేవుడైన యెహోవా తన జనులయందును, తన నివాస స్థలమందును కటాక్షము గలవాడై వారియొద్దకు తన దూతల ద్వారా వర్తమానము పంపుచువచ్చెను. ఆయన పెందలకడ లేచి, పంపుచువచ్చినను, వారు దేవుని దూతలను ఎగతాళి చేయుచు, ఆయన వాక్యములను తృణీకరించుచు, ఆయన ప్రవక్తలను హింసించిరని' వ్రాయబడినది. యేసు క్రీస్తు శాస్త్రులు, పరిసయ్యులతో, 'ఇదిగోనేను మీ యొద్దకు ప్రవక్తలను, జ్ఞానులను, శాస్త్రులను పంపుచున్నాను; మీరు వారిలో కొందరిని చంపి, సిలువవేయుదురు. కొందరిని మీ సమాజ మందిరములలో కొరడాలతో కొట్టి, పట్టణము నుండి పట్టణమునకు తరుముదురని' చెప్పెను (మత్తయి 23:34)

చివరికి యింటి యజమానుడు తనకుమారుని సన్మానించు దురనుకొని, తన కుమారుని, కాపుల యొద్దకు పంపగా వారు అతనిని ద్రాక్షతోట వెలుపట పడవేసి, చంపిరి (మత్తయి 21:39). యిదే విధానములో దేవుడు తన సొంత కుమారుడైన యేసుక్రీస్తును యీలోకమునకు పంపినపుడు యూదుల ప్రధాన యాజకులు, అధికారులు ఆయనను తృణీకరించి, శిబిరము వెలుపల సిలువవేసిరి (లూకా 23:21; హెబ్రీ 13:12,13).

యూదులు క్రీస్తును తృణీకరించినందుకు 'దేవుని రాజ్యము మీ యొద్ద నుండి తొలగింపబడి, దాని ఫలమిచ్చు జనులకియ్యబడునని' మత్తయి 21:43లో చెప్పబడినట్లు అన్యజనులు క్రీస్తును అంగీకరించి, రక్షణపొందిరి.

## (c) పెండ్లివిందు (మత్తయి 22:2-14)

ప్రియులారా, యేసు క్రీస్తును తృణీకరించు వారిలో మూడవరకమును గురించి తెలుపుతూ, 'పెండ్లి విందు' అను ఈ ఉపమానము చెప్పబడినది. మూడవ రకమువారు క్రీస్తు పిలిచినపుడు ఆ పిలుపును 'అలక్ష్యము' చేయుదురు లేదా 'ఉదాశీనత' కనబరచెదరు.

మత్తయి 22:2-14లో వ్రాయబడిన 'పెండ్లి విందు' అను ఈ ఉపమానమును పరిశీలించిన యెడల క్రింద తెలుపబడిన విషయములు గమనించెదము.

(i) పరలోక రాజ్యము తన కుమారునికి పెండ్లి విందు చేసిన యొక రాజును పోలియున్నది (మత్తయి 22:2) :

పరిశుద్ధ గ్రంథములో యేసుక్రీస్తు ఒక పెండ్లి కుమారుడు గాను (యోహాను 3:29), ఆయన విమోచించిన సంఘము ఒక పెండ్లికుమార్తె గాను (ప్రకటన 19:7,8; 21:2,9) వర్ణింపబడియున్నారు. దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తుకు, సంఘమనబడిన పెండ్లికుమార్తెకు వివాహము జరిగించి, పెండ్లి విందు ఏర్పరచి, ఆ విందునకు మానవులనందరినీ ఆహ్వానించుచున్నాడు.

(ii) పెండ్లి విందు గురించి మనము ఆలోచించిన యెడల నాలుగు విషయములు మన దృష్టికి వచ్చును.

1. పెండ్లి వస్త్రములు 2. తిండివంటలు 3. సంతోషము 4. సహవాసము

**1) పెండ్లి వస్త్రములు :** సాధారణముగా వివాహములకు వెళుతున్నవారు వివాహములో అందరికీ చక్కగా కనబడవలెనన్న ఉద్దేశ్యముతో మంచి వస్త్రములు ధరించి, వెళ్లుదురు. పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె మరెంతో చక్కని వస్త్రములు ధరించి యుందురు. పరిశుద్ధగ్రంథములో చెప్పబడిన యీ వివాహమునకు, పెండ్లి

విందుకు వచ్చుటకు దేవుడు ప్రజలకందరికీ 'రక్షణ వస్త్రములను' యివ్వగోరుచున్నాడు. అందుకే యెషయా 61:10లో 'ఆయన రక్షణ వస్త్రములను నాకు ధరింపజేసి యున్నాడు. నీతి అను పైబట్టను నాకు ధరింప జేసియున్నాడు' అని చదివెదము.

**2) తిండి వంటలు:** పెండ్లి విందులో రకరకములైన తిండివంటలుండును. మత్తయి 22:4లో రాజు, 'ఇదిగో నా విందు సిద్ధపరచియున్నాను; ఎద్దులును, క్రొవ్వినపశువులును వధింపబడినవి; అంతయు సిద్ధముగా వున్నది' అని సెలవిస్తున్నాడు. యెషయా 25:6లో 'ఈ పర్వతము మీద సైన్యములకధిపతియగు యెహోవా సమస్త జనముల నిమిత్తము క్రొవ్వినవాటితో విందు చేయును. మడ్డిమీదనున్న ద్రాక్షారసముతో విందు చేయును. మూలుగు గల క్రొవ్విన వాటితో విందు చేయును' అని దేవుడు చేయు విందును గురించి వ్రాయబడియున్నది.

**3) సంతోషము :** వివాహమునకు వచ్చిన వారందరూ సంతోష వదనములతో కనిపిస్తారు. పరిశుద్ధ గ్రంథములో చెప్పబడిన గొర్రెపిల్ల (యేసుక్రీస్తు) వివాహములో పాల్గొనువారు కూడా మిక్కిలి సంతోషము కలిగియుందురు (ప్రకటన 19:7) దేవుడు వారికి యేసుక్రీస్తునందలి రక్షణానందమును అనుగ్రహించును (యెషయా 51:11; 61:10; 1పేతురు 1:8-9).

**4) సహవాసము :** పెండ్లి విందు సహవాసమును సూచిస్తున్నది. యేసుక్రీస్తు మనకిచ్చుచున్న జీవాహారమును, జీవజలమును స్వీకరించుట ద్వారా (యోహాను 4:14; 6:35; 7:37) ఈ ఉపమానములో చెప్పబడిన పెండ్లివిందులో యేసుక్రీస్తుతో కూడా సహవాసము కలిగియుందుము. క్రీస్తు రాజ్యములో ఆయన బల్లయొద్ద అన్నపానములు పుచ్చుకొనెదము (లూకా 22:30). ఈ సహవాసమునకు (1కొరింథి 1:9; 1 యోహాను 1:3) దేవుడు మానవులను ఆహ్వానిస్తున్నాడు (ప్రకటన 22:17).

అయితే, మత్తయి 22:4-6వచనాల్లో చెప్పబడినట్లు రాజు తన దాసులను పంపినపుడు పెండ్లి విందుకు పిలువ బడినవారు రానొల్లకపోయిరనియు, అలక్ష్యము చేసి, ఒకడు తన పొలమునకును, మరియొకడు తన వర్తకమునకు వెళ్లిరి. మరికొందరు రాజు యొక్క దాసులను పట్టుకుని అపమానపరచి, చంపిరనియు చదువు చున్నాము. 'మీకు జీవము కలుగునట్లు మీరు నా యొద్దకు రానొల్లరు' అని యేసుక్రీస్తు యోహాను 5:40 లో యూదులనుద్దేశించి చెప్పెను. ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను, ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు (యోహాను 1:11).

మత్తయి 22:8-10వచనములలో పిలువబడిన వారు పెండ్లి విందుకు రాకుండుటను బట్టి రాజు తనదాసులతో రాజమార్గములకు పోయి,మీకు కనబడువారినందరిని పిలువుడని చెప్పెనని చదివెదము. యూదులు క్రీస్తు రాజ్యమును తృణీకరించుటను బట్టి అన్యజనులనేకులు, ఆయన యందు విశ్వాసముంచిరి (మత్తయి 8:11). పరిశుద్ధ గ్రంథములో రోమా 15:12లో 'మరియు యెషయా యీలాగు చెప్పచున్నాడు. యెష్షయిలోనుండి వేరు చిగురు, అనగా అన్యజనులనేలుటకు లేచువాడు వచ్చును; ఆయనయందు అన్యజనులు నిరీక్షణయుంచుదురు' అని వ్రాయబడిన ప్రకారము అన్యజనులనేకులు యేసుక్రీస్తు రక్షణను పొందుచున్నారు.

దేవుని కుమారుడు యేసుక్రీస్తు యొక్క వివాహపు విందులో పాల్గొనుటకు 'రక్షణ వస్త్రములు' లేక 'పెండ్లి వస్త్రములు' తప్పనిసరిగా అవసరము అన్న సత్యమును మత్తయి 23:11-13 వచనములలో గమనించుదుము. ప్రియులారా, ప్రభువైన యేసు క్రీస్తు ద్వారా దేవుడిచ్చుచున్న యీ రక్షణ వస్త్రములను కలిగియున్నారా ?

## (d) గొప్ప విందు (లూకా 14:16-24) :

'పెండ్లి విందు' ఉపమానమునకు తుల్యమైనది' 'గొప్పవిందు' ఉపమానము. ప్రభువైన యేసుక్రీస్తు యీరెండు ఉపమానములను రెండు వేర్వేరు

సందర్భములలో చెప్పెను. 'పెండ్లి విందు' ఉపమానము ఇశ్రాయేలు జనులనుద్దేశించి చెప్పబడగా, 'గొప్పవిందు' ఉపమానము అందరినీ ఉద్దేశించి చెప్పబడినట్లున్నది. 'గొప్ప విందు' ఉపమానములో యేసుక్రీస్తును తృణీకరించు వారిలో నాలుగవ రకమును గూర్చి చెప్పబడినది. వీరు 'అనేక సాకులు' చెప్పి, యేసుక్రీస్తు పిలుపును త్రోసిపుచ్చుదురు.

'గొప్పవిందు' అనునది యేసుక్రీస్తునందు మనకున్న మహిమైశ్వర్యమును (కొలొస్సి 1:27), ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును (ఎఫెసి 1:3), శోధింప శక్యముగాని ఐశ్వర్యమును (ఎఫెసి 3:8) సూచిస్తున్నది. లూకా 14:16 లో 'ఒక మనుష్యుడు గొప్పవిందు చేయించి, అనేకులను పిలిచెను' అని వ్రాయబడినది. యీవచనము దేవుడు క్రీస్తునందు మానవుల కందరికీ సిద్ధపరచిన గొప్ప ఐశ్వర్యమును అనుభవించుటకు అందరినీ ఆహ్వానించుచున్నాడన్న సత్యమును తెలుపుచున్నది. రోమా 1:6లో 'మీరును యేసుక్రీస్తు వారుగా వుండుటకు పిలువబడియున్నారని' వ్రాయబడియున్నది. ఆయన, మనుష్యులందరు రక్షణ పొంది, సత్యమును గూర్చిన అనుభవజ్ఞానముగలవారైయుండవలెనని యిచ్ఛయించు చున్నాడు (1 తిమోతి 2:4)

లూకా 14:18లో విందునకు పిలువబడిన వారు ఏక మనస్సుతో నెపములు చెప్పసాగిరని వ్రాయబడియున్నది. లూకా14:18-20 వచనములలో వారు చెప్పిన నెపముల వివరములు యివ్వబడినవి. వీటిని పరిశీలించినచో కొందరు వ్యాపారార్థమైన పనులను బట్టియు, మరికొందరు కుటుంబ సంబంధ బాధ్యతలను బట్టియు నెపములు చెప్పి, విందు కొరకైన పిలుపును తృణీకరించిరి. యేసు క్రీస్తు మరియ, మార్తలయింటికి వెళ్లినపుడు, మరియ యేసు పాదముల యొద్దకూర్చుండి, ఆయన బోధ వినుచుండెను. మార్త విస్తారమైన పని కలిగియుండెను. యేసు మార్తతో, 'మార్తా మార్తా, నీవనేకమైన పనులను గూర్చి విచారముకలిగి, తొందర పడుచున్నావుగాని అవసరమైనది ఒక్కటే. మరియ ఉత్తమమైన దానిని యేర్పరచుకొనెను, అది ఆమె యొద్దనుండి తీసివేయ బడదని'

ఆమెతో చెప్పెను (లూకా 10:38-42). యేసుక్రీస్తు, 'దేవుని రాజ్యమును ఆయన నీతిని మొదట వెదుకుడి. అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును' అని ఐహిక విచారము చేయువారిని ఉద్దేశించి చెప్పెను (మత్తయి 6:33).

గొప్పవిందు సిద్ధ పరచిన మనుష్యుడు రాలేమని నెపములు చెప్పిన వారిని బట్టి కోపగించి, పట్టణపు వీధులు, సందులలోని బీదలను, అంగహీనులను, కుంటివారిని, గ్రుడ్డివారిని గొప్పవిందునకు పిలిపించెను. యూదులు సువార్తను తృణీకరించుట బట్టి అన్యజనులు సువార్తను నమ్మిరి (మత్తయి 21:43). యూదుల మత పెద్దలు సువార్తను తృణీకరించుటను బట్టి సుంకరులు, పాపులు సువార్తను నమ్మి, పరలోక రాజ్యములో ప్రవేశించిరి (మత్తయి 21:31-32).

ప్రియులారా, ఈ అధ్యాయములో యేసు క్రీస్తును తృణీకరించు ఆయా రకముల వారిని 'ఇద్దరు కుమారులు', 'దుష్టులైన ద్రాక్షతోట కాపులు', 'పెండ్లి విందు', 'గొప్ప విందు' అను ఉపమానముల ద్వారా చూచితిమి. యేసుక్రీస్తు 'యెవడైనను దప్పిగొనిన యెడల నా యొద్దకువచ్చి, దప్పి తీర్చుకొనవలెను (యోహాను 7:37), ప్రయాసపడి, భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును (మత్తయి 11:28)' అని చెప్పెను. ప్రకటన 22:17లో, 'దప్పిగొనిన వానిని రానిమ్ము; ఇచ్ఛయించువానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము' అని వ్రాయబడినది. యేసు క్రీస్తు ఆహ్వానమును తృణీకరింతురా ?

# 6.దేవుని రాజ్యమునకు అవరోధములు

ఎంతో మంది దేవుని రాజ్యసత్యమును తెలిసికొను ప్రయత్నము చేయుదురు. కానీ, దనాపేక్ష, ఐహిక విచారములు మొదలగునవి వారిని దేవుని రాజ్యమును గూర్చి ఆలోచించకుండా చేయును. దేవుని రాజ్యమునకు అవరోధములుగా వున్న సంగతులను తెలియజేస్తూ, యేసుక్రీస్తు పరిశుద్ధ గ్రంథములో క్రింద తెలుపబడిన రెండు ఉపమానములను చెప్పెను.

## (a) వెర్రి ధనవంతుడు (లూకా 12:16-21) :

లూకా 12:1-12 వచనములలో యేసుక్రీస్తు పరిసయ్యుల వేషధారణ గూర్చియు, దేవుని భయము కలిగియుండుటను గూర్చియు, మనష్యుల యెదుట క్రీస్తును ఒప్పకొనుట గూర్చియు బోధించు చుండెను. యివన్నియు యెంతో ఆత్మీయమైన సంగతులు. అయితే యివేవియు వినకుండా ఒక మనుష్యుడు, 'బోధకుడా, పిత్రార్జితములో నాకు పాలు పంచి పెట్టవలెనని నా సహోదరునితో చెప్పమని' యేసుక్రీస్తును అడుగగా, యేసు ధనము గురించియే ఆలోచన కలిగిన ఆమనుష్యుని బట్టి 'వెర్రిధనవంతుడు' అను ఈఉపమానము చెప్పెను. దేవుని రాజ్యములో ప్రవేశించ కుండా చేయుటకు 'ధనాశ' అనునది ఎంతో ప్రాముఖ్యమైన పాత్ర మానవుల జీవితములలో కలిగియున్నదని ఈ ఉపమానము ద్వారా తెలిసికొనవచ్చును.

లూకా 12:16-19 లో ఈలాగు వ్రాయబడినది: ఒక ధనవంతుని భూమి సమృద్ధిగా పండెను గనుక అతడు పంట సమకూర్చుకొనుటకు ఉన్నకొట్లు చాలవు గనుక, వాటిని విప్పి, వాటి కంటె గొప్పవాటిని కట్టించి, అందులో ధాన్యమంతటిని, ఆస్తిని సమకూర్చుకొని, "నా ప్రాణమా, అనేక సంవత్సరములకు, విస్తారమైన ఆస్తి నీకు సమకూర్చబడియన్నది, సుఖించుము, తినుము, త్రాగుము, సంతోషించుమని" చెప్పకొందు నను కొనెను.

పరిశుద్ధగ్రంథములో ధనముగురించి యీ విధముగా చెప్పబడినది.

1. ధనము అస్థిరమైనది (1 తిమోతి 6:17)
2. ధనము పక్షిరాజు ఆకాశమునకు యెగిరిపోవునట్లు రెక్కలు ధరించి, యెగిరిపోవును (సామెతలు 23:5)
3. ధనము తృప్తి పొందించనిది (ప్రసంగి 4:8)

4. ధనము నాశనమును తెచ్చును (ప్రసంగి 5:13)

5. ధనము చెడిపోవునది (యాకోబు 5:2)

6. ధనము శాశ్వతము కాదు (సామెతలు 27:24)

యింకను ధనమును మొదటి స్థానములో వుంచకూడదనియు

(1 రాజులు 3:11,13), ధనమును ఆశించ కూడదనియు (2 రాజులు 5:26), ధన సమృద్ధియందు నమ్మికయుంచకూడదనియు (కీర్తన 49:6; 52:7; సామెతలు 11:28), ధన సమృద్ధిని లక్ష్యపెట్ట కూడదనియు (కీర్తన 62:10) పరిశుద్ధ గ్రంథము మనకు బోధించుచున్నది.

ఉపమానములో చెప్పబడిన ధనవంతుడు ధనమును గురించి పైన చెప్పినవేమీ తెలియక, ధనమే సర్వస్వమనుకొనెను. ఈ ఉపమానములో "నేను" అను పదము 2 సార్లు, "నా" అను అక్షరము 5 సార్లు, "నాకు" అనుపదము ఒకసారి వ్రాయబడినవి. ఈ ధనవంతుడు దేవుని గురించిన ఆలోచన లేక భూసంబంధమైన సుఃఖభోగమును కోరుకొని, తన ధనమును బట్టి అతిశయించెను. కనుకనే దేవుడు "వెర్రి వాడా, యీ రాత్రి నీ ప్రాణము నడుగుచున్నాను; నీవు సిద్ధపరచి నవి యెవని వగునని" అతనితో చెప్పెను (లూకా 12:20). అంతేకాక, 'దేవుని యెడల ధనవంతుడు కాక, తన కొరకే సమకూర్చు కొనువాడు ఆలాగుననే యుండునని' యేసుక్రీస్తు చెప్పెను (మత్తయి 12:21). ఈ ఉపమానము ద్వారా అనేకులు ధన వ్యామోహమును బట్టి దేవుని రాజ్యము చేరలేకయున్నారని గ్రహించుచున్నాము. ధనవంతులుగా వున్న ప్రతి ఒక్కరూ ధన వ్యామోహము కలిగియుందురనుకొనకూడదు. యేసుక్రీస్తును వెంబడించిన వారిలో ధనవంతులు కూడా వున్నారు (జక్కయ్య, లూకా 19:2-10). అయితే దేవుడు ధన వ్యామోహమును బట్టి తనకు దూరముగా వుండువారిని గద్దించుచున్నాడు. యేసు క్రీస్తు, "ఆస్తి గలవారు దేవుని రాజ్యములో ప్రవేశించుట ఎంతో దుర్లభమని" ధనవంతుడైన అధికారిని గూర్చి తన శిష్యులతో చెప్పెను (మార్కు 10:23)

దేవుని యందు ధనవంతులుగా వుండగోరువారు క్రీస్తునందుండి,

ఆయన కొరకు జీవింతురు (2 కొరింథి 5:15), క్రీస్తునందు ఆత్మసంబంధమైన ఆశీర్వాదములు, ఆయన యొక్క అత్యధికమైన కృపామహదైశ్వర్యములు కలిగియుందురు (ఎఫెసి1:3; 2:4-7). వారు యిహసంబంధమైన ధనమును వారి శక్తి కొలదీ బీదలకిచ్చుదురు (లూకా 12:33,34, మత్తయి 19:21; 1తిమోతి 6:17-19) మరియు పరలోకమందు తమధనమును కూడబెట్టుకొందురు (మత్తయి 6:19-21). అంతేగాక ఆత్మసంధమైన విషయములలో సరియైన అవగాహన కలిగియుందురు (యాకోబు 4:13-15; హెబ్రీ 11:26; ఫిలిప్పీ 4:19)

## (b) విత్తువాడు (మత్తయి 13:3-23; మార్కు 4:2-20; లూకా 8:4-15) :

ప్రియులారా, 'వెర్రి ధనవంతుడు' అను ఉపమానములో దేవుని రాజ్యములో ప్రవేశించుటకు ధనము ఒక అవరోధముగా వున్నదని గమనించితిమి. 'విత్తువాడు' అను ఈ ఉపమానములో యేసుక్రీస్తు, మనవుడు దేవుని రాజ్యములో ప్రవేశింప లేక పోవుటకు గల యింకొన్ని కారణములు తెలియజెప్పెను (మత్తయి 13:3-23). ఈ ఉపమానమును పరిశీలించిన యెడల, క్రింద తెలుపబడిన విషయములు విదితమగును.

### (1) విత్తనము సువార్త, విత్తువాడు సువార్త పరిచారకుడు :

మత్తయి 13:3లో విత్తువాడు విత్తుటకు బయలు వెళ్లెనని వ్రాయబడినది. యీ విత్తువాడు దేవుని వాక్యము లేక సువార్త సందేశమును ప్రకటించుటకు బయలువెళ్లిన పరిచారకుని సూచిస్తున్నాడు. అలాగే విత్తనము సువార్త సందేశమును సూచిస్తున్నది. ఈ విత్తనమును యేసుక్రీస్తు, 'రాజ్యమును గూర్చిన వాక్యము'గా వర్ణించెను (మత్తయి 13:18). ఈ విత్తనము శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యమను 'అక్షయ బీజము'గా చెప్పబడినది (1పేతురు 1:23). ఈ విత్తనము ఫలించేదిగావున్నది. అందుకే, 'ఈ సువార్త సర్వలోకములో ఫలించుచు,

వ్యాపించుచున్నట్టుగా మీరు దేవుని కృపను గూర్చివిని సత్యముగా గ్రహించిన నాటనుండి మీలో సయితము ఫలించుచు వ్యాపించుచున్నది' అని వ్రాయబడినది (కొలొస్సి 1:6).

## (2) త్రోవ ప్రక్కన పడిన విత్తనములు (మత్తయి 13:4,19).

విత్తువాడు, విత్తు చుండగా కొన్ని విత్తనములు త్రోవ ప్రక్కనపడెను; పక్షులు వచ్చి వాటిని మ్రింగివేసెను (మత్తయి 13:4). త్రోవలో వాహనములు, మనుష్యులు తిరుగుచుండుట వలన రద్దీగా వుండును. అలాగుననే మనిషి యొక్క హృదయమనెడు త్రోవలో సాతాను తన దురాశలతో రద్దీగా తిరుగులాడు చుండుటవలన సువార్త విత్తనము విత్తబడినపుడు ఆమనిషి గ్రహింపక యుండును. దేవుని స్వరూపియై యున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగసంబధమైన దేవత అవిశ్వాసులైన వారిమనో నేత్రములకు గ్రుడ్డి తనము కలుగ జేసెను (2 కొరింధి 4:4). తద్వారా, విత్తబడిన వాక్యమును దుష్టుడు వెంటనే ఆ మనిషి హృదయములోనుండి యెత్తికొని పోవును (మత్తయ 13:19). సాతాను దురాశలు దేవుని రాజ్యమునకు అవరోధములు.

## (3) రాతినేల యందు పడిన విత్తనములు (మత్తయి 13:5,6)

కొన్ని విత్తనములు చాలమన్నులేని రాతినేలను పడెను; అక్కడమన్నులోతుగా ఉండనందున అవి వెంటనే మొలిచెనుగాని, సూర్యుడు ఉదయించినపుడు అవిమాడి, వేరు లేనందున ఎండి పోయెను (మత్తయి 13:5,6). యీ రెండువచనముల (మత్తయి 13:5,6) భావము యేసు క్రీస్తు మత్తయి 13:20,21 లలో తెలియజెప్పెను. 'రాతి నేలను విత్తబడిన వాడు వాక్యమువిని, వెంటనే సంతోషముతో దాని నంగీకరించును. అయితే అతనిలో వేరు లేనందున అతడు కొంత కాలము నిలుచును గాని వాక్యము నిమిత్తము శ్రమయైనను, హింసయైనను కలుగగానే అభ్యంతర పడును (మత్తయి 13:20, 21).

పైన చెప్పబడిన మనుష్యునిలో వేరు లేనందున, వాక్యము మొలిచి, యెండిపోయినదని మనము చదువుచున్నాము. పరిశుద్ధ గ్రంథములో 2 తిమోతి 3:5లో 'అంత్యదినములలో మనుష్యులు పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించనివారై యుందురని' చదివెదము. యేసుక్రీస్తునందు వేరుపారి యుండవలెనని పరిశుద్ధ గ్రంథము మనకు తెలియజేయుచున్నది (ఎఫెసి 3:17; కొలొస్సి 2:7).

### (4) ముండ్లపొదలయందు పడిన విత్తనములు (మత్తయి 13:7,22) :

కొన్ని విత్తనములు ముండ్లపొదలలో పడెను; ముండ్ల పొదలు యెదిగి వాటిని అణచివేసెను (మత్తయి 13:7). మత్తయి 13:22లో యేసుక్రీస్తు 'ముండ్లపొదలలో విత్తబడినవాడు వాక్యము విను వాడేగాని ఐహిక విచారమును, ధన మోహమును ఆవాక్యమును అణచివేయును గనుక వాడు నిష్ఫలుడవునని' చెప్పెను. క్రీస్తును వెంబడించు విషయములో ఐహిక విచారములు, ధన మోహము ముండ్లపొదలవలె మనుష్యులకు అడ్డుపడు చున్నవని దీనిని బట్టి మనము గమనించెదము. యాకోబు 1:14,15లో "ప్రతి వాడును తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి, మరులు కొల్పబడిన వాడై శోధింపడును. దురాశ గర్భము ధరించి, పాపమును కనగా పాపము పరిపక్వమై, మరణమును కనునని" వ్రాయబడియున్నది.

### (5) మంచి నేలను పడిన విత్తనములు (మత్తయి 13:8,23)

కొన్ని విత్తనములు మంచి నేలను పడి, ఒకటి నూరంతలుగాను, ఒకటి అరువదంతలు గాను, ఒకటి ముప్పదంతలుగాను ఫలించెను (మత్తయి 13:8). మంచినేల అనునది వాక్యమువిని, దానిని గ్రహించువాని హృదయమును సూచిస్తున్నది (మత్తయి 13:23). దేవుని వాక్యమును గూర్చిన గ్రహింపు ప్రభువైన యేసుక్రీస్తు వలన కలుగును. కనుకనే, "మనము సత్యవంతుడైన వానిని

ఎరుగవలెనని దేవుని కుమారుడు వచ్చి, మనకు వివేకమనుగ్రహించి యున్నాడని యెరుగుదుమని" 1 యోహాను 5:20లో వ్రాయబడినది. "నీ ఉపదేశము వలన నాకు వివేకము కలిగెను. తప్పమార్గములన్నియు నాకు అసహ్యములాయెనని" కీర్తన 119:104లో చదివెదము. కీర్తన 119:130లో దేవుని వాక్యము 'తెలివిలేని వారికి తెలివి పుట్టించునని' వ్రాయబడినది.

ప్రియులారా, మంచినేలను నాటబడి, నూరంతలుగా, అరవదంతలుగా, ముప్పదంతలుగా ఫలించుటకు దేవుడు మనకు సహాయము చేయును గాక (ఫిలిప్పి 1:11).

# 7.దేవుని రాజ్యము కొరకైన నిరీక్షణ మరియు సిద్ధపాటు

యేసుక్రీస్తు నందలి విశ్వాసులు ఆయనరాకడను అపేక్షించుచు, ఆయన రాకడలోనిందా రహితులుగా కనబడవలెనని పరిశుద్ధ గ్రంథము తెలుపు చున్నది. కనుక 'మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు ప్రత్యక్షత కొరకు యెదురు చూచు చున్నారు' (1 కొరింథి 1:7) అని వ్రాయబడినది. మరియు, 'సమాధాన కర్తయగు దేవుడే మిమ్మును సంపూర్ణముగా పరిశుద్ధ పరచును గాక. మీ ఆత్మయు, జీవమును, శరీరమును, మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడయందు నిందా రహితముగాను, సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడును గాక' (1 థెస్సలొనీ కయులకు 5:23) అని చదువుదుము. క్రీస్తు రెండవ రాకడలో జరుగు సంగతులను వర్ణిస్తూ అపొస్తలుడైన పేతురు, 'ప్రియులారా, వీటి కొరకు మీరు కనిపెట్టు వారు గనుక శాంతముగలవారై, ఆయన దృష్టికి నిష్కళంకులు గాను, నిందారహితులు గాను కనబడునట్లు జాగ్రత్త పడుడి' (2 పేతురు 3:14) అని చెప్పెను. యేసుక్రీస్తు రెండవ రాకడలో మనము యెట్లు యెదుర్కొన వలయునన్న సంగతులను తెలుపుటకు యేసు క్రీస్తు క్రింద తెలుపబడిన ఉపమానములను చెప్పెను.

## a) బుద్ధిగల కన్యకలు - బుద్ధి లేని కన్యకలు (మత్తయి 25:1-13) :

మత్తయి 25:1లో పరలోక రాజ్యము, తమ దివిటీలు పట్టు కొని పెండ్లి కుమారుని ఎదుర్కొనుటకు బయలు దేరిన పదిమంది కన్యకలను పోలియున్నదని తెలుపుచున్నది. క్రీస్తు సంఘము ఒక కన్యకగా, వరుడిని యెదుర్కొనబోవు ఒక వధువుగా పరిశుద్ధ గ్రంథము వర్ణిస్తున్నది (ప్రకటన 19:7; 21:2,9; 2 కొరింథి 11:2; హొషేయా 2:19). దివిటీలు పట్టుకొని పెండ్లికుమారుని యెదుర్కొనుటకు బయలుదేరిన కన్యకలు, క్రీస్తు సంఘము(విశ్వాసులు) ప్రభువైన యేసుక్రీస్తును తన రెండవరాకడలో యెదుర్కొందురనుటను సూచిస్తున్నారు. వెలిగింప బడిన దివిటీ విశ్వాసి యొక్క సాక్ష్యపు జీవితమును సూచిస్తున్నది. ఈ లోకములో జీవవాక్యమును చేతపట్టుకొని, జ్యోతులవలె జీవిస్తూ, ప్రభువును యెదుర్కొన వలెను

(ఫిలిప్పీ 2:15-16). అయితే, ఈ పదిమంది కన్యకలలో అయిదురు బుద్ధిగలవారనియు మిగతా అయిదుగురు బుద్ధిలేని వారనియు, బుద్ధిగలవారు తమదివిటీలతో కూడా సిద్దెలలో నూనె తీసికొని పోయిరనియు, బుద్ధిలేనివారు తమ దివిటీలు మాత్రమే తీసుకొని, తమతో కూడానూనె తీసుకెళ్లలేదనియు మత్తయి 25:2-4లలో చదివెదము.

బుద్ధిగల కన్యకలు యథార్థముగా క్రీస్తును వెంబడిస్తూ వుండు విశ్వాసులను సూచిస్తున్నారు (2 పేతురు 1:5-8, 10-11; 2 పేతురు 3:14,18; ప్రకటన 14:4). కనుకనే వారి జీవితములలో క్రీస్తు రెండవ రాకడవరకూ నమ్మకముగా జీవించుటకు తీర్మానించుకొని యుందురు (అనగా వారి దివిటీలు ఆరిపోకుండా చివరివరకూ నూనె కలిగియుందురు). బుద్ధి లేని కన్యకలు వేషధారులను సూచిస్తున్నారు. వీరు వెలుపల మనుష్యులకు నీతిమంతులుగా అగపడు చున్నారుగాని, లోపల వేషధారణతోను, అక్రమముతోను నిండియున్నారు (మత్తయి 23:28). వీరుపైకి భక్తిగల వారివలె వుండియు, దాని శక్తిని ఆశ్రయించని వారైయుందురు (2 తిమోతి 3:5). కనుకనే వారి జీవితములలో తమ దివిటీలు వెలుగించుకుని యుండుటకు నూనె లేక యుందురు. పెండ్లి కుమారుడు వచ్చిన సమయములో బుద్ధిగల కన్యకలు ఆయనను యెదుర్కొనిరనియు, బుద్ధిలేని కన్యకలు ఆయన చేత తృణీకరింపబడిరనియు మనము చదివెదము (మత్తయి 25:5-13).

ప్రియులారా, మన జీవితములలో వేషధారణ కలిగియుండుట ద్వారా యేసుక్రీస్తు మనలను చేర్చుకొనక, వెలివేయునన్న సత్యమును ఈ ఉపమానము ద్వారా నేర్చుకుంటున్నాము. పరిశుద్ధ గ్రంథములో, “ఆదినమందు అనేకులు నన్ను చూచి, ప్రభువా, ప్రభువా, మేము నీనామున ప్రవచింపలేదా ? నీ నామమున దయ్యములను వెళ్లగొట్టలేదా ? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయ లేదా ? అని చెప్పదురు. అప్పుడు నేను మిమ్ములను ఎన్నడును ఎరగను. అక్రమము చేయువారలారా, నా యొద్దనుండి పొండని వారితో చెప్పదును” అని యేసుక్రీస్తు మత్తయి 7:22-23 లో సెలవిచ్చెను. క్రీస్తును యెదుర్కొను యథార్థత మన జీవితములలో మనము కలిగియున్నామా ? క్రీస్తు రాకడ యొక్క దినమైనను,

ఘడియైనను మనకు తెలియదు గనుక మెలకువగా నుండవలెను (మత్తయి 25:13).

## (b) ద్వార పాలకుడు (మార్కు 13:32-37)

'బుద్ధిగల కన్యకలు - బుద్ధి లేని కన్యకలు' అను ఉపమానములో మన దివిటీలు వెలిగించుకొని (అనగా యేసుక్రీస్తు సాక్ష్యార్థమైన జీవితములు జీవిస్తూ) క్రీస్తు రెండవ రాకడకొరకు వేచియుండవలెనని చూచితిమి. 'ద్వారపాలకుడు' అను యీ ఉపమానములో 'మెలకువగా వుండి', క్రీస్తు రెండవ రాకడ కొరకు (దేవుని రాజ్యము కొరకు) కనిపెట్టుకొన వలెనన్న సత్యమును గమనించుదుము. మార్కు 13:32-37లో, "ఆదినమును గూర్చియు, ఆగడియను గూర్చియు తండ్రితప్ప ఏమనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు. జాగ్రత్త పడుడి; మెలకువగా నుండి ప్రార్థన చేయుడి; ఆకాలమెప్పడు వచ్చునో మీకు తెలియదు. ఒకమనుష్యుడు తన దాసులకు అధికారమిచ్చి, ప్రతివానికి వాని వాని పనినియమించి, మెలకువగా నుండమని ద్వారపాలకునికి ఆజ్ఞాపించి, యిల్లు విడిచి, దేశాంతరము పోయినట్టే ఆకాలము వుండును. ఇంటియజమానుడు ప్రొద్దు గ్రుంకివచ్చునో, అర్థరాత్రి వచ్చునో, కోడి కూయునప్పడు వచ్చునో, తెల్ల వారునప్పడు వచ్చునో, యెప్పడు వచ్చునో మీకు తెలియదు. ఆయన అకస్మాత్తుగా వచ్చి, మీరు నిద్ర బోవు చుండుట చూచునేమో గనుక మీరు మెలకువగా నుండుడి. నేను మీతో చెప్పచున్నది అందరితోనూ చెప్ప చున్నాను. మెలకువగా నుండుడనెను" అని వ్రాయబడినది.

పై వాక్య భాగములో 'మెలకువగా నుండుడి' అను మాట నాలుగు సార్లు వ్రాయబడినట్లుగా మనము గమనించ వలెను. క్రీస్తు రాజ్యము కొరకు మెలకువగా నుండు ద్వారపాలకుని వలె మనము యెదురు చూడవలయును. ద్వారపాలకుడు మేల్కొనియుండి, తన యజమానుడు వచ్చినపుడు తలుపు తీయునట్లుగా క్రీస్తునందు విశ్వాసులు క్రీస్తు రెండవ రాకడలో నిద్రావస్థను సూచించెడి జీవితములు కాకుండా, యేసు క్రీస్తునామమును మహిమపరచెడి జీవితములు

కలిగి క్రీస్తును యెదుర్కొనవలయునని పై ఉపమానము ద్వారా తెలుసుకొను చున్నాము.

నిద్రించుచున్న మనుష్యునిలో జీవముండును గాని, చలనముండదు. ఆత్మీయంగా నిద్రావస్థలో నుండు విశ్వాసుల పరిస్థితియిలాగేయుండును. విశ్వాసులను నిద్రావస్థలోనికి కొనిపోవు అనేక సంగతులు యీ లోకములో వున్నవి. లూకా 21:34లో, "మీహృదయములు ఒకవేళ తిండివలనను, మత్తువలనను, ఐహిక విచారములవలనను మందముగా వున్నందున ఆదినము అకస్మాత్తుగా మీ మీదికి ఉరివచ్చినట్టు రాకుండ మీ విషయమై మీరు జాగ్రత్తగా వుండుడి" అని దేవుని వాక్యము మనలను హెచ్చరించు చున్నది. 1 థెస్సలొనీకయులకు 5:5-9 వచనములలో, "మీరందరూ వెలుగు సంబంధులును, పగటి సంబంధులునై యున్నారు; మనము రాత్రి వారముకాము, చీకటి వారము కాము. కావున ఇతరులవలె నిద్రపోక మెలకువగా వుండి, మత్తులము కాక యుందము. నిద్ర పోవువారు రాత్రివేళనిద్రపోవుదురు. మత్తుగా వుండువారు రాత్రివేళమత్తుగా వుందురు. మనము పగటి వారమై యున్నాము గనుక మత్తులమైయుండక, విశ్వాస ప్రేమలను కవచము, రక్షణ నిరీక్షణయను శిరస్త్రాణమును ధరించుకొందము. ఎందుకనగా మనప్రభువైన యేసుక్రీస్తు ద్వారా రక్షణ పొందుటకే దేవుడుమనలను నియమించెనుగాని ఉగ్రతపాలగుటకు నియమింప లేదు" అని చదువుచున్నాము.

గెత్సెమనే తోటలో ప్రభువైన యేసుక్రీస్తు తన శిష్యులతో, "మీరుశోధనలో ప్రవేశించకుండునట్లు మెళకువగా వుండి, ప్రార్థన చేయుడని" చెప్పెను (మార్కు 14:38). అపొస్తలుడైన పౌలు "నేను చెప్పునదేమనగా ఆత్మానుసారముగా నడచుకొనుడి. అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు. శరీరము ఆత్మకును, ఆత్మ శరీరమునకును విరోధముగా అపేక్షించును. ఇవి ఒక దాని కొకటి వ్యతి రేకముగా వున్నవి గనుక మీరేవిచేయ నిచ్ఛయింతురో వాటిని చేయకుందురు" అని గలతీ 5:16-17 వచనములలో సెలవిచ్చెను. శరీరకార్యములు మనలను నిద్రావస్థలోనికి కొనిపోవును. ఆత్మ కార్యములు మెలకువగా వుండునట్లు చేయును. కనుక

ఆత్మకార్యములు మన జీవితములో కలిగి, క్రీస్తు రాకడ కొరకు మనము యెదురు చూడవలయును.

## (C) నమ్మకమైన దాసులు (లూకా 12:35-40)

'బుద్ధిగలకన్యకలు బుద్ధిలేని కన్యకలు' అను ఉపమానములో సాక్ష్యపు జీవితము కలిగియుండుట ద్వారా మరియు 'ద్వారపాలకుడు' అను ఉపమానములో నిద్రావస్థ నుండి దూరముగా వుండుట ద్వారా క్రీస్తు రాకడకొరకు మెళకువగా వేచిచూడగలమని తెలిసికొనియున్నాము. 'నమ్మకమైన దాసులు' అను ఈ ఉపమానములో మన నడుములు కట్టుకొని, ఉపచారము చేయుచూ, క్రీస్తు రాకడ కొరకు మెళకువ కలిగియుండవలెనని నేర్చుకొందుము.

లూకా 12:35-40 లలో "మీనడుములు కట్టుకొని యుండిడి, మీ దీపములు వెలుగుచుండనియ్యడి. తమ ప్రభువు పెండ్లి విందునుండి వచ్చి తట్టగానే అతనికి తలుపు తీయుటకు అతడెప్పుడు వచ్చునో అని అతని కొరకు యెదురుచూచు మనుష్యులవలె వుండుడి. ప్రభువు వచ్చి, యేదాసులు మెలకువగా వుండుట కనుగొనునో ఆదాసులు ధన్యులు. అతడునడుము కట్టుకొని, వారిని భోజన పంక్తిని కూర్చుండబెట్టి, తానే వచ్చివారికి ఉపచారము చేయునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. మరియు అతడు రెండవ జామున వచ్చినను, మూడవ జామున వచ్చినను (ఏదాసులు) మెలకువగా వుండుట కనుగొనునో ఆ దాసులు ధన్యులు. దొంగ యే ఘడియను వచ్చునో యింటి యజమానునికి తెలిసిన యెడల అతడు మెలకువగా వుండి, తన యింటికి కన్నము వేయనియ్యడని తెలిసికొనుడి. మీరు అనుకొనని ఘడియలో మనుష్యకుమారుడు వచ్చును గనుక మీరును సిద్ధముగా వుండుడని చెప్పెను" అని వ్రాయబడినది. యీ వాక్యభాగములో 'మెలకువగా వుండుట' అనుమాట మూడు సార్లు, 'సిద్ధముగా వుండుడి' అను మాట ఒక్కసారి వ్రాయబడి యున్నవి. ఈ అధ్యాయములో గత రెండు ఉపమానములు, ప్రస్తుత ఉపమానము కలుపుకుని, 'మెలకువగా వుండుడి' అను మాట యెనిమిది సార్లు వ్రాయబడినట్లు తెలిసికొందుము. దీనిని బట్టి క్రీస్తు

రాకడ కొరకు మెలకువగా వుండి, వేచి చూచుట యెంతప్రాముఖ్యమైనది మనము తెలిసికొనగలము.

యేదైనా పని చేయబూనుకొనినపుడు మనుష్యులు నడుము కట్టుకొందురు. లూకా 12:35లో 'మీనడుములు కట్టుకొనియుండుడి' అను మాటలు ఉపచారములో నిమగ్నమై యుండుడని తెలియజేయుచున్నవి. యోహాను 13:1,5 వచనములో యేసుక్రీస్తు 'భోజన పంక్తిలో నుండి లేచి, తనపై వస్త్రము అవతల పెట్టివేసి, యొకతువాలు తీసుకొని, నడుమునకు కట్టుకొనెను.అంతట పళ్లెములో నీళ్ళు పోసి, శిష్యుల పాదములు కడుగుటకును, తాను కట్టు కొనియున్న తువాలుతో తడుచుటకును మొదలు పెట్టెను' అని చదువు చున్నాము. క్రీస్తు నందలి విశ్వాసులకు ఉపచారము చేయుచుండలెనను సత్యము తెలియజేయుటకు యేసు క్రీస్తు యీ విధముగా చేసెను. 1 పేతురు 1:13లో 'మీ మనస్సు అనునడుము కట్టుకొని, నిబ్బరమైన బుద్ధి గలవారై, యేసు క్రీస్తు ప్రత్యక్షమైనపుడు మీకు తేబడు కృప విషయమై సంపూర్ణ నిరీక్షణ కలిగియుండుడి' అని చదువు చున్నాము. దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండవలెనని 2 తిమోతి 3:17లో చదువుచున్నాము.

'మీదీపములు వెలుగుచుండనియ్యుడి' (లూకా 12:35) అను మాటలు 'బుద్ధిగల కన్యకలు - బుద్ధి లేని కన్యకలు' అను ఉపమానములో చెప్పబడినట్లు యేసుక్రీస్తు కొరకు సాక్ష్యపు జీవితములు జీవిస్తూ వుండవలెనన్న సత్యమును తెలియజేయుచున్నవి. వెలుగు ఫలము సమస్త విధములైన మంచి తనము, నీతి, సత్యమను వాటిలో కనబడుచున్నది కనుక ప్రభువుకేది ప్రీతికరమైనదో దానిని పరీక్షించుచు, వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి (ఎఫెసి 5:9,10).

పైన చెప్పిన విధముగా జీవిస్తూ, క్రీస్తు రాకడ కొరకు మెలకువగా కనిపెట్టుకొనువారు ధన్యులు అట్టివారిని దేవుడు తానే ఘనపరచును.(లూకా 12:37). ఒకడు నన్ను సేవించిన యెడల నన్ను వెంబడింపవలెను. అప్పుడు నేను యెక్కడ వుందునో అక్కడే నాసేవకుడును వుండును. ఒకడు నన్ను సేవించిన యెడల నా తండ్రి అతని ఘనపరచును (యోహాను 12:26)

## (d) నమ్మకమైన, బుద్ధిగల గృహనిర్వాహకుడు (మత్తయి 24:45-51; లూకా 12:42-48) :

ప్రియులారా, క్రీస్తు నందలి విశ్వాసులు నమ్మకమైన, బుద్ధిగల గృహనిర్వాహకులుగా జీవిస్తూ, క్రీస్తు రాజ్యము కొరకు యెదురు చూడవలయునని యీ ఉపమానము మనకు బోధించుచున్నది. లూకా 12:42-44 లో, "ప్రభువు ఇట్లనెను - తగిన కాలమున ప్రతివానికి ఆహారము పెట్టుటకు, యజమానుడు తన యింటివారిమీద నియమించు నట్టి నమ్మకమైన, బుద్ధిగల గృహనిర్వాహకుడెవడు ? ప్రభువు వచ్చి, యెవరిని ఆలాగు చేయుచుండుట కనుగొనునో ఆదాసుడు ధన్యుడు. అతడు తనకు కలిగిన దాని యంతటిమీద వాని యుంచునని మీతో నిజముగా చెప్పుచున్నాను" అని చదువు చున్నాము.

యేసుక్రీస్తును వెంబడించువారు గృహనిర్వాహకులుగా దేవుని వాక్యములో చెప్పబడు చున్నారు. గృహనిర్వాహకుడనగా తన యజమానుని చేత ఏదైనా పని అప్పగెప్పబడి, దానిని నిర్వర్తించువాడు. దేవుడు మనలను తన పని నిమిత్తము యీలోకములో వుంచియున్నాడు. మనవ్యక్తిగత, కుటుంబ జీవితములలో. సహపాటి విశ్వాసులమధ్యను, ఉద్యోగస్థలములలోను క్రీస్తును వెంబడించు విశ్వాసులముగా గృహ నిర్వాహకత్వము కలిగి యున్నాము. మనము బ్రదికినను ప్రభువు కోసమే బ్రతుకు చున్నాము. చనిపోయినను ప్రభువు కోసమే చని పోవుచున్నాము. కాబట్టి బ్రదికినను, చనిపోయినను ప్రభువు వారమైయున్నాము (రోమా 14:8). క్రీస్తు రక్తము విలువగా పెట్టి కొనబడిన వారము గనుక మన దేహముతో దేవుని మహిమ పరచ బద్ధులమైయున్నాము (1 కొరింథి 6:20). మన జీవితములలో పరిశుద్ధత కలిగి (1 పేతురు 1:15), శరీరాశ, నేత్రాశ, జీవపు డంబములను అధిగమించి, దేవుని చిత్తము జరిగిస్తూ జీవించవలెనని (1 యోహాను 2:16,17) దేవుని వాక్యములో హెచ్చరింపబడుచున్నాము. దేవుని నానా విధమైన కృపవిషయమై మంచి గృహనిర్వాహకులై యుండి, ఒక్కొక్కడు కృపావరము పొందిన కొలది ఒకని కొకడు ఉపచారము చేయుమని (1పేతురు

4:10) పరిశుద్ధ గ్రంథము తెలుపుచున్నది. అధ్యక్షులు దేవుని గృహనిర్వాహకులవలె నిందారహితులై యుండవలెను (తీతు 1:7). భార్యలు భర్తలకు విధేయులై యుండుటలోను, భర్తలు భార్యలను ప్రేమించుటలోను, పిల్లలు తమ తల్లిదండ్రుల మాట వినుటలోను, దాసులు తమయజమానులకు విధేయులైయుండుటలోను, యజమానులు తమదాసుల పట్ల న్యాయమైనదియు, ధర్మానుసారమైనదియు జరిగించుటలోను దేవుడు మనుష్యులకు అప్పజెప్పిన గృహనిర్వాకత్వము బయలు పరచబడినది (కొలొస్సి 3:18-4:1).

ఎవరైతే తమకు అప్పజెప్పబడిన గృహనిర్వాహకత్వము నమ్మకముగా, బుద్ధితో జరిగింతురో, వారు తమ ప్రభువునకు కలిగిన దానియంతటి మీద వుంచబడుదురని లూకా 12:44లో చదువు చున్నాము. యోసేపు తన గృహనిర్వాహకత్వము నమ్మకముగా జరిగించుటను బట్టి పోతీఫరు తనకు కలిగినదంతయు అతనికి అప్పగించెను (ఆది కాండం 39:4). తరువాత ఫరో ఐగుప్తు దేశప్రజలందరిపై అధికారిగా వుండునట్లు దేవుడు యోసేపును హెచ్చించెను (ఆది కాండం 41:40). తమ నమ్మకమైన గృహనిర్వాహకత్వమును బట్టి పరిశుద్ధులు క్రీస్తుతోకూడా తన రాజ్యములో యేలుదురని దేవుని వాక్యము సెలవిస్తున్నది. (1కొరింథి 6:2; దానియేలు 7:22; ప్రకటన 2:26, 20:4).

అయితే, ఆదాసుడు - నాయజమానుడు వచ్చుట కాలస్యము చేయుచున్నాడని తన మనసులో అనుకొని, దాసులను, దాసీలను కొట్టి, తిని, త్రాగి, మత్తుగా వుండసాగితే, వాడు కనిపెట్టని దినములోను, ఎరుగని గడియలోను ఆ దాసుని యజమానుడు వచ్చి, వాని నరికించి, అపనమ్మకస్థులతో వానికి పాలు నియమించును (లూకా 12:45,46). యీవచనములు నామ కార్థపు క్రైస్తవులను ఉద్దేశించి, వ్రాయబడినవి. పరిశుద్ధ గ్రంథములో శాస్త్రులు, పరిసయ్యులు దేవుని చిత్తమెరిగి యుండియు దానిని చేయక, మనుష్యుల ఆచారములను యితరులపై రుద్ది (దాసులను, దాసీలను కొట్టుటకు సాదృశ్యము), పాపపు జీవితములు గలిగి (తిని, త్రాగి, మత్తుగా యుండుటకు సాదృశ్యము)

జీవించిరి. యిట్టివారు అవిశ్వాసులకన్న మరి యెక్కువైన శిక్షకు పాత్రులగుదురని దేవుని వాక్యము తెలియజేయుచున్నది (మత్తయి11:21,22; హెబ్రీ 10:28,29; లూకా 12:47).

నమ్మకమైన, బుద్ధిగల గృహనిర్వాహకులుగా జీవిస్తూ, క్రీస్తు రాజ్యము కొరకు యెదురు చూచుటకు దేవుడు మనకు సహాయము చేయును గాక !

## (e) యుక్తిపరుడైన గృహనిర్వాహకుడు (లూకా 16:1-13) :

'నమ్మకమైన, బుద్ధిగల గృహనిర్వాహకుడు' అను ఉపమానములో దేవుడు మనకు అప్పజెప్పిన గృహ నిర్వాహకత్వమును నమ్మకముగా నిర్వర్తిస్తూ, దేవుని రాజ్యము కొరకు యెదురు చూడవలెనని చదివియున్నాము. 'యుక్తి పరుడైన గృహనిర్వాహకుడు' అను యీ ఉపమానములో అన్యాయస్థుడును మరియు యుక్తిపరుడైన ఒక గృహనిర్వాహకుని గురించి చూచెదము. లూకా 16:1-13 వాక్యభాగమును పరిశీలించినట్లయితే, క్రింది విషయములు మనము గమనించ గలము.

**(1)** లూకా : 16:1,2 వచనములో ఒక ధనవంతుని యొద్ద పని చేయుచున్న ఒక గృహనిర్వాహకుడు తన యజమానుని ఆస్తి పాడుచేయుచున్నందున, ఆధనవంతుడు అన్యాయముగా ప్రవర్తిస్తున్న ఆ గృహనిర్వాహకుని పనిలో నుండి తొలగించి,గృహనిర్వాహకత్వపు లెక్క అప్పగించుమని అడిగినట్లు చదువుచున్నాము. ప్రియులారా, దేవుడు మనకిచ్చిన తెలివితేటలు, సమయము, ధనము, తలాంతులను దేవుని రాజ్యము కొరకు వాడు గృహనిర్వాహకులుగా మనముండవలెను. వాటిని బట్టి దేవునికి లెక్క అప్పజెప్పవలసియుండును గనుక, వాటిని వృధా చేయకూడదని గమనించుచున్నాము. “యౌవనుడా, నీ యౌవనమందు సంతోషపడుము. నీయౌవనకాలమందు నీ హృదయము సంతుష్టిగా వుండనిమ్ము. నీ కోరిక చొప్పునను, నీదృష్టి యొక్క యిష్టము చొప్పనను ప్రవర్తింపుము; అయితే వీటన్నిటిని

బట్టి దేవుడు నిన్ను తీర్పులోనికి తెచ్చునని జ్ఞాపకముంచుకొనుము” అని దేవుని వాక్యము ప్రసంగి 11:9లో సెలవిస్తున్నది.

**(2)** లూకా 16:3-8 వచనములో అన్యాయస్థుడైన యీ గృహనిర్వాహకుడు తన గృహనిర్వాహకత్వపు పని పోతున్నందున తనయజమాని రుణస్థులతో మోసకరమైన రీతిలో యుక్తిగా ప్రవర్తించెనని చదువుచున్నాము. తన యజమానుని రుణస్థుల మన్నన పొంది, వారితో చేర్చుకొనబడుటకు ఆగృహనిర్వాహకుడు యీలాగు ప్రవర్తించెను. ఆగృహనిర్వాహకుని యుక్తిని తన యజమానుడు మెచ్చు కొనెను.

ఈ ఉపమానములో యజమానుడు మెచ్చు కొన్నది తన గృహనిర్వాహకుని అన్యాయపు ప్రవర్తనను కాదు గానీ, అతని ‘యుక్తి’ని మెచ్చుకొనెనని మనము గమనించవలెను.

యీ ఉపమానము ద్వారా యేసు క్రీస్తు మనకున్న అన్యాయపు సిరిని (ధనము మోసకరమైనది గనుక అన్యాయపు సిరిగా పిలువబడుతున్నది) న్యాయమైన రీతిలో యుక్తిగా, నిత్యత్వమును దృష్టిలో వుంచుకొని, దేవుని రాజ్యము కొరకు వాడవలెనని తెలియ జేయుచున్నాడు (లూకా 16:9). “భూమి మీద మీ కొరకు ధనమును కూర్చు కొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు, తుప్పను తిని వేయును, దొంగలు కన్నమువేసి, దొంగిలెదరు. పరలోకమందు మీకొరకు ధనమును కూర్చుకొనుడి. అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు. దొంగలు కన్నమువేసి, దొంగిలరు” అని యేసుక్రీస్తు మత్తయి 6:19-21లో సెలవిచ్చెను. ఈలోక సంబంధులు వెలుగు సంబంధుల కంటె (విశ్వాసులకంటె) యుక్తిపరులైయున్నారని (లూకా 16:8) యేసుక్రీస్తు తెలియజేసెను. ఈ లోకస్తులు దురాశ నెరవేర్చు కొనుటకు యేలాగైతే యుక్తిని కనుపరచుదురో, అలాంటి యుక్తిని విశ్వాసులు దేవుని మహిమ కొరకై తమ ధనమును, తెలివితేటలను వినియోగించుటలో కనపరచవలెనని యీ ఉపమానముద్వారా తెలుసుకొను చున్నాము. తద్వారా దేవుడు మనలను తన నిత్యమైన రాజ్యములోనికి చేర్చుకొని

ప్రతిఫలమిచ్చును (లూకా 16:9).

భూమి మీద మనకున్న కొద్దిపాటిధనము (అన్యాయపుసిరి) విషయములో మనము నమ్మకముగా లేనట్లయితే దేవుని రాజ్యములో నిజమైన ఐశ్వర్యమును మనమెట్లు పొందగలమని యేసుక్రీస్తు మనలను ప్రశ్నించు చున్నాడు (లూకా 16:11). మనము మిక్కిలి కొంచెములో నమ్మకముగా వున్నయెడల, యెక్కువలోను నమ్మకముగా వుందుమని లూకా 16:10 లో చదువు చున్నాము. కనుక మన ధనము న్యాయమైన రీతిలో యుక్తిగా దేవుని రాజ్యము కొరకు వెచ్చించుటకు దేవుడు మనకు సహాయము చేయును గాక !

ప్రియులారా, గత అయిదు ఉపమానముల ద్వారా దేవుని రాజ్యముకొరకు యెలా కనిపెట్టు చుండవలెనను సంగతులను యేసుక్రీస్తు మనకు బయలుపరచెను. కనుక యేకృపావరమునందును లోపములేక మన ప్రభువైన యేసుక్రీస్తు ప్రత్యక్షత కొరకు మనము యెదరు చూచు చుందుముగాక ! (1 కొరింథి 1:7).

## 8. దేవుని రాజ్యవారసుల గుణగణములు

ప్రియులారా, ఈ అధ్యాయములో యేసుక్రీస్తు నందు విశ్వాసమంచి, దేవుని వాక్యానుసారమైన జీవితములు జీవించువారి యొక్క గుణగణములు తెలియజేయుటకు యేసుక్రీస్తు చెప్పిన వుపమానములను గూర్చి తెలిసి కొందుము. దేవుని రాజ్యవారసులకు వుండ వలసిన, క్రింద చెప్పబడిన గుణములను ఆయా ఉపమానముల ద్వారా యేసు క్రీస్తు తెలిపెను.

**(a) ప్రేమ :** దేవుడు ప్రేమా స్వరూపియని, ఆయన తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపుటద్వారా మనవులపట్ల తనకున్న ప్రేమ ప్రత్యక్షపరచబడెనని 1యెహాను 4:8,9 వచనములలో చదువుదుము. అయితే, దేవుని ప్రేమపొందిన విశ్వాసులు ఆయన పట్ల ప్రదర్శించవలసిన ప్రేమను గూర్చి తెలుపుతూ యేసుక్రీస్తు క్రింది ఉపమానమును చెప్పెను.

### (1) ఇద్దరు ఋణస్థులు (లూకా 7:41-43)

యేసుక్రీస్తు ఒక పరిసయ్యుని యింటికి భోజనమునకు వెళ్లి, భోజన పంక్తిలో కూర్చున్నపుడు ఆ ఊరిలో పాపాత్మురాలైన ఒకస్త్రీ వెనుక తట్టు యేసు పాదముల యొద్ద నిలువబడి, యేడ్చుచు, కన్నీళ్లతో ఆయన పాదములను తడిపి, తన తలవెంట్రుకలతో తుడిచి, ఆయన పాదములను ముద్దుపెట్టుకొని, ఆ అత్తరు వాటికి పూసెను. అది చూచి పరిసయ్యుడు, యీయన ప్రవక్తయైన యెడల తన్నుముట్టుకొనిన స్త్రీ యెవతెయో యెరిగియుండునని తనలో తానాలోచించుకొనుచుండగా (లూకా 7:36-40) యేసుక్రీస్తు 'ఇద్దరు ఋణస్థులు' అను వుపమానమును చెప్పెను.

లూకా 7:41-43 వచనములలో "అప్పయిచ్చు ఒకనికి ఇద్దరు ఋణస్థులుండిరి. వారిలో ఒకడు ఐదువందల దేనారములును మరియొకడు ఏబది దేనారములను అచ్చియుండిరి. ఆ అప్ప తీర్చుటకు వారియొద్ద ఏమియు లేకపోయెను గనుక అతడు వారిద్దరిని క్షమించెను. కాబట్టి వీరిద్దరిలో యెవడు

అతని యెక్కువగా ప్రేమించునని యేసు అడిగినపుడు, సీమోను, 'అతడెవనికి ఎక్కువ క్షమించెనో వాడే'యని చెప్పెను" అని వ్రాయబడినది. యీ వాక్యభాగములో అప్పుయిచ్చిన మనిషి యేసుక్రీస్తును సూచిస్తుండగా, ఐదువందలదేనారములు అచ్చియున్న మనిషి పాపాత్మురాలైన స్త్రీని, యేబది దేనారములు అచ్చియుండు మనిషి పరిసయ్యుని సూచిస్తున్నారు.

పై వాక్యభాగములో పరిసయ్యుడు స్వనీతిగలిగి, యితరులను తృణీకరించు వేషధారులను సూచిస్తున్నాడు (సామెతలు 26:12; యెషయా 65:5; ఫిలిప్పి 2:3; తీతు 1:16). పరిసయ్యుడు ఏబది దేనారములు మాత్రమే అచ్చియుండెననుటలో అసలు అర్థము యేమనగా పరిసయ్యుడు యేసుక్రీస్తు పట్ల తన విస్తారమైన ఋణమును గ్రహించలేక పోయెను. కనుక, తన దృష్టిలోతానే నీతిమంతుడనుకొని, పాపాత్మురాలైన స్త్రీని ద్వేషించెను. మరియు తన స్వనీతిని బట్టి, యేసుక్రీస్తును ప్రేమించలేక పోయెను. తద్వారా యేసుక్రీస్తును భోజనమునకు ఆహ్వానించినప్పటికీ, తన పాదములు కడుగుకొనుటకు యేసుక్రీస్తుకు నీళ్ళివ్వలేదు (ఆదికాండం 18:4, 19:2, 24:32, 43:24; న్యాయాధిపతులు 19:21; 1 తిమోతి 5:10), యేసుక్రీస్తును ముద్దు పెట్టుకొన లేదు (2 కొరింథి 13:12; 1థెస్సలొనీయులకు 5:26; 1 పేతురు 5:13), నూనెతో యేసు తలను అంటలేదు (కీర్తన 23:5; నిర్గమకాండం 29:7; లేవీ కాండం 8:12, 21:10).

అయితే, పాపాత్మురాలైన స్త్రీ, పరిసయ్యునితో పోల్చిచూస్తే, యేసుక్రీస్తు పట్ల తన విస్తారమైన ఋణమును గ్రహించి, తన విస్తారమైన పాపములను బట్టి, పశ్చాత్తాపముతో యేడ్చుచూ, ప్రభువు పాదములను తన కన్నీటితో కడిగి, తన తలవెండ్రుకలతో ఆయన పాదములను తుడిచి, ముద్దు పెట్టుకొని, తన వెంట తెచ్చిన అత్తరును యేసుక్రీస్తు పాదములకు పూసెను (లూకా 7:37,38,44,45,46). మన విస్తారమైన పాపములను యేసుక్రీస్తు క్షమించుటద్వారా ఆయనకు ఎంతో ఋణస్థులమైయున్నామని గ్రహించినపుడే ప్రభువైన యేసు క్రీస్తును మనము

అధికముగా ప్రేమించగలుగుతాము. అపొస్తలుడైన పౌలు, "పూర్వము దూషకుడను, హింసకుడను, హాని కరుడనని" 1 తిమోతి 1:12 లో తన పాపపు స్థితిని గ్రహించి, తన అధికమైన పాపములన్నింటినీ యేసుక్రీస్తు క్షమించినందుకు ఆయనను అధికముగా ప్రేమించెను. యేసుక్రీస్తు, "నీపూర్ణహృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ మనస్సుతోను నీదేవుడైన ప్రభువును ప్రేమింపవలెనని" మత్తయి 22:37 లో ధర్మ శాస్త్ర ప్రధానాజ్ఞను తెలియజెప్పెను. పాపాత్మురాలైన స్త్రీ విలువైన అత్తరును యేసుక్రీస్తు పాదములకు పూయుట ద్వారా ప్రభువు పట్ల తన ప్రేమను చాటి చెప్పెను.

ప్రియులారా , యీ ఉపమానము ద్వారా మనము ఎంతఘోర పాపులమై నప్పటికిని ప్రభువైన యేసు క్రీస్తు మన పాపములను క్షమించుటకు సిద్ధముగా వున్నాడనియు, మన విస్తారపాపములు ప్రభువు క్షమించెనన్న గ్రహింపు మనకున్నపుడే ప్రభువును అధికముగా ప్రేమించగలుగుతామనియు గ్రహించు చున్నాము.

## (b) వినయము, తగ్గింపు :

ప్రియులారా, పరిశుద్ధ గ్రంథములో దేవుని వాక్యము, 'మహాఘనుడును, మహోన్నతుడును, పరిశుద్ధుడును, నిత్యవాసియునైన వాడు యీలాగు సెలవిచ్చు చున్నాడు - నేను మహోన్నతమైన పరిశుద్ధ స్థలములో నివసించువాడను. అయినను వినయముగలవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును, నలిగిన వారి ప్రాణమును ఉజ్జీవింప జేయుటకును, వినయము గలవారి యొద్దను, దీనమనస్సు గల వారియొద్దను నివసించుచున్నానని" యెషయా 57:15లో సెలవిస్తున్నది. దేవుడు గర్విష్టులను, అహంకారులను యెదిరించి, దీనులకు కృప అను గ్రహించును (1 పేతురు 5:5; సామెతలు 3:34). ప్రభువైన యేసుక్రీస్తు సిలువ మరణము పొందునంతగా విధేయత చూపిన వాడై, తన్ను తాను తగ్గించుకొనెనని ఫిలిప్పీ 2:8లో మనము చదువుచున్నాము. వినయ మనస్కులుగా, దీనమనస్కులుగా జీవించుటకు యేసుక్రీస్తు తన యందు విశ్వాసముంచినవారికి మాదిరియైయున్నాడు. విశ్వాసులు దేవుని యెదుటను, మనుష్యుల యెదుటను

వినయమనస్కులైయుండవలెనన్న సత్యమును బయలుపరచుటకై యేసుక్రీస్తు క్రింద చెప్పబడిన రెండు ఉపమానములను తెలిపెను.

### (1) నిష్ప్రయోజకులైన దాసులు (లూకా 17:7-10) :

యేసుక్రీస్తు కొండ మీద ప్రసంగములో చెప్పిన మొట్టమొదటిమాట, "ఆత్మవిషయమై దీనులైన వారుధన్యులు; పరలోక రాజ్యము వారిది" (మత్తయి 5:3). యేసు క్రీస్తు నందు విశ్వాసముంచువారు లేదా దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనువారికుండెడి ప్రధాన లక్షణము 'దీనత్వము'. మన పాపపు స్థితిని ఒప్పకొని, మనలను మనము రక్షించుకోలేమన్న సత్యమును తెలిసికొని, యేసు క్రీస్తు నందలి రక్షణను స్వీకరించుటలో దీనత్వమున్నది. యిటువంటి దీనత్వమును లేదా దేవుని యెదుటమనకుండవలసిన దీనత్వమును తెలుపుటకు యేసుక్రీస్తు "నిష్ప్రయోజకులైన దాసులు" అను ఉపమానమును చెప్పెను.

లూకా 17:7-10 లో, "దున్నువాడు గానీ, మేపువాడు గానీ మీలో యెవనికైనా ఒక దాసుడుండగా, వాడు పొలములో నుండి వచ్చినపుడు - నీవు యిప్పడే వెళ్లి భోజనము చేయుమని వానితో చెప్పనా ? చెప్పడు. అంతేకాక 'నేను భోజనము చేయుటకు ఏమైనను సిద్ధపరచి, నడుము కట్టుకొని, నేను అన్నపానములు పుచ్చుకొనువరకు నాకు పరిచారము చేయుము. అటుతరువాత నీవు అన్నపానములు పుచ్చు కొనవచ్చునని' వానితో చెప్పను గాని, ఆదాసుడు ఆజ్ఞాపింపబడిన పనులు చేసినందుకు వాడుదయచూపెనని వానిని మెచ్చునా ? అటువలె మీరును మీకు ఆజ్ఞాపింప బడిన వన్నియు చేసిన తరువాత మేము నిష్ప్రయోజకులమైన దాసులము. మేము చేయవలసినవే చేసియున్నామని చెప్పడనెను" అని వ్రాయబడియున్నది.

పై ఉపమానమును పరిశీలించినట్లయితే, యిహలోక యజమానుడు తన దాసుని పట్ల యెటువంటి ప్రవర్తనకలిగియుండునన్నది యేసుక్రీస్తు చెప్పెను.

(a) యిహలోక యజమానుడు పొలములోనుండి వచ్చిన తన దాసునితో భోజనమునకు కూర్చొనమని చెప్పడు (లూకా 17:7). (b) తన దాసుడు తనకు భోజనము వడ్డించి, తాను తిన్న తరువాత తన దాసుడు తినునని అనుకొనును (లూకా 17:8). (c) తన దాసుడు తనకు భోజనము వడ్డించినందుకు ఆ యజమానుడు తన దాసునికి వందనములు తెలియజేయడు (లూకా 17:9).

అయితే, పరలోకపు యజమానుడు (దేవుడు) మనలను రక్షించడానికి తనకెటువంటి బాధ్యత లేక పోయినప్పటికీ, తన కృపను బట్టి మన పాపములనుండి మనలను రక్షించెను. అంత మాత్రమే గాక, ఆయన యెడల మనము జరిగించిన పరిచర్యను బట్టి, 'భళా, నమ్మకమైన మంచి దాసుడా' అని మెచ్చుకొని (మత్తయి 25:21), బహుమానముల నిచ్చి (2 కొరింథి 5:10), తనతో విందునకు ఆహ్వానించి, భోజనము పెట్టును (లూకా 12:37; కీర్తన 23:5). దేవుని (పరలోక యజమానుని) తీరు, యిహలోకయజమానుని తీరుతో పోలిస్తే, పూర్తిగా భిన్నమైనదని మనము గమనించగలము. కనుక మనము దీనత్వముతో, 'అయోగ్యులమైన, నిష్ప్రయోజకులమైన దాసులము' గా దేవుని యెదుట వుండవలెనని గ్రహించుచున్నాము. మన క్రియలను బట్టిగాక, దేవుని కృప చేతనే రక్షించబడియున్నాము (ఎఫెసి 2:8,9). కనుక వుచితముగా పొందియున్న రక్షణను బట్టి, 'నిష్ప్రయోజకులమైన దాసులము'గా మనలను పరిగణించుకొని, దేవుని సేవించ బద్ధులమైయున్నామని యీ ఉపమానము ద్వారా తెలుసుకొంటున్నాము.

పరిశుద్ధగ్రంథములో దీనత్వమును లేదా వినయమును కలిగి యుండిన కొందరిని చూచెదము. యోహాను 1:27లో బాప్తిస్మమిచ్చు యోహాను, తాను యేసుక్రీస్తు చెప్పుల వారును విప్పుటకైనను యోగ్యుడను కానని చెప్పెను. లూకా 15:19 లో తప్పిపోయిన కుమారుడు తన తండ్రితో, 'నీ కుమారుడనని అనిపించుకొనుటకు యోగ్యుడను కాను, నన్ను నీకూలివారిలో ఒకనిగాపెట్టు కొనుమని' చెప్పకొనదలచెను. ఆదికాండం 32:10లో యాకోబు, 'నీవు నీ సేవకునికి చేసిన సమస్తమైన ఉపకారములకును, సమస్త సత్యమునకును

అపాత్రుడనని' ప్రార్ధించెను. మత్తయి 8:8లో శతాధిపతి యేసుక్రీస్తుతో, 'ప్రభువా, నీవునాయింటిలోనికి వచ్చుటకు నేను పాత్రుడను కానని' చెప్పెను. అపొస్తలుడైన పౌలు,'నేను అపొస్తలులందరిలో తక్కువ వాడను, దేవుని సంఘమును హింసించినందున అపొస్తలుడన బడుటకు యోగ్యడను కానని' చెప్పెను (1కొరింథి 15:9). దేవుని బలిష్టమైన చేతిక్రింద దీనమనస్కులై యుందుము గాక (1 పేతురు 5:6).

## (2) కడపటి చోటు (లూకా 14:7-11)

'నిష్ప్ర యోజకులైన దాసులు' అను ఉపమానములో దేవుని యెదుట వినయముతో జీవించవలెనను సత్యమును గమనించితిమి. 'కడపటి చోటు' అను ఈ ఉపమానములో సమాజములోని మనుష్యుల యెదుట వినయమనస్కులమై యుండవలయునన్న సత్యమును చూచెదము. లూకా 14:7-11 వచనములలో ఈలాగు వ్రాయబడియున్నది. "పిలువబడినవారు భోజనపంక్తిని అగ్రపీఠములు ఏర్పరచుకొనుట చూచి, ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను. నిన్నెవరైనను పెండ్లివిందుకు పిలిచినప్పుడు అగ్ర పీఠము మీద కూర్చుండవద్దు. ఒకవేళ నీ కంటే ఘనుడు అతని చేత పిలవబడగా నిన్నును, అతనిని పిలిచిన వాడువచ్చి ఇతనికి చోటిమ్మని నీతో చెప్పును. అప్పడు నీవు సిగ్గుపడి, కడపటి చోటున కూర్చుండసాగుదువు. అయితే నీవు పిలువబడినపుడు, నిన్ను పిలిచినవాడువచ్చి, స్నేహితుడా, పై చోటికి పొమ్మని నీతో చెప్పులాగున నీవు పోయి కడపటి చోటున కూర్చుండుము. అప్పడు నీతో కూడ కూర్చుండు వారందరి యెదుట నీకు ఘనతకలుగును. తన్నుతాను హెచ్చించుకొను ప్రతివాడును తగ్గింపడును. తన్నుతాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడునని చెప్పెను."

పై ఉపమానములో పెండ్లి విందుకు పిలువబడిన వారు అగ్రపీఠములను ఏర్పరచుకొను చుండిరని చదువు చున్నాము. స్వభావ సిద్ధముగా ప్రతిమనిషీ తన్నుతాను హెచ్చించుకొనును లేదా గర్వించును. పరిశుద్ధ గ్రంథములో

‘నాశనమునకు ముందు గర్వము నడచును. పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును’ అని వ్రాయబడినది (సామెతలు 16:18). ఎవని గర్వము వానిని తగ్గించును, వినయమనస్కుడు ఘనత నొందును (సామెతలు 29:23). ‘గర్వము, అహంకారము, దుర్మార్గత, కుటిలమైన మాటలు నాకు అసహ్యములు’. అని దేవుని వాక్యము సామెతలు 8:13లో సెలవిస్తున్నది. అహంభావము మనిషి హృదయములోనుండి వచ్చుననియు (మార్కు 7:22), జీవపు డంబము ఈలోకపు తీరనియు (1 యోహాను 2:16) మనము చదివెదము.

అయితే, ప్రభువైన యేసుక్రీస్తు మత్తయి 11:29లో “నేను సాత్వికుడను, దీనమనస్సు గల వాడను గనుక మీమీద నా కాడి యెత్తికొని, నా యొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును” అని చెప్పెను. క్రీస్తునందు విశ్వాసముంచువారు వినయమును ధరించుకొనవలెనని చెప్పబడుచున్నారు (కొలొస్సయులకు 3:12). విశ్వాసులు వినయమైన మనస్సు గలవారై, ఒకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుకొన వలయును (ఫిలిప్పి 2:3). వారు మనుష్యులందరి యెడల సంపూర్ణమైన సాత్వికమును కనుపరచుచు, ఎవనిని దూషింపక, జగడ మాడని వారును, శాంతులు నైయుండలెను (తీతు 3:2). “న్యాయముగా నడచు కొనుటయు, కనికరమును ప్రేమించుటయు, దీనమనస్సు గలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు, ఇంతేగదా యెహోవా నిన్నడుగు చున్నాడు” అని మీకా 6:8లో చదువు చున్నాము.

యీ ఉపమానములో పెండ్లివిందులో అగ్రపీఠములను కోరుకొని, ఘనత పొందాలనుకున్నవారు తరువాత సిగ్గుకు, అవమానమునకు గురవుదురని చదువుచున్నాము (లూకా 14:9). అందుకే, “దేవుడు అహంకారులను యెదిరించి, దీనులకు కృప అనుగ్రహించును’ అని దేవుని వాక్యములో చదువు చున్నాము (1పేతురు 5:5; యాకోబు 4:6; కీర్తనలు 18:27). కనుకనే యేసు క్రీస్తు, తన దినముల యందలి శాస్త్రులను, పరిసయ్యులను గద్దిస్తూ, వారు విందులలో అగ్ర స్థానములను, సమాజమందిరములలో అగ్ర పీఠములను, సంతవీధులలో

వందనములను, మనుష్యుల చేత బోధకులని పిలువబడుటయు కోరుదురని చెప్పెను (మత్తయి 23:6,7). అయితే, తమ్ముతాము తగ్గించుకొని, కడపటి చోటు కోరుకొనువారు హెచ్చింపబడుదురు (లూకా 14:10-11).

## (c) క్షమించు స్వభావము :

యేసుక్రీస్తు నందలి విశ్వాసులు 'క్షమించు స్వభావము' కలిగిన వారు. పేతురు యేసునొద్దకువచ్చి, 'ప్రభువా, నా సహోదరుడు నాయెడల తప్పిదము చేసిన యెడల నేనెన్ని మారులు అతని క్షమింవలెను ? ఏడుమారులమట్టుకా' అని అయనను అడిగినపుడు, యేసు "డెబ్బది యేళ్ల మారుల మట్టుకని" చెప్పి, ఈ క్రింది ఉపమానము చెప్పెను.

### (1) కనికరము లేని చెడ్డ దాసుడు (మత్తయి 18:23-35)

ప్రియులారా, యేసుక్రీస్తు ద్వారా దేవుడు మనకు అనుగ్రహించిన పాపక్షమాపణ యెంతో గొప్పది, లెక్కలేనంత, విస్తారమైన మన పాపఋణమును యేసు క్రీస్తు పరిహరించిన దానిని బట్టి మనము కూడా యితరులు మన పట్ల జరిగించు తప్పిదములను బట్టి వారిని క్షమించవలెనను సత్యమును తెలియ జేయుటకు ఆయన 'కనికరము లేని చెడ్డదాసుడు' అను ఉపమానమును చెప్పెను.

ఉపమాన భాగము మత్తయి 18:23-35 పరిశీలించినట్లయితే, యీ క్రింది విషయములు మనము గమనించవచ్చును.

(i) అత్యధికమైన పాపఋణము (మత్తయి 18:23,24) :

మత్తయి 18:23,24లో 'పరలోక రాజ్యము తన దాసులయొద్ద లెక్క చూచుకొనగోరిన యొక రాజును పోలియున్నదనియు, అతడు లెక్క చూచుకొన మొదలు పెట్టినపుడు పదివేల తలాంతులు అచ్చియున్న యొకడు రాజునొద్దకు తేబడెనని' చదువుచున్నాము. ప్రియులారా, భూమిమీద మన జీవితముల యొక్క లెక్క ఒకానొక దినమున దేవునికి మనము అప్పజెప్పవలసిన వారముగా

మనమున్నాము (ప్రసంగి 11:9; 2 కొరింథి 5:10). 'దేవుని రాజ్యము కొరకైన నిరీక్షణ మరియు సిద్ధపాటు' అను అధ్యాయములో చెప్పబడిన ఉపమానములో 'గృహనిర్వాహకులము'గా మన జీవితములు దేవునికి అంగీకార యోగ్యములుగా జీవించవలెనని చూచితిమి. ఈ ఉపమానములో 'పదివేల తలాంతులు' అచ్చియున్న యొకడు (మత్తయి 18:24) దేవుని పట్ల అత్యధికమైన పాప ఋణమును అచ్చియున్న ఒక పాపిని సూచిస్తున్నాడు. ఈ ఋణము తిరిగి చెల్లించలేనిది. అందుకే కీర్తన 49:9లో "వారి ప్రాణ విమోచన ధనము బహు గొప్పది. అది ఎన్నటికిని తీరక అట్లుండవలసినదే" అని వ్రాయబడియున్నది. దావీదు రాజు "లెక్కలేని అపాయములు నన్ను చుట్టుకొనియున్నవి. నాదోషములు నన్ను తరిమి పట్టుకొనగా నేను తలయెత్తి చూడలేక పోతిని. లెక్కకు అవి నాతల వెంట్రుకలను మించియున్నవి." అని చెప్పెను (కీర్తన 40:12). దేవుని వాక్యములో సొదొమ, గొమొఱ్ఱాల పాపము బహు భారమైనదనియు (ఆదికాండం 18:20), హృదయము అన్నిటికంటె మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధికలదనియు (యిర్మియా 17:9) చదువుదుము.

(ii) పాపమునకు వచ్చు జీతము మరణము (మత్తయి 18:25) :

ఉపమానములోని దాసుడు తన అధికమైన ఋణమును చెల్లించలేని స్థితిలో యుండినందున రాజు అతని భార్యను, పిల్లలను, అతనికి కలిగిన యావత్తును అమ్మి, అప్పు తీర్చవలెనని ఆజ్ఞాపించెను (మత్తయి 18:25). ఈ మాట ఒక పాపికి దేవుని పట్లనున్న అత్యధికమైన పాపఋణమునకు గాను కలుగు పర్యవసానమును సూచిస్తున్నది. రోమా 6:23లో 'పాపము వలన వచ్చు జీతము మరణమని; యాకోబు 1:15 లో, 'దురాశ గర్భము ధరించి, పాపమును కనగా, పాపముపరిపక్వమై, మరణమును కనునని', చదువు చున్నాము. శారీరక మరణము మొదటి మరణమైతే, యిది రెండవ మరణము. ప్రకటన 21:8లో, 'పిరికి వారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికులందరును

అగ్నిగంధకములతో మండు గుండములో పాలు పొందుదురు. యిది రెండవ మరణము' అని వ్రాయబడినది.

(iii) దాసుని యొక్క వేడ్కోలు (మత్తయి 18:26) :

మత్తయి 18:26లో, 'కాబట్టి ఆదాసుడు అతని యెదుట సాగిలపడి, మ్రొక్కి, నాయెడల ఓర్చుకొనుము, నీకు అంతయు చెల్లింతునని చెప్పె నని' వ్రాయబడినది. దీనిని బట్టి, ఆదాసుడు తన దయనీయమైన స్థితిని ఒప్పకొని, రాజుయెదుట సాగిలపడినట్లు చూచు చున్నాము. ఈ మాట ఒక పాపి, తన పాపమును బట్టి పశ్చాత్తాపపడి, క్షమించుమని దేవుని ప్రార్థించుటను సూచిస్తున్నది. దావీదు రాజు, 'యెహోవా, నాపాపము బహు ఘోరమైనది. నీ నామమును బట్టి దానిని క్షమింపుము' అని ప్రార్థించెను (కీర్తన 25:11). మరియు 'నా దోషమును కప్పకొనక నీ యెదుట నా పాపము ఒప్పకొంటిని' (కీర్తన 32:5) అని చెప్పెను. 1 యోహాను 1:9లో, 'మన పాపములను మనము ఒప్పకొనిన యెడల, ఆయన నమ్మదగిన వాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి, సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును' అని చెప్పబడినది.

(iv) రాజు యొక్క కనికరము, క్షమాభిక్ష (మత్తయి 18:27) :

దాసుడు తన యెదుట సాగిల పడి, (మ్రొక్కుటను చూచి, రాజు కనికరపడి, వానిని విడిచిపెట్టి, వాని అప్ప క్షమించెను (మత్తయి 18:27). దేవుడు పాపులను కనికరించి, తన కుమారుడైన యేసుక్రీస్తు నందు వారినివిమోచించి, వారి పాపములను క్షమించి వేసెనని దీనిని బట్టి గమనించుచున్నాము (యెహాను 3:16, 5:24). భక్తిహీనులు, దుష్టులు యోహోవా వైపు తిరిగిన యెడల ఆయన వారియందు జాలిపడును. వారిని బహుగా క్షమించును (యెషయా 55:7). 'ప్రభువా, నీవు దయాళుడవు, క్షమించుటకు సిద్ధమైన మనస్సుగలవాడవు. నీకు మొఱ్ఱపెట్టు వారందరి యెడల కృపాతిశయము గలవాడవు' (కీర్తన 86:5)

(v) దాసుని కనికరములేని, కఠినమైన స్వభావము (మత్తయి 18:28-30)

మత్తయి 18:28-30 వచనములలో అత్యధికమైన ఋణమునుండి తన యజమాని యొద్ద క్షమాభిక్షపొదిన ఆ దాసుడు కేవలము నూరు దేనారములు తనకు అచ్చియున్న ఒక తోటిదాసుడిని క్షమించక, ఆ మొత్తమును చెల్లించువరకు తన తోటిదాసున్ని చెరసాలలో వేయించెనని చదువు చున్నాము. రూపాయిలో తర్జుమా చేస్తే, ఆదాసుడు తన యజమానునికి అచ్చియున్నది మూడు కోట్ల అరవై లక్షల రూపాయలైతే, తనతోటి దాసుడు ఆ దాసునికి అచ్చియున్నది యాభై రూపాయలు మాత్రమే. ఆ దాసుని కనికరములేని, కఠినమైన వైఖరిని గురించి తెలుసుకున్న తన యజమానుడు ఆదాసునిపై కోపగించి, బాధపరచు వారికి తనను అప్పగించెనని మత్తయి 18:32-34లో చదువు చున్నాము.

దేవుడు యేసు క్రీస్తునందు మన విస్తారమైన పాపములను క్షమించిన ప్రకారము విశ్వాసులు కూడా యితరులు తమ పట్ల జరిగించు తప్పిదములను క్షమించవలెనని యీ ఉపమానము ద్వారా నేర్చుకుంటున్నాము (మత్తయి 6:14,15; మత్తయి 18:35; మార్కు 11:25; కొలొస్సయులకు 3:13). తనను హింసించిన వారిని క్షమించుమని సిలువలో తండ్రియైన దేవుని ప్రార్థించుట ద్వారా, యేసు క్రీస్తు క్షమించు విషయములో మనకు మాదిరియైయున్నాడు (లూకా 23:34). అంతేగాక, “మేము మాకచ్చియున్న ప్రతి వానిని క్షమించుచున్నాము గనుక మా పాపములను క్షమించుము” అని తన మాదిరి ప్రార్థన మనకు నేర్పియున్నాడు (లూకా 11:4).

## (d) జ్ఞానము :

యేసుక్రీస్తునందు విశ్వాసముంచి, ఆయన మాటల ననుసరించి నడుచుకొనువారు ‘జ్ఞానము’తో ప్రవర్తించుదురను సత్యమును తెలియజేయుటకు

యేసు క్రీస్తు, 'ఇల్లుకట్టువారు' అను ఉపమానమును చెప్పెను. యెహోవాయందు భయభక్తులు కలిగియుండుటయే జ్ఞానమునకు మూలము. పరిశుద్ధ దేవుని గూర్చిన తెలివియే వివేచనకు ఆధారము (సామెతలు 9:10, యోబు28:28; కీర్తన 111:10). దేవుని వాక్యములో జ్ఞానమును గురించి సామెతల గ్రంథములో యెన్నోసంగతులు వ్రాయబడి యున్నవి. జ్ఞానము ఘోషించుచున్నది. వివేచన తన స్వరము వినిపించు చున్నది (సామెతలు 8:1). జ్ఞానము ముత్యములకన్న శ్రేష్ఠమైనది. విలువగల సొత్తులేవియు దానితో సాటికావు (సామెతలు 8:11). మేలిమి బంగారము కంటెను, అపరంజికంటెను నా వలన కలుగు ఫలము మంచిది. ప్రశస్తమైన వెండికంటె నా వలన కలుగు వచ్చుబడి దొడ్డది (సామెతలు 8:19). అయితే, యింతగొప్ప జ్ఞానము యేసు క్రీస్తు నందు, ఆయన మాటలయందు యిమిడి యున్నదని దేవుని వాక్యము సెలవిస్తున్నది. "బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు ఆయన యందే గుప్తములై యున్నవి" (కొలొస్సయులకు 2:3). యేసుక్రీస్తు దేవుని జ్ఞానమై యున్నాడు (1కొరింథీ 1:24). కనుకనే ఆయన మాటలననుసరించి, జీవించు వారు ఆయన 'జ్ఞానము' కలిగి యుందురు.

### (1) ఇల్లు కట్టువారు (మత్తయి 7:24-27; లూకా 6:47-49)

లూకా 6:47-49 లో యిలాగు వ్రాయబడియున్నది :

"నా యొద్దకువచ్చి, నామాటలు విని, వాటి చొప్పున చేయు ప్రతివాడును ఎవని పోలియుండునో మీకు తెలియజేతును. వాడు యిల్లు కట్టవలెననియుండి, లోతుగా త్రవ్వి, బండమీద పునాది వేసిన వాని పోలియుండును. వరదవచ్చి, ప్రవాహము ఆ యింటిమీద వడిగా కొట్టినను, అది బాగుగా కట్టబడినందున దాని కదలింప లేక పోయెను. అయితే, నా మాటలు వినియు, చేయని వాడు పునాది వేయక, నేలమీద యిల్లుకట్టిన వానిని పోలియుండును. ప్రవాహము దాని మీద వడిగా కొట్టగానే అది కూలిపడెను; ఆ యింటిపాటు గొప్పదని చెప్పెను."

పై వాక్య భాగములో యేసుక్రీస్తునందు విశ్వాసముంచి, ఆయన మాటల చొప్పన చేయువాడు, లోతుగా త్రవ్వి బండమీద పునాదివేసి, యిల్లుకట్టిన వాని

పోలియున్నాడని చదువు చున్నాము. అట్టివాడు బుద్ధిమంతుడుగా, జ్ఞానిగా యెంచబడుచున్నాడు. మనము యిల్లు కట్టుకొనునప్పుడు భూమినిలోతుగా త్రవ్వి, రాతినేల మీద పునాది వేయుదుము. అలాగే మన ఆత్మీయ జీవితము కూడా క్రీస్తు అను పునాది మీద కట్టబడవలెనని దేవుని వాక్యము సెలవిస్తున్నది (1 కొరింథి 3:11). మత్తయి 7:25లో యేసుక్రీస్తు, బండమీద కట్టబడిన యింటిమీద వాన కురిసి, వరదలు వచ్చి, గాలి విసరి కొట్టినను ఆయింటిపునాది బండమీద వేయబడెను గనుక అది పడలేదనిచెప్పెను. వాన కురుయుట, వరదలు వచ్చుట, గాలివిసరుట అనునవి విపరీత పరిస్థితులకు సూచనగా వున్నవి. యివి విశ్వాసుల జీవితములలో కలుగు శ్రమలు,ఉపద్రవములు, వేదనలను సూచిస్తున్నవి. అట్టి పరిస్థితులలో జ్ఞానియైనవాడు తన విశ్వాసమందు స్థిరముగా నిలబడి, కదలింపబడడను సత్యమును యీ ఉపమానము ద్వారా గ్రహించుచున్నాము. పరిశుద్ధగ్రంథములో అనేక వచనములు యీ సత్యమును తెలియ జేయుచున్నవి. నీతిమంతులు సింహమువలె ధైర్యముగా నుందురు (సామెతలు 28:1). యథార్థవంతులు ఎప్పడును కదిలింపబడరు (కీర్తన 112:6). యథార్థవంతుని హృదయము యెహోవాను ఆశ్రయించి, స్థిరముగా వుండును. అతడు దుర్వార్తకు జడియడు, అతని మనస్సు స్థిరముగా వుండును (కీర్తన 112:7,8). ఎవని మనస్సు నీ మీద ఆనుకొనునో వానిని నీవు పూర్ణశాంతి గలవానిగా కాపాడుదువు. యెహోవా యెహోవాయే నిత్యాశ్రయదుర్గము. యుగయుగములు యెహోవాను నమ్ముకొనుడి (యెషయా 26:3,4). నీతిమంతుడు నిత్యము నిలుచు కట్టడమువలె వున్నాడు (సామెతలు 10:25). దేవుని యొక్క స్థిరమైన పూనాది నిలకడగా వుండును (2 తిమోతి 2:19). యథార్థ వంతులు దేవుని 'శైలము, కోట, కేడెము, రక్షణశృంగము, వున్నతదుర్గము, ఆశ్రయదుర్గము, ఆశ్రయశైలము, కొండ'గా కలిగి యుందురని దేవుని వాక్యము సెలవిస్తున్నది (కీర్తన 18:2;28:1, 31:2-3, 62:6-7, 94:22, 95:1, 78:35). యెహోవా ఉత్తముడు. శ్రమదినమందు ఆయన ఆశ్రయ దుర్గము, తన యందు నమ్మిక యుంచువారిని ఆయన యెరుగును (నహూము 1:7).

అయితే, 'నా మాటలు విని, వాటి చొప్పన చేయని ప్రతివాడును యిసుక మీద యిల్లుకట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను. గాలి విసిరి ఆయింటిమీద కొట్టెను. అప్పడది కూలబడెను. దాని పాటు గొప్పదని' యేసు క్రీస్తు మత్తయి 7:26,27వచనములలో సెలవిచ్చు చున్నాడు. యీ వాక్యభాగమును గమనించినట్లయితే, యిందులో చెప్పబడిన వారు యేసుక్రీస్తు బోధను వినియు దాని ప్రకారము చేయకున్నారు. అట్టి వారు బుద్ధిహీనులని యేసు క్రీస్తు సెలవిచ్చు చున్నాడు. దేవుని మరచు వాని ఆశ నిరర్థకమగును. అతని ఆశ భంగమగును. అతడు ఆశ్రయించునది సాలెపురుగు పట్టే. అతడు తన యింటిమీద ఆనుకొనగా అదినిలువదు. అతడు గట్టిగా దాని పట్టుకొనగా అది విడిపోవును (యెబు 3:13,14,15). యేసుక్రీస్తు దినములలో శాస్త్రులు, పరిసయులు ఆయన బోధ వినియు, దానిని త్రోసి పుచ్చిరి. తమ జీవితములలో వేషధారణ కలిగి జీవించిరి (మత్తయి 23:13-19). ఇసుక మీద యిల్లు కట్టు కొనువారు తమస్వనీతిని ఆధారము చేసికొనిన శాస్త్రులు, పరిసయ్యులను సూచిస్తున్నారు (లూకా 7:36-50). మానవుని స్వనీతి దేవుని దృష్టిలో మురికిగుడ్డల వలెయున్నదని దేవునివాక్యము సెలవిస్తున్నది (యెషయా 64:6). యిసుక మీద కట్టబడిన యిల్లు పడిపోవునట్లు, మానవుని స్వనీతియు దేవుని దృష్టిలో యెంతమాత్రమూ నిలువ నేరదు. కనుకనే యేసుక్రీస్తు, "శాస్త్రులనీతికంటెను, పరిసయ్యుల నీతి కంటెను మీ నీతి అధికము కాని యెడల మీరు పరలోక రాజ్యములో ప్రవేశింపనేరరని మీతో చెప్పచున్నాను" అని సెలవిచ్చెను (మత్తయి 5:20). ప్రియులారా, యేసుక్రీస్తు మాటలు విని, ఆప్రకారము చేయు చున్నామా ?

## (e) ప్రార్థనా జీవితము

యేసుక్రీస్తు భూమి మీద మానవ రూపములో నున్నపుడు ప్రార్థించుటలో యెంతో సమయము గడిపి, మనకు మాదిరియాయెను. యేసుక్రీస్తు బాప్తిస్మము పొందినపుడు ప్రార్థన చేయుచుండెను (లూకా 3:21). తన శిష్యులను ఏర్పరచు కొనక మునుపు రాత్రంతయు ప్రార్థించెను (లూకా 6:12-13). పెందలకడనే

లేచి, యింకను చాలా చీకటి యుండగానే అరణ్యప్రదేశమునకు వెళ్లి, అక్కడ ప్రార్థించుచుండెను (మార్కు 1:35). ఒంటరిగా నుండి ప్రార్థించుచుండెను (లూకా 5:16, 9:18, 11:1; మత్తయి14:23). తన శిష్యుల కొరకు ప్రార్థించెను (యోహాను 17). చివరకు కలువరి సిలువలో ప్రార్థించెను (లూకా 23:34,46). దీనిని బట్టి విశ్వాసులు ప్రార్థనలో తమ సమయము గడుపుట యెంత ప్రాముఖ్యమైనదో తెలియుచున్నది. మన ప్రార్థనలు యెలా వుండవలయునన్న సత్యమును తెలియజేయుటకు యేసుక్రీస్తు యీ క్రింద చెప్పబడిన మూడు ఉపమానములను తెలిపెను.

## (1) పరిసయ్యుడు - సుంకరి (లూకా 18:9-14)

మనము దేవుని యెదుట నీతిమంతులమని యెంచుకొనక, తగ్గించుకుని, వినయ మనస్కులమై ప్రార్థించవలెనన్న సత్యమును తెలియజేస్తూ,యేసు క్రీస్తు 'పరిసయ్యుడు - సుంకరి' అను ఉపమానమును చెప్పెను. లూకా 18:9-14లో ఈలాగు వ్రాయబడినది. "తామే నీతిమంతులమని తమ్ము నమ్ముకొని, యితరులను తృణీకరించు కొందరితో ఆయన ఈ ఉపమానము చెప్పెను. ప్రార్థన చేయుటకై యిద్దరు మనుష్యులు దేవాలయమునకు వెళ్లిరి. వారిలో ఒకడు పరిసయ్యుడు, ఒకడు సుంకరి. పరిసయ్యుడు నిలువబడి, దేవా నేను చోరులును, అన్యాయస్థులును, వ్యభిచారులునైన యితర మనుష్యుల వలెనైనను, ఈ సుంకరివలెనైనను ఉండనందుకు నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. వారమునకు రెండుమారులు ఉపవాసము చేయుచు, నా సంపాదన అంతటిలో పదియవవంతు చెల్లించుచున్నానని తనలో తాను ప్రార్థించు చుండెను. అయితే సుంకరి దూరముగా నిలుచుండి, ఆకాశమువైపు కనులెత్తుటకైనను ధైర్యము చాలక, రొమ్ము కొట్టు కొనుచు - దేవా, పాపినైన నన్ను కరుణించుమని పలికెను. అతని కంటె యితడు నీతిమంతుడుగా తీర్చబడి, తన యింటికి వెళ్లెనని మీతో చెప్పుచున్నాను. తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడుననియు, తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింప బడుననియు చెప్పెను."

పై ఉపమానములో పరిసయ్యుని ప్రార్థనకు, సుంకరి ప్రార్థనకు వ్యత్యాసమును గమనించినట్లయితే, పరిసయ్యునిది స్వనీతితో కూడిన ప్రార్థన యనియు, సుంకరిది తగ్గింపుతో, దేవుని నీతితో కూడిన ప్రార్థన యనియు తెలిసికొందుము. పరిసయ్యుని స్వనీతి వేషధారణతో కూడుకొన్నది. అట్టి వారు 'మా దాపునకు రావద్దు. ఎడముగా ఉండుము. నీకంటే మేము పరిశుద్ధులమని' చెప్పదురు (యెషయా 65:5). తామే నీతిమంతుల మనుకొని, యితరులను తృణీకరింతురు (లూకా 18:9), వారు యితరుల తప్పిదములు వేలెత్తి చూపి, తమ తప్పిదములవైపు చూడరు (లూకా 18:11, మత్తయి 7:3-5). బయటికి నీతిమంతులుగా కనిపించగోరుదురు (మత్తయి 6:2,5,16). వారు న్యాయమును, కనికరమును, విశ్వాసమును విడిచిపెట్టిన వారు (మత్తయి 23:23), లూకా 18:12లో చెప్పబడినట్లు పారంపర్యాచారములు కలిగి యుందురు (మత్తయి 15:1-9). వెలుపల మాయ వేషము కలిగి (లూకా 20:46-47), లోపల మారుమనసు అనుభవము లేని వారు (లూకా 11:39). యిటువంటి వారి ప్రార్థన దేవుని యెదుట అంగీకరింపబడదని ఈ ఉపమానము ద్వారా తెలుసుకొంటున్నాము.

అయితే, సుంకరిని గమనించినట్లయితే, తాను దూరముగా నిలుచుండెను (లూకా 18:13). యిది తగ్గింపును సూచిస్తున్నది. లూకా 17:11-13 వచనములలో పదిమంది కుష్ఠరోగులు దూరముగా నిలచి, యేసుప్రభువా, మమ్ముకరుణించుమని కేకలువేసిరి. బాప్తిస్మమిచ్చు యోహాను, 'ఆయన హెచ్చవలసియున్నది. నేను తగ్గవలసియున్నదని' యేసుక్రీస్తు యెదుట తగ్గించుకొనెను (యోహాను 3:30). లూకా 18:13లో సుంకరికి ఆకాశమువైపు కనులెత్తుటకైనను ధైర్యము చాలలేదని చదువుచున్నాము. దావీదురాజు కీర్తన 40:12లో, 'లెక్క లేని అపాయములు నన్ను చుట్టు కొనియున్నవి. నా దోషములు నన్ను తరిమి, పట్టుకొనగా, నేను తల యెత్తి చూడలేకపోతిని' అని చెప్పెను. తన పాపములను బట్టి పశ్చాత్తాపము నొందిన సుంకరి, రొమ్ము కొట్టుకొనుచు, 'దేవా, పాపినైన నన్ను కరుణించుమని' ప్రార్థించెను (లూకా 18:13). తమ పాపములను బట్టి ఒప్పింపబడిన వారిలో నిజమైన తగ్గింపు, వినయము కనబడునని గమనించుచున్నాము. దేవుడు అట్టి ప్రార్దనను అంగీకరించును. యెషయా దేవుని మహిమను చూసిన వాడై, తన్నుతాను తగ్గించు కొనెను (యెషయా 6:5).

ఆది కాండము 4:2-7లో కయీను, హేబెలు అర్పించిన అర్పణ పైన చెప్పబడిన ఉపమానమునకు సమాంతరముగా వున్నది. దుష్టుని సంబంధియైన కయీను చెడ్డ క్రియలు కలవాడై తెచ్చిన అర్పణను దేవుడు లక్ష్యపెట్టలేదు (1 యోహాను 3:12; ఆదికాండం 4:5). హేబెలు విశ్వాసమును బట్టి శ్రేష్టమైన బలిని దేవునికి అర్పించెను (హెబ్రీ 11:4). తాను పాపినన్న భావముతో తగ్గించుకొని, పశ్చాత్తాపముతో పాపపరిహారము నిమిత్తము దేవునికి బలి అర్పించినందున దేవుడు అతని అర్పణను లక్ష్యపెట్టెను (ఆది కాండం 4:4).

## (2) అవసరములో నున్న స్నేహితుడు (లూకా 11:5-13) :

విశ్వాసులు తమ ప్రార్థనలలో యెడతెగక యుండవలెనన్న సత్యమును తెలియజేయుటకు యేసు క్రీస్తు 'అవసరములో నున్న స్నేహితుడు' అను ఉ పమానమును చెప్పెను. కొన్ని విషయములను గూర్చి మనము ప్రార్థించవలెనని తలంచినపుడు, కొంతకాలము ప్రార్థించి, తరువాత దేవుడు ఆ మనవులకు జవాబు యివ్వడేమో అని ప్రార్థించుట మానివేస్తాం. అయితే దేవుడు మనము విసుగక, యెడతెగక ప్రార్థించవలెనని కోరుకుంటున్నట్లు యీ ఉపమానము చివర యివ్వబడిన వచనములద్వారా మనము తెలిసికొందుము.

లూకా 11:5-13లో యీలాగు వ్రాయబడినది. "మరియు ఆయన వారితో యిట్లనెను - మీలో యెవనికైన ఒక స్నేహితుడుండగా అతడు అర్ధరాత్రి వేళ ఆస్నేహితునియొద్దకు వెళ్లి, స్నేహితుడా, నాకుమూడు రొట్టెలు బదులిమ్ము, నా స్నేహితుడు ప్రయాణము చేయుచు, మార్గములో నా యొద్దకు వచ్చియున్నాడు. అతనికి పెట్టుటకు నా యొద్ద యేమియు లేదని అతనితో చెప్పిన యెడల, అతడు లోపలనేయుండి, నన్ను తొందరపెట్టవద్దు. తలుపు వేసియున్నది. నా చిన్నపిల్లలు నాతోకూడ పండుకొనియున్నారు. నేను లేచి యియ్యలేనని చెప్పనా ? అతడు తన స్నేహితుడైనందున లేచియియ్యక పోయినను, అతడు సిగ్గుమాలి, మాటిమాటికి అడుగుటవలన నైనను లేచి అతనికి కావలసిన వన్నియు యిచ్చును అని మీతో చెప్పచున్నాను. అటువలెమీరును అడుగుడి, మీ కియ్యబడును. వెదకుడి, మీకు

దొరకును. తట్టుడి, మీకు తీయబడును. అడుగు ప్రతివానికియ్యబడును. వెదకు వానికి దొరకును, తట్టు వానికి తీయబడునని మీతో చెప్ప చున్నాను. మీలో తండ్రియైన వాడు తన కుమారుడు చేపనడిగితే చేపకు ప్రతిగా పామునిచ్చునా ? గుడ్డునడిగితే తేలునిచ్చునా ? కాబట్టి, మీరు చెడ్డ వారైయుండియు, మీ పిల్లలకు మంచి యీవులనియ్య నెరిగియుండగా, పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగు వారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అను గ్రహించుననెను."

పై ఉపమానమును పరిశీలించినట్లయితే, యీ క్రింది సంగతులు మనకు తెలియుచున్నది.

(i) పై ఉపమానములో చెప్పబడిన స్నేహితుడు తన కొరకు కాకుండా, తన యొద్దకు వచ్చి, అవసరములో వున్న మనుష్యుని కొరకు తన స్నేహితుని యొద్ద విన్నవించుకుంటున్నాడు(లూకా 11:6). 'పరిసయ్యుడు - సుంకరి' ఉపమానములో తగ్గింపు గలిగి ప్రార్థించాలని చూచితిమి. యీ ఉపమానములో "యితరుల కొరకు" ప్రార్థించవలెనని చూచుచున్నాము. యోబు తన స్నేహితుల కొరకు ప్రార్థించెను (యోబు 42:10). దానియేలు ఇశ్రాయేలీయుల పక్షమున ప్రార్థించెను (దానియేలు 9:4-19). దైవజను లెందరో తమ అవసరములకన్న యితరుల అవసరములకు ప్రాధాన్యత నిచ్చిరి.

(ii) యీ స్నేహితుడు అర్ధరాత్రి వేళ తన స్నేహితుని యొద్దకు వెళ్లెను (లూకా 11:5). మన విజ్ఞాపనలను దేవుని సన్నిధికి యే సమయములోనైనా తీసుకు వెళ్లవచ్చును. మనము కనికరింపబడి, సమయోచితమైన సహాయము కొరకు కృపపొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము (హెబ్రీ 4:16).

(iii) యీ స్నేహితుడు తన స్నేహితుని యొద్ద మాటిమాటికి విన్నవించుకొనుట ద్వారా అతని గెలిచెనని చూచుచున్నాము (లూకా 11:8). దీనిని బట్టి మన ప్రార్థనలు యెడతెగక దేవుని సన్నిధికి తీసుకుని రావలెనని గమనిస్తున్నాము. 'విసుగకుండా, యెడతెగక ప్రార్థించుట' యనునది మన విశ్వాసములో

బలపడుకొలదీ వచ్చే అనుభవము. కనుకనే యేసుక్రీస్తు లూకా 11:9,10 వచనములలో 'అడుగుట', 'వెదకుట', 'తట్టుట' గురించి చెప్పెను. యేదైనా విషయమును దేవునితో 'అడుగుదుము'. ఆ విషయమును గురించి అధికముగా తెలుసుకున్నపుడు దానిని 'వెదకుదుము'. దానిని పొందే స్థితిలోనికి వచ్చినపుడు 'తట్టుదుము'. విశ్వాసి యీ మూడుమెట్లు యెక్కువరకూ తన ప్రార్ధనా జీవితములో 'యెడతెగక' యుండవలెను. అపొస్తలుడైన పౌలును, యితరులను ప్రార్ధన యందు యెడతెగక యుండుటను యీ క్రింది వచనముల ద్వారా చూడవచ్చును.

ఎపెసీ 6:18-సమస్త పరిశుద్ధుల నిమిత్తము పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా వుండుడి.

కొలొస్సయులకు 1:3- యెల్లపుడు మీనిమిత్తము ప్రార్ధన చేయుచు, మన ప్రభువువగు యేసుక్రీస్తు యొక్క తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్చించుచున్నాము.

కొలొస్సయులకు 4:12- ఎపఫ్రా యెల్లప్పడును మీకొరకు తన ప్రార్ధనలలో పోరాడుచున్నాడు.

అపొ.కా.12:5- పేతురు చెరసాలలో ఉంచబడెను, సంఘమయితే అతని కొరకు అత్యాసక్తితో దేవునికి ప్రార్ధన చేయుచుండెను

రోమా 1:9- నా ప్రార్ధనల యందు ఎల్లప్పడు ఆయనను బతిమాలుకొనుచు, మిమ్మును గూర్చి యెడతెగక జ్ఞాపకము చేసికొనుచున్నాను.

1 థెస్సలోనీకయులకు 1:3- మేము మన తండ్రియైన దేవుని యెదుట మానక జ్ఞాపకము చేసికొనుచు, మీఅందరి నిమిత్తము ఎల్లప్పడును దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము.

1 థెస్సలోనీకయులకు 2:13 మేమును మానక దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాము.

2 తిమోతి 1:3 నా ప్రార్ధనలయందు ఎడతెగక నిన్ను జ్ఞాపకము చేసికొనుచున్నాను.

1 థెస్సలొనీయులకు 5:15 - యెడ తెగక ప్రార్ధనచేయుడి.

ప్రియులారా, నిరీక్షణ గలవారమై సంతోషించుచు, శ్రమ యందు ఓర్పు గల వారమై, యీ ఉపమానములో చూచినట్లు ప్రార్ధన యందు పట్టుదల కలిగి యుందుముగాక (రోమా 12:12).

## (3) గోజాడుచున్న విధవరాలు (లూకా 18:1-8)

'పరిసయ్యుడు - సుంకరి' అను ఉపమానములో మన స్వనీతిని వదలి, తగ్గింపుతో దేవుని ప్రార్ధించవలెననియు, 'అవసరములో వున్న స్నేహితుడు' అను ఉపమానములో 'యితరుల కొరకు' పట్టుదలతో యెడతెగక ప్రార్ధించవలెననియు చూచితిమి. 'గోజాడుచున్న విధవరాలు' అను యీ ఉపమానములో మన "సొంత అవసరముల కొరకు" ప్రార్ధించునపుడు మన "నిస్సహాయ స్థితి"ని గుర్తించి, విసుకక, నిత్యమూ ప్రార్ధించవలెనను సత్యమును తెలిసి కొందుము. 'అవసరములో వున్న స్నేహితుడు' ఉపమానములో మాదిరి యీ ఉపమానములో కూడా ఎల్లప్పుడును ప్రార్ధించవలెనను సత్యము చెప్పబడుచున్నది.

లూకా 18:1-8లో యీలాగు వ్రాయబడినది. "వారు విసుకక నిత్యము ప్రార్ధన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను. దేవునికి భయపడకయు, మనుష్యులను లక్ష్యపెట్టకయునుండు ఒక న్యాయాధిపతి ఒక పట్టణములో వుండెను. ఆ పట్టణములో ఒక విధవరాలును ఉండెను. ఆమె అతనియొద్దకు తరచుగా వచ్చి, నాప్రతివాదికిని, నాకును న్యాయము తీర్చుమని అడుగుచువచ్చెను గాని, అతడు కొంతకాలము ఒప్పక పోయెను. తరువాత అతడు-నేను దేవునికి భయపడకయు, మనుష్యులను లక్ష్యపెట్టకయు వుండినను, ఈ విధవరాలు నన్ను తొందరపెట్టుచున్నది గనుక ఆమె మాటిమాటికి వచ్చి, గోజాడకుండునట్లు ఆమెకు న్యాయము తీర్తునని తనలో తాననుకొనెను. మరియు

ప్రభువిట్లనెను. అన్యాయస్థుడైన ఆ న్యాయాధిపతి చెప్పిన మాట వినుడి. దేవుడు తాను యేర్పరచుకొనిన వారు దివారాత్రులు తన్ను గూర్చి మొఱ్ఱపెట్టు కొనుచుండగా వారికి న్యాయము తీర్చడా ? ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును. వారి విషయమే గదా ఆయన దీర్ఘశాంతము చూపుచున్నాడనిమీతో చెప్పుచున్నాను. అయినను మనుష్య కుమారుడు వచ్చు నప్పడు ఆయన భూమిమీద విశ్వాసము కనుగొనునా ?"

పై ఉపమానములో చెప్పబడిన విధవరాలు ఒక నిస్సహాయ స్థితి ని సూచిస్తున్నది. నిస్సహాయ స్థితి అనగా తనకు తాను సహాయము చేసుకొనలేని స్థితి. మరియు వేరొకరు తనకు సహాయము చేయలేని స్థితి. దేవుని సన్నిధికి వెళ్లి, ప్రార్థించునపుడు మన నిస్సహాయ స్థితిని అంగీకరిస్తూ, ప్రార్థించవలెను. యితర మార్గములు లేక వ్యక్తుల ద్వారా సహాయము వస్తుందన్న భావముతో ప్రార్థించిన యెడల అసలు ప్రార్థించడము దేనికి ? దావీదురాజు కీర్తన 34:6లో 'ఈ దీనుడు మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించెను. అతని శ్రమలన్నింటిలో నుండి అతని రక్షించెను' అని సాక్ష్యమిచ్చెను.

నిస్సహాయురాలైన విధవరాలు దేవుని కనికరము పొందును. పరదేశికే గాని, తండ్రి లేని వానికేగాని న్యాయముతప్పి, తీర్పు తీర్చకూడదు. విధవరాలి వస్త్రమును తాకట్టుగా తీసుకొనకూడదు (ద్వితీయోపదేశకాండము 24:17). పరదేశులకు, తండ్రిలేనివారికి, విధవరాండ్రకు పొలములో వెనుకనున్న పరిగెను వదలివేయవలెను (ద్వితీయోపదేశ కాండము 24:19-21). తండ్రిలేని వారిని, విధవరాండ్రను బాధించకూడదు. వారికి న్యాయము తీర్చవలెను (నిర్గమకాండం 22:22-24; యెషయా 1:17). విధవరాండ్రను సన్మానింపవలెను (1తిమోతి 5:3), వారి యిబ్బందిలో వారిని పరామర్శించవలెను (యాకోబు 1:27). యీ వచనములన్నిటి ద్వారా విధవరాండ్ల పట్ల దేవుని ప్రేమ వ్యక్తమవుచున్నది.

విధవరాలు తనయొద్దకు తరచుగా వచ్చి, న్యాయము తీర్చుమని అడుగుచున్నందున అన్యాయస్థుడైన ఆ న్యాయాధిపతి ఆమె మాటిమాటికి వచ్చి,

గోజాడకుండునట్లు ఆమెకు న్యాయము తీర్తునని, తనలో తాననుకొనెను (లూకా 18:5). అదే విధానములో, విశ్వాసులు దేవుని సన్నిధిలో దివారాత్రములు చేయు ప్రార్ధనలనుబట్టి మరి త్వరగా దేవుని చేత ఆలకించబడి, న్యాయము తీర్చబడుదురన్న సత్యమును ఈ ఉపమానము ద్వారా గ్రహించు చున్నాము. విశ్వాసులు పెట్టు మొఱ్ఱను బట్టి దేవుడు రక్షింపబడని వారి పట్ల దీర్ఘశాంతము కలిగి, వారి రక్షణ నిమిత్తము వేచియున్నాడనియు ఈ ఉపమానము మనకు తెలుపు చున్నది (లూకా 18:8)

విధవరాలిని పోలిన ప్రార్ధనా జీవితము మనము కలిగియుండవలెను. ఆలాగు జీవించునట్లు దేవుడు మనకు సహాయము చేయునుగాక.

## (f) సాక్ష్యపు జీవితము

యేసుక్రీస్తు ప్రేమను రుచిచూచి, మారుమనస్సు అనుభవము లోనికివచ్చిన ప్రతి విశ్వాసి తన జీవితము ద్వారా ఆయనకు సాక్షిగా వుండవలె నన్నది దేవుని చిత్తమై యున్నది. యేసు క్రీస్తు పరలోకమునకు ఆరోహణమై వెళ్లటకు ముందు "పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు యెరుషలేములోను, యూదయ, సమరయ దేశముల యందం తటను, భూ దిగంతములవరకును నాకు సాక్షులైయుందురని" తన శిష్యులతో చెప్పెను (అపొ.కా.1:8). అపొస్తలులు బహుబలముగా ప్రభువైన యేసు పునరుత్థానమును గూర్చి సాక్ష్యమిచ్చిరి (అపొ.కా.4:33). యేసుక్రీస్తు తన శిష్యులతో, "మీరు మొదట నుండి నా యొద్ద వున్నవారు గనుక మీరును సాక్ష్యమిత్తురు" అని చెప్పెను (యోహాను 15:27).

యేసుక్రీస్తు చెప్పిన ఉపమానములను బట్టి క్రింద తెలుపబడిన మూడు విధములుగా మనము ఆయనకు సాక్షులుగా జీవించవలయును.

(1) మన వ్యక్తిగత నడవడిక యేసు క్రీస్తును పోలియుండుట ద్వారా (పాతతిత్తులలో క్రొత్తద్రాక్షారసము, పాతబట్టపై క్రొత్త గుడ్డ ఉపమానము)

(2) యితరుల పట్ల సత్క్రియలు కలిగి యుండుట ద్వారా (దీప స్తంభము మీది దీపమును గూర్చిన ఉపమానము)

(3) పరలోక రాజ్యసువార్తను యితరులకు తెలియ జెప్పటద్వారా (శాస్త్రిని గూర్చిన ఉపమానము)

పై మూడు ఉపమానములకు వివరణ క్రిందనివ్వబడినది.

### (1) పాత తిత్తులలో క్రొత్త ద్రాక్షారసము, పాతబట్టపై క్రొత్త గుడ్డ

### (మత్తయి 9:16-17; మార్కు 2:21-22; లూకా 5:36-38)

యేసుక్రీస్తు తన శిష్యుడుగు లేవి (మత్తయి) యింటిలో భోజనమునకు కూర్చున్నపుడు సుంకరులును యితరులు అనేకులును ఆయనతో కూడ భోజనమునకు కూర్చుండిరి. అది చూచి శాస్త్రులు, పరిసయ్యులు, యేసుక్రీస్తు శిష్యులపై, పాపులతో సహవాసము చేయుచున్నారని సణుగుకొనిరి. అంతేగాక యోహాను శిష్యులు తరచుగా ఉపవాసము చేయుచుండగా నీ శిష్యులేల తినిత్రాగుచున్నారని ఆయనను అడిగిరి (లూకా 5:27-33). యేసు క్రీస్తు వారి హృదయములను యెరిగియుండి, వారడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, యీ ఉపమానమును చెప్పెను. లూకా 5:36-38 వచనములలో యీలాగు వ్రాయబడినది.

"ఎవడును పాతబట్టకు క్రొత్తగుడ్డ మాసికవేయడు. అదియును గాక క్రొత్తదానిలోనుండి తీసిన ముక్క పాతదానితో కలియదు. ఎవడును పాత తిత్తులలో క్రొత్త ద్రాక్షారసము పోయడు. పోసినయెడల క్రొత్త ద్రాక్షారసము తిత్తులను పిగుల్చును. రసము కారిపోవును. తిత్తులును పాడగును. అయితే క్రొత్త ద్రాక్షారసము క్రొత్త తిత్తులలో పోయవలెను. పాత ద్రాక్షారసము త్రాగి, వెంటనే క్రొత్త దానిని కోరువాడెవడును లేడు, పాతదే మంచిదనునని చెప్పెను".

పై ఉపమానములో క్రొత్తగుడ్డ, క్రొత్త ద్రాక్షారసము అనునవి ప్రభువైన

యేసుక్రీస్తు నందలి రక్షణను సూచిస్తున్నవి. పాతబట్ట, పాతతిత్తులు అనునవి మోషే ధర్మశాస్త్ర ఆచార సాంప్రదాయములను సూచిస్తున్నవి. పాతనిబంధనలో దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు పాపమనగా యెట్టిదో, దేవుని నీతియనగా యెట్టిదో తెలియబరుచుటకు మోషే ద్వారా ధర్మశాస్త్రమును అనుగ్రహించెను (రోమా 3:20; రోమా 7:12-24). సున్నతిపొందుట (అపొ.కా.15:11), చేతులు కడుగు కొనుట (మార్కు 7:5), ఉపవాసముండుట (లూకా 5:33) మొదలగునవి ధర్మ శాస్త్రమందలి ఆచారములు. యీ ధర్మశాస్త్రము ద్వారా మనుష్యులెవరునూ నీతిమంతులుగా తీర్చబడలేరనియు (గలతి 2:16, 3:11; అపొ.కా. 13:39, రోమా 3:28), ధర్మశాస్త్రము క్రీస్తువైపునడిపించుటకు బాల శిక్షకుడాయెననియు (గలతి 3:24,25) దేవుని వాక్యము సెలవిస్తున్నది. ధర్మశాస్త్రమునకు వేరుగా దేవుని నీతి బయలుపడుచున్నది. అది యేసు క్రీస్తునందలి విశ్వాసమూలమైనదై, నమ్ము వారికందరికీ కలుగు దేవుని నీతియై యున్నది (రోమా 3:21,22).

అయితే, యేసుక్రీస్తునందలి రక్షణ ప్రత్యక్షమైన తరువాత కూడా ఆనాటి శాస్త్రులు, పరిసయ్యులు ధర్మశాస్త్ర ఆచారములను (పాత తిత్తులను, పాత బట్టలను) యితరులపై రుద్దుటకు ప్రయత్నించు చుండిరి. మోయ శక్యముగాని భారమైన బరువులు కట్టి, మనుష్యుల భుజముల మీద వారు పెట్టుదురేగాని, తమ వ్రేలితోనైనను వాటిని కదిలింపనొల్లరు (మత్తయి 23:4). వారు దేవుని ఆజ్ఞను విడిచిపెట్టి, మనుష్యుల పారంపర్యాచారమును గైకొను చున్నారు (మార్కు 7:8,9; మత్తయి 12:1-2, 9-12, 15:1-9). వారి నీతి వేషధారణతోను, కపటము తోను నిండుకొనియున్నది (మత్తయి 23:5-36). అందుకే యేసుక్రీస్తు 'శాస్త్రుల నీతి కంటెను, పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కాని యెడల, మీరు పరలోక రాజ్యములో ప్రవేశింపనేరరని" చెప్పెను (మత్తయి 5:20). తమ ఆచారములను హత్తు కొని యుండుట వలన క్రీస్తు రక్షణను స్వీకరించ లేరని తెలుపుటకు యేసుక్రీస్తు పై ఉపమానమును చెప్పెను. మీరు క్రీస్తుతో కూడా లోకము యొక్క మూల పాఠముల విషయమై మృతి పొందిన వారైతే, లోకములో

బదుకుచున్నట్టుగా మనుష్యుల ఆజ్ఞలను, పద్ధతులను అనుసరించి - చేత పట్టుకొనవద్దు, రుచి చూడవద్దు, ముట్టవద్దు అను విధులకు మీరు లోబడనేల ? అవన్నియు వాడు కొనుట చేత నశించి పోవును. అట్టివి స్వేచ్ఛారాధన విషయములోను, వినయ విషయములోను, దేహశిక్ష విషయములోను జ్ఞానరూపకమైనవని యెంచబడు చున్నవే గాని, శరీరేచ్ఛా నిగ్రహ విషయములో (పాపము చేయకుండుటలో) ఏమాత్రమును ఎన్నిక చేయదగినవి కావు (కొలొస్సయులకు 2:20-23).

క్రొత్తద్రాక్షారసము పాత తిత్తులలో యిమడదు. క్రొత్త గుడ్డ పాతబట్టపై వేయబడదు. అదే రీతిలో, ఆచార సాంప్రదాయములకు కట్టు బడియుండగోరితే, యేసుక్రీస్తును వెంబడించలేమని యీ ఉపమానము ద్వారా తెలుసుకుంటున్నాము. క్రొత్త ద్రాక్షారసము నూతనమైన సంతోషమును కలుగ జేయును (యోహాను 2:1-11). అలాగే, విశ్వాసమూలమున కలుగు యేసుక్రీస్తు రక్షణ మనుష్యులకు నూతనత్వము కలుగ జేసి, ఆచార సాంప్రదాయములను నిరర్థకము చేయును. యిటు వంటి రక్షణను ధరించినపుడు యేసు క్రీస్తునకు సాక్షులుగా వుందుము. 'మనము ధర్మశాస్త్రమునుండి విడుదల పొందితివిు గనుక అక్షరానుసారమైన ప్రాచీన స్థితి గలవారము కాక, ఆత్మానుసారమైన నవీన స్థితి గలవారమై సేవ చేయుచున్నాము' (రోమా 7:6).

## (2) దీప స్తంభము మీది దీపము (మత్తయి 5:14-16, మార్కు 4:21-22, లూకా 8:16-17, 11:33-36)

'పాత తిత్తులలో క్రొత్త ద్రాక్షారసము, పాతబట్టపై క్రొత్త గుడ్డ' అను ఉపమానములో మన సొంత జీవితములు నూతన పరచబడుట ద్వారా యేసుక్రీస్తుకు సాక్షులైయుందుమని చూచితివిు. 'దీప స్తంభము మీది దీపము' అను యీ ఉపమానములో 'యితరుల' పట్ల సత్క్రియలు కలిగి యుండుట ద్వారా యేసు క్రీస్తుకు సాక్షులైయుండవలెనన్న సత్యమును చూచెదము. మత్తయి 5:14-16

వచనములలో యీలాగు వ్రాయబడియున్నది. "మీరు లోకమునకు వెలుగై యున్నారు. కొండమీదనుండు పట్టణము మరుగై యుండ నేరదు. మనుష్యులు దీపము వెలిగించి, కుంచము క్రింద పెట్టరు కాని అది యింటనుండు వారికందరికి వెలుగిచ్చుటకై దీపస్తంభము మీదనే పెట్టుదురు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి, పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి యెదుట మీవెలుగు ప్రకాశింప నియ్యుడి".

దేవుడు లోకమునకు వెలుగైయున్నాడు. "నేను లోకమునకు వెలుగును నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపువెలుగు కలిగయుండునని" యేసు క్రీస్తు చెప్పెను (యోహాను 8:12). ఆయన మరుగు మాటలను, మర్మములను బయలు పరచును. అంధకారములోని సంగతులు ఆయనకు తెలియును. వెలుగు యొక్క నివాస స్థలము ఆయన యొద్దవున్నది (దానియేలు 2:22). 'అంధకారము నన్ను మరుగు చేయును. నాకు కలుగు వెలుగు రాత్రి వలె వుండును అని నేనను కొనిన యెడల చీకటియైనను నీకు చీకటికాక పోవును. రాత్రి పగటివలె నీకు వెలుగుగా వుండును. చీకటియు, వెలుగును నీకు యేకరీతిగా వున్నవి' (కీర్తన 139:11-12).

యిటువంటి దేవుని వెలుగు లోకములోనికి వచ్చెను గాని, తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక, చీకటినే ప్రేమించిరి. దుష్కార్యము చేయు ప్రతి వాడు వెలుగును ద్వేషించును. తన క్రియలు దుష్క్రియలుగా కనబడకుండునట్లు వెలుగు నొద్దకు రాడు (యోహాను 3:19,20) యేసు క్రీస్తు వెలుగుగా లోకములో వుండెను. లోక మాయన మూలముగా కలిగెను గానీ లోకమాయనను తెలిసికొనలేదు. తన స్వకీయులే ఆయనను అంగీకరింపలేదు (యోహాను 1:9-11). 2 కొరింథి 4:4లో "దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగ జేసెనని" చదువు చున్నాము. తద్వారా అవిశ్వాసులు అంధకారములో యున్నారని దేవుని వాక్యము సెలవిచ్చుచున్నది.

అయితే, యేసు క్రీస్తు తన వెలుగును తన యందు విశ్వాసముంచి,

తనను వెంబడించు వారికందరికీ కలుగ జేసెను గనుక, విశ్వాసులు యీ ఉపమానములో చెప్పబడినట్లు దీపములను సూచిస్తున్నారు. దీపము దీపస్తంభము మీద పెట్టబడి, గదియంతటికీ వెలుగు నిచ్చులాగున విశ్వాసులు తమ సత్క్రియల ద్వారా అంధకారమయమైన యీ లోకమునకు వెలుగు నియ్యవలయును (మత్తయి 5:16) "మీరు పూర్వమందు చీకటియై యుంటిరి. యిప్పుడైతే ప్రభువునందు వెలుగై యున్నారు. వెలుగు ఫలము సమస్త విధములైన మంచి తనము, నీతి, సత్యమను వాటిలో కనబడుచున్నది. కనుక ప్రభువు కేది ప్రీతికరమైనదో దానిని పరీక్షించుచు, వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి. నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారై యుండక, వాటిని ఖండించుడి" (ఎఫెసీ 5:8-12). యింకను యాకోబు 3:13లో, 'మీలో జ్ఞాన వివేకములు గల వాడెవడు? వాడు జ్ఞానముతో కూడిన సాత్వికముగలవాడై, తన యోగ్య ప్రవర్తన వలన తన క్రియలను కనుపరచవలెనని' చదువు చున్నాము.

మన క్రియలు మన మాటల కంటే గట్టిగా మాటలాడునని చెప్పబడినట్లు అవిశ్వాసులను యేసుక్రీస్తు వెలుగు నొద్దకు తీసుకు వచ్చుటకు మన సత్క్రియలతో వారి యెదుట సాక్షులుగా వుండవలయును. 'వాటియందు మనము నడచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడిన వారమై, ఆయన చేసిన పనియైయున్నాము (ఎఫెసి 2:10). మూర్ఖమైన వక్రజనము మధ్య నిరపరాధులును, నిష్కళంకులును, అనింద్యులునైన దేవుని కుమారులగునట్లు జీవ వాక్యమును చేతపట్టుకొని, లోకమందు జ్యోతులలె కనబడుటకు దేవుడు మనకందరికీ సహాయము చేయునుగాక (ఫిలిప్పి 2:15).

## (3) శాస్త్రి (మత్తయి 13:51-52)

'దీప స్తంభము మీది దీపము' అను ఉపమానములో విశ్వాసులు తమ సత్క్రియల ద్వారా యీ లోకములో యితరులకు సాక్షులైయుండవలెనని చూచితిమి. 'శాస్త్రి' అను యీ ఉపమానములో యేసుక్రీస్తు 'రక్షణ సువార్త'ను

యితరులకు ప్రకటించుట ద్వారా యిలోకములో సాక్షులముగా వుండగలమని చూతుము. మత్తయి 13:51-52 వచనములలో యీలాగు వ్రాయబడినది. "వీటిన్నిటిని మీరు గ్రహించితిరా అని వారిని అడుగగా వారు గ్రహించితిమనిరి. ఆయన అందువలన పరలోక రాజ్యములో శిష్యుడుగా చేరిన ప్రతి శాస్త్రియు తన ధననిధిలో నుండి క్రొత్త పదార్ధములను పాత పదార్ధములను వెలుపలికి తెచ్చుయింటియజమానుని పోలియున్నాడని వారితో చెప్పెను."

'శాస్త్రి' అనగా ధర్మశాస్త్రమును యెరిగియుండి, దానిని యితరులకు బోధించువాడు. దేవుని వాక్యములో 'ఎజ్రా ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా అనుగ్రహించిన మోషేయొక్క ధర్మ శాస్త్రమందు ప్రవీణతగల శాస్త్రి'యని ఎజ్రా 7:6లో చదువుచున్నాము. పై ఉపమానములో దేవుని రాజ్యసంగతులు తెలిసి,దేవుని రాజ్యవారసులుగా వున్న వారందరూ 'శాస్త్రులు' గా చెప్పబడుచున్నారు. యీ ఉపమాన వాక్య భాగమును పరిశీలించినట్లయితే, యీ క్రింది సంగతులను గ్రహింపవచ్చును.

(i) దేవుని రాజ్యమును గూర్చిన జ్ఞానము ఒక ధననిధి (మత్తయి 13:52) :

'దేవుని రాజ్యము యొక్క విలువ' అను అధ్యాయములో 'దాచబడిన ధనము' అనుఉపమానములో చెప్పబడిన రీతిగా పరలోక రాజ్యము ఒక పొలములో దాచబడిన ధనమును పోలియున్నది (మత్తయి 13:44). యెహోవా న్యాయవిధులు సత్యమైనవి. అవి కేవలము న్యాయమైనవి. అవి బంగారుకంటెను విస్తారమైన మేలిమి బంగారు కంటెను కోరదగినవి. వాటిని గైకొనుటవలన గొప్ప లాభము కలుగును (కీర్తన 19:9-11). వెండి సంపాదించుటకంటె జ్ఞానము సంపాదించుట మేలు. అపరంజి సంపాదించుకంటె జ్ఞాన లాభమునొందుట మేలు. పగడముల కంటె అది ప్రియమైనది (సామెతలు 3:14-15). బుద్ధిజ్ఞానముల సర్వసంపదలు యేసుక్రీస్తు నందే గుప్తములైయున్నవి (కొలొస్సయులకు 2:3).

(ii) శాస్త్రి తన ధననిధిలో నుండి క్రొత్త పదార్ధములను వెలుపలికి తెచ్చును. (మత్తయి 13:52) :

పైన చెప్పబడినమాట దేవుని రాజ్యవారసులు (విశ్వాసులు) యేసు క్రీస్తు రక్షణ సువార్తను యితరులకు ప్రకటింతురన్న సత్యమును సూచిస్తున్నది. క్రొత్త పదార్థమనగా కృప చేత విశ్వాసమూలమున నీతి మంతులముగా తీర్చబడి, ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుండుట (రోమా 5:1). యీ రక్షణ సువార్తను యేసు క్రీస్తు యూదుల సమాజమందిరములలో బోధించుచు, దేవుని రాజ్యమును గూర్చిన సువార్తను ప్రకటించెను (మత్తయి 4:23). అపొస్తలులు బహుబలముగాయీ రక్షణ సువార్తను అనేకులకు ప్రకటించిరి (అపొ.కా.4:33) అపొస్తలుడైన పౌలు, "సువార్త ప్రకటింపవలసిన భారమునా మీద మోపబడియున్నది. అయ్యో, నేను సువార్తను ప్రకటింపక పోయిన యెడల నాకు శ్రమ" అని చెప్పెను (1 కొరింథి 9:16). క్రీస్తు ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకు తనకు కృప అనుగ్రహింపబడెనని పౌలు ఎఫెసి. 3:11లో చెప్పెను.

(iii) శాస్త్రి తన ధననిధిలోనుండి పాత పదార్థములను వెలుపలికి తెచ్చును. (మత్తయి 13:52):

పాతపదార్థము దేవుడు ఇశ్రాయేలీయుల కనుగ్రహించిన మోషే ధర్మశాస్త్రమును సూచిస్తున్నది. ధర్మ శాస్త్రములో చెప్పబడిన బలులు క్రీస్తునందున్న రక్షణను సూచిస్తున్నవి. యేసుక్రీస్తు ప్రధాన యాజకుడుగా వచ్చి, తానే నిత్యమైన విమోచన సంపాదించి, మేకల యొక్కయు, కోడెలయొక్కయు, రక్తముతో కాక, తన స్వరక్తముతో ఒక్క సారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను. నిత్యుడగు ఆత్మద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్క రక్తము, నిర్జీవ క్రియలను విడిచి, జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని యెంతో యెక్కువగా శుద్ధిచేయును (హెబ్రీ 9:11,12,14). ప్రియులారా, యేసుక్రీస్తు రక్షణ సువార్తను యితరులకు ప్రకటించుచున్నామా ?

## (g) త్యాగము - క్రమ శిక్షణ :

దేవుని రాజ్య వాసులు క్రీస్తును వెంబడించుటలో త్యాగమును మరియు

క్రమశిక్షణను కనుపరచుదురని తెలుపుటకు యేసుక్రీస్తు యీ క్రింద చెప్పబడిన ఉపమానమును తెలిపెను. క్రీస్తును వెంబడించుటకు విశ్వాసులు చెల్లించు మూల్యము యీ ఉపమానములో మనకు తెలుపబడినది

## (1) గోపురము కట్టువాడు - యుద్ధము చేయువాడు

## (లూకా 14:25-35) :

లూకా 14:25-33 వచనములలో యీలాగు వ్రాయబడినది. 'బహుజన సమూహములు ఆయనతో కూడ వెళ్లుచున్నప్పుడు ఆయన వారితట్టు తిరిగి ఎవడైనను నాయొద్దకు వచ్చి తన తండ్రిని, తల్లిని, భార్యను, పిల్లలను, అన్నదమ్ములను, అక్క చెల్లెండ్రను, తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు. మరియు ఎవడైనను తన సిలువను మోసికొని, నన్ను వెంబడింపనియెడల వాడు నాశిష్యుడు కానేరడు. మీలో యెవడైనను ఒక గోపురము కట్టింపగోరిన యెడల దానిని కొన సాగించుటకు కావలసినది తన యొద్ద ఉన్నదో లేదో అని కూర్చుండి తగులుబడి మొదట లెక్క చూచుకొనడా ? చూచుకొనని యెడల అతడు దాని పునాదివేసి, ఒకవేళ దాని కొనసాగింపలేక పోయినందున, చూచువారందరూ ఈ మనుష్యుడు కట్టమొదలుపెట్టెను గాని కొన సాగింపలేక పోయెనని అతని చూచి, యెగతాళి చేయ సాగుదురు. మరియు ఏ రాజైనను మరియొక రాజుతో యుద్ధము చేయబోవునప్పుడు తనమీదకి ఇరువదివేల మందితో వచ్చువానిని పదివేలమందితో ఎదిరింప శక్తి తనకు కలదో లేదో అని కూర్చుండి, మొదట ఆలోచింపడా?శక్తి లేనియెడల అతడింకను దూరముగా ఉన్నప్పడే రాయబారము పంపి, సమాధానము చేసికొన చూచును గదా! ఆ ప్రకారమే మీలో తనకు కలిగిన దంతయు విడిచిపెట్టని వాడు నా శిష్యుడు కానేరడు'.

పై ఉపమానములో రెండు దృష్టాంతములను గమనించు చున్నాము. మొదటిది గోపురము కట్టుట, రెండవది యుద్ధము చేయుట. గోపురము

కట్టుటకును, యుద్ధము చేయుటకును ప్రణాళిక, త్యాగము, క్రమ శిక్షణ అవసరము. యివి లేని యెడల గోపురము కట్టుట మధ్యలో నిలిచిపోవును. యుద్ధములో ఓడిపోవుట సంభవించును. గోపురము కట్టుట మధ్యలో నిలిచిపోతే, అది యితరుల ఎగతాళికి కారణమగును (లూకా 15:30). తద్వారా దేవుని నామమునకు అవమానము కలుగును. కనుకనే, 'మిమ్మును బట్టియే గదా దేవుని నామము అన్య జనుల మధ్యను దూషింపబడుచున్నది?' అని చదువు చున్నాము (రోమా 2:24). యుద్ధము నుండి వెనుకకు పారిపోతే, విశ్వాసములో తప్పిపోయిన వారమై, ఓడిపోదుము. అప్పడు కుక్కతన వాంతికి తిరిగినట్టును, పంది బురదలో దొర్లు టకు మళ్లినట్టును వుండునని దేవుని వాక్యము సెలవిస్తున్నది (2 పేతురు 2:20-22).

పై రెండు దృష్టాంతములు క్రైస్తవ జీవితములో క్రీస్తును యెలా వెంబడించాలి అన్న సత్యమును తెలియజేయుచున్నవి. క్రీస్తును వెంబడించుటలో జయ జీవితము కలిగి యుండుటకు, పైన చెప్పబడినట్లు క్రమశిక్షణ, త్యాగము అవసరము.

(i) **క్రమశిక్షణ** : క్రీస్తును వెంబడించుట అనునది ఒక పందెపురంగముతో పోల్చబడినది. పందెపురంగమందు పరుగెత్తువారందరూ బహుమానము పొందునట్లుగా పరిగెత్తవలెననియు, దాని కొరకు శరీరమును నలగగొట్టి, దానిని లోబరచుకొనవలెననియు దేవుని వాక్యములో వ్రాయబడినది (1 కొరింథి 9:24,27). విశ్వాసులు అనుదిన ప్రార్థన, వాక్యధ్యానము, సంఘసహవాసము, పరిచర్య అను విషయములలో క్రమశిక్షణ కలిగియుందురని మనము గమనించుదుము.

(ii) **త్యాగము** : క్రీస్తును వెంబడించుటకు విశ్వాసులు చేయు త్యాగము యీ క్రింద చెప్పబడిన సంగతులద్వారా బయలుపడును.

వారు క్రీస్తును తమ జీవితములలో ప్రథమ స్థానములో కలిగి యుందురు. రక్త సంబంధీకులు, అయినవారి కన్న క్రీస్తును యెక్కువగా ప్రేమించుదురు (లూకా

14:25-26; మత్తయి 10:37, 19:29). తమ సమయము, ధనము క్రీస్తు కొరకు వెచ్చింతురు.

తమ్మును తాము ఉపేక్షించుకొని, సిలువనెత్తుకొని, అనుదినము క్రీస్తును వెంబడింతురు (మత్తయి 16:24-26, మార్కు 8:34-38; లూకా 9:23-26). ఉపేక్షించుకొనుట అనగా ఉన్నవి లేనట్టుగా, నష్టముగా యెంచుకొనుట. ఉపేక్షించుకొనుటలో తగ్గింపు యిమిడి వున్నది. సాధారణముగా మనిషిలో "అహం" అనునది పనిచేయును. తన కున్న ఆస్తిపాస్తులను బట్టి, విద్య ఉద్యోగమును బట్టి, సామాజిక అంతస్తును బట్టి గర్వించి, యెదుటి మనిషిని లెక్క చేయని రీతిలో మాటలాడును, ప్రవర్తించును. అయితే, క్రీస్తు ప్రేమను రుచి చూచిన విశ్వాసులు అలాగు చేయక, యిహమందు తమకు కలిగినవన్నీ నష్టముగా యెంచుకొని, క్రీస్తును వెంబడించుదురు. అపొస్తలుడైన పౌలు యెంతో విద్యావంతుడును, సామాజిక ఔన్నత్యము కలిగిన వాడైనప్పటికీ, దానిని బట్టి అతిశయించక, క్రీస్తు శ్రమలలో పాలివాడగుట యెట్టిదో యెరుగు నిమిత్తము సమస్తమును నష్టపరచుకొని, వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనెను (ఫిలిప్పి 3:11). నిష్ప్రయోజకులైన దాసులు, కడపటిచోటు అను ఉపమానములలో చెప్పబడినట్లుగా దేవుని యెదుటను, మనుష్యుల యెదుటను విశ్వాసులు తగ్గింపును కనపరచ వలయును.

వారు క్రీస్తు నిమిత్తము కలుగు శ్రమలలో సహనము వహింతురు (అపొ.కొ.14:22; 1 థెస్సలొనీకయులకు 3:3; 2 తిమోతి 3:12). అపొస్తలుడైన పౌలు క్రీస్తు నిమిత్తము పొందిన శ్రమలు 2 కొరింథి 11:23-27 వచనములలో వ్రాయబడినవి. మోషే పెద్దవాడైనపుడు విశ్వాసమును బట్టి ఐగుప్తు ధనముకంటె క్రీస్తు విషయమైన నింద గొప్పభాగ్యమని యెంచుకొని, అల్పకాలము పాపభోగము అనుభవించుటకంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి, ఫరోకుమార్తె యొక్క కుమారుడనిపించుకొనుటకు ఒప్పకొనలేదు. ఏలయనగా అతడు ప్రతి ఫలముగా కలుగబోవు బహుమానమందు దృష్టియుంచెను (హెబ్రీ11:24-26).

యీరీతిగా మనకు కలిగిన వాటిని నష్టముగా యెంచుకొని, అనుదినము ఉపేక్షించుకొని, సిలువనెత్తి కొని ముందుకు సాగుతూ, క్రీస్తు కొరకు శ్రమలనుభవించుటద్వారా మన త్యాగమును కనుపరచి, విశ్వాసయాత్రలో జయ జీవితము కలిగి యుందుము. 'గోధుమ గింజ భూమిలోపడి, చావకుండిన యెడల అది ఒంటిగానే యుండును. అది చచ్చిన యెడల విస్తారముగా ఫలించును (యోహాను 12:24). మన విశ్వాస యాత్రలో జయ జీవితము కలిగియుందుము గాక !

## ౯. దేవుని రాజ్యవారసుల తలాంతులు - బహుమానములు

యేసుక్రీస్తును వెంబడించువారు ఆయా తలాంతులు కలిగిన వార్తై, సార్వత్రిక సంఘ క్షేమాభివృద్ధికై క్రీస్తు రాకడవరకూ పనిచేయుచుండవలెనని చెప్పటకు ఆయన యీ క్రింద తెలుపబడిన మూడు ఉపమానములను చెప్పెను. ఎఫెసీ 4:13లో, 'పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు, క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకును, ఆయన కొందరిని అపొస్తలులనుగాను, కొందరిని ప్రవక్తలనుగాను, కొందరిని సువార్తికులనుగాను, కొందరిని కాపరులనుగాను, ఉపదేశకులను గాను నియమించెను' అని చదువు చున్నాము. దీనిని బట్టి, ప్రతి విశ్వాసికి ఒకటి లేక అంతకన్నా యెక్కువైన తలాంతులు యివ్వబడిన వనియు, వాటిని క్రీస్తుశరీర క్షేమాభివృద్ధికి వాడవలెననియు చూచుచున్నాము. యీ తలాంతుల యొక్క లెక్క ఒకానొకదినమున క్రీస్తు న్యాయపీఠము యెదుట మనము అప్పజెప్పవలసియుండును. "తాను జరిగించిన క్రియలచొప్పన, అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరమును క్రీస్తు న్యాయ పీఠము యెదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథి 5:10).

### (a) ద్రాక్ష తోటలోని పనివారు (మత్తయి 20:1-16) :

అపొస్తలుడైన పేతురు యేసుక్రీస్తుతో, 'ఇదిగోమేము సమస్తమును విడిచిపెట్టి, నిన్ను వెంబడించితిమి కనుక మాకేమి దొరుకునని' అడిగినపుడు ఆయన సమాధానమిస్తూ, యీ ఉపమానమును చెప్పెను.

మత్తయి 20:1-7 వచనములలో ఒక యింటి యజమానుడు తన ద్రాక్షతోటలో పని చేయుటకు దినములో ఆయా సమయములలో వెళ్లి, పనివారిని కుదుర్చుకొనెనని చదువు చున్నాము. అయిదు దఫాలుగా (ఉదయమున ఆరుగంటలకు, తొమ్మిదిగంటలకు, పన్నెండు గంటలకు, మధ్యాహ్నం మూడు గంటలకు, సాయంత్రం అయిదు గంటలకు) పనివారు కుదుర్చుకొనబడిరి. దేవుని

రాజ్యములో పనిచేయుటకు దేవుడు తన పని వారిని ఆయా సమయములలో పిలిచెను. దేవుడు యిర్మియాతో, 'నీవు గర్భమునుండి బయలు పడకమునుపే నేను నిన్ను ప్రతిష్ఠించితిని, జనములకు ప్రవక్తగా నిన్ను నియమించితిని' (యిర్మియా 1:5)అనెను. బాప్తిస్మమిచ్చు యోహాను 'తన తల్లిగర్భమున పుట్టినది మొదలుకొని పరిశుద్ధాత్మతో నిండు కొనినవాడై, ఇశ్రాయేలేయులలో అనేకులను ప్రభువైన వారి దేవుని వైపునకు త్రిప్పనని' వ్రాయబడినది (లూకా 1:15). కొందరు బాల్యము నుండియు, కొందరు మధ్యవయస్కులుగాను మరికొదరు చివరి దశలోను యేసును వెంబడించుదురు. సాయంత్రం అయిదు గంటలకు పిలువబడిన వారు క్రీస్తు రాకడ బహు సమీపముగా నున్న యీ దినములలో విశ్వాసములోనికి వచ్చుచున్న అనేకులను సూచిస్తున్నారు.

ద్రాక్షతోటలో పని చేయు ప్రతి పనివానికి జీతము నిర్ణయింపబడినది. "యిదిగో త్వరగా వచ్చుచున్నాను. వానివాని క్రియల చొప్పన ప్రతివానికిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నా యొద్దవున్నది"(ప్రకటన 22:12). మనుష్య కుమారుడు తన తండ్రి మహిమ గలవాడై, తన దూతలతోకూడ రాబోవు చున్నాడు. అప్పడాయన ఎవని క్రియలచొప్పన వానికి ఫలమిచ్చును (మత్తయి 16:27). ఇదిగో ఆయన ఇచ్చు బహుమానము ఆయన యొద్దనే యున్నది. ఆయన ఇచ్చు జీతము ఆయన తీసికొని వచ్చు చున్నాడని సీయోను కుమార్తెకు తెలియజేయుడి (యెషయా 62:11). విశ్వాసులందరూ పైవాక్య భాగములనుబట్టి శరీరములో జరిగించిన క్రియల చొప్పన ప్రతిఫలము పొందుదురని చూచుచున్నాము. (2 కొరింథి 5:10).

అయితే, యీ ఉపమానము చెప్పడానికి ముందే యేసుక్రీస్తు మొదటివారు కడపటి వారగుదురని, కడపటి వారు మొదటి వారగుదురని హెచ్చరించెను (మత్తయి 19:30). యీ ఉపమానములోని ద్రాక్షతోట యజమానుడు తనగృహనిర్వాహకునితో చివర వచ్చిన పనివారితో మొదలుకొని, మొదట వచ్చిన పని వారి వరకూ అందరికీ ఒక్క దేనారమునే యిప్పించెనని

వ్రాయబడినది (మత్తయి 20:8-9). అందరికీ యివ్వబడినది ఒక్కదేనారమే అయినను, వారు చేసిన పనిని బట్టి, దానికి విలువ కట్ట బడుతున్నది. యీ సత్యమును చివర వచ్చినవారిని యజమానుడు ముందు పిలుచుటను బట్టి గ్రహించుచున్నాము. చివరవచ్చిన వారు ఒకదేనారము పొందుట చూచి, మొదట వచ్చిన వారు తాము యెక్కువ సమయము పని చేయుటను బట్టి తమకు ఎక్కువ దొరుకుననుకొనిరి (మత్తయి 20:10). చివరవచ్చిన వారిని కూడా యజమానుడు వారితో సమానము చేసెనని మొదట వచ్చినవారు అతనిపై సణుగుకొనిరి. దీనిని బట్టి, మనము యెంత కాలము విశ్వాసములో వున్నాము అన్న మాటను బట్టి కాకుండా, క్రీస్తు కొరకు మనము యెంతపని చేశాము అన్న మాటను బట్టి మాత్రమే మన బహుమానము నిర్ణయింపబడునన్న సత్యమును గ్రహించుచున్నాము.

విశ్వాసములో దిగజారిపోయి, కడపటి వారము కాకుండునట్లు మనలను మనము కాచుకొనవలెను. తాను నిలుచుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను (1కొరింథి 10:11). క్రీస్తును పునాదిగా కలిగిన మనము కట్ట, గడ్డి,కొయ్యకాలు మొదలైన వాటితో కాకుండా బంగారము, వెండి, వెలగల రాళ్లు అనువాటితో మన విశ్వాస జీవితములను కట్టు కొనవలెనని హెచ్చరింపబడుచున్నాము. పునాదిమీద ఒకడు కట్టినపని నిలిచిన యెడల వాడు జీతము పుచ్చుకొనును. ఒకని పని కాల్చివేయబడిన యెడల వానికి నష్టము కలుగును. అతడు తన మట్టుకు రక్షింపబడును గాని అగ్నిలో నుండి తప్పించుకొన్నట్టు రక్షింపబడును (1 కొరింథి 13:13-15).

## (b) తలాంతులు (మత్తయి 25:14-30)

'ద్రాక్షతోటలోని పనివారు' అను ఉపమానములో దేవుని రాజ్యము పట్ల మనము చేసిన పనిని బట్టి మన బహుమానము వుండునని చూచితిమి.

“తలాంతులు” అను యీ ఉపమానములో ఆపని చేయుటకు అవసరమైన ‘తలాంతు’ ను కూడా యేసుక్రీస్తు విశ్వాసులకు అనుగ్రహించుననని గమనించుదుము. ‘తలాంతు’ అనగా భూమి మీద దేవుని పరిచర్య జరిగించుటకు దేవుడు విశ్వాసులకు అనుగ్రహించిన కృపావరము. రోమా 12:6-8 లో ”మనకనుగ్రహింపబడిన కృప చొప్పున వెవ్వేరు కృపావరములు కలిగిన వారమై యున్నాము గనుక ప్రవచన వరమైతే విశ్వాస పరిమాణముచొప్పున ప్రవచింతము, పరిచర్యయైతే పరిచర్యలోను, బోధించువాడైతే బోధించుటలోను, హెచ్చరించువాడైతే హెచ్చరించుటలోను పనికలిగియుందము. పంచిపెట్టువాడు శుద్ధమనస్సుతోను, పైవిచారణ చేయువాడు జాగ్రత్తతోను, కరుణించు వాడు సంతోషముతోను పని జరిగింపవలెను” అని వ్రాయబడినది. కనుక బోధించుట, హెచ్చరించుట, కరుణించుట మొదలగునవి విశ్వాసులకు దేవుని చేత యివ్వబడిన తలాంతులు. దేవుడు విశ్వాసులకు అనుగ్రహించిన తలాంతు యెంతో విలువైనది. యూదుల లెక్క ప్రకారము ఒక తలాంతు 6,000 దేనారములు. ఒక దేనారము ఒక్క రోజు జీతము. ఆ చొప్పన 6000 దేనారములు దాదాపు ఇరవై సంవత్సరాల జీతమగును. దీనిని బట్టి తలాంతు విలువ మనకు తెలియుచున్నది.

మత్తయి 25:14-30 వచనములో వ్రాయబడిన ఉపమానము పరిశీలించిన యెడల యీ క్రింది సంగతులను గమనించుదుము.

**(1) తలాంతులు వేర్వేరు పరిమాణములలో సామర్థ్యము చొప్పన విశ్వాసులకు యివ్వబడును (మత్తయి 25:15)**

తలాంతులు దేవుని ఆస్తిగా చెప్పబడినవి (మత్తయి 25:14). యివి వారి వారి సామర్థ్యమును బట్టి విశ్వాసులకు యివ్వబడు చున్నవి. సామర్థ్యమనగా దేవుని చిత్తానికి లోబడి జీవించు స్వభావపు పరిమాణము లేదా దేవుడు ఒక్కొక్కరికి విభజించి యిచ్చిన విశ్వాస పరిమాణము (రోమా 12:3). మనలో ప్రతి వానికిని క్రీస్తు అనుగ్రహించు వరము యొక్క పరిమాణము చొప్పన కృప యియ్య బడెను (ఎఫెసి 4:8). ఉపమానములో చెప్పబడిన మనుష్యుడు వారి

సామర్థ్యమును బట్టి తన దాసులలో ఒకనికి అయిదు తలాంతులను, ఒకనికి రెండు, ఒకనికి ఒకటియు అనుగ్రహించెను (మత్తయి 25:15).

**(2) యజమానుడు తన దాసుల తలాంతుల లెక్క చూచుకొనును (మత్తయి 25:19)**

'కనికరములేని చెడ్డ దాసుడు' అను ఉపమానములో దాసుని యజమానుడు లెక్క చూచు కొనెను (మత్తయి 18:24). 'యుక్తి పరుడైన గృహనిర్వాహకుడు' అను ఉపమానములో 'గృహనిర్వాహకత్వపు లెక్క' అప్పగించుమని అన్యాయస్థుడైన గృహనిర్వాహకునితో అతని యజమానుడు చెప్పెను (లూకా 16:2). అదే విధానములో ప్రస్తుత ఉపమానములో బహు కాలమైన తరువాత ఆ దాసుల యజమానుడు వచ్చి వారి యొద్ద లెక్క చూచుకొనెను (మత్తయి 25:19). మన జీవితముల లెక్క దేవునికి అప్ప జెప్పవలసి యుండునని మనము గ్రహించు చున్నాము (ప్రసంగి 11:9; 2 కొరింథి 5:10).

**(3) దాసుల తలాంతుల లెక్క అప్పగింత, వారి బహుమానములు (మత్తయి 25:20-30)**

ఉపమానములో చెప్పబడిన దాసులలో అయిదు తలాంతులు తీసికొనినవాడు వెళ్లి, వాటితో వ్యాపారము చేసి, మరి అయిదు తలాంతులు సంపాదించెననియు, రెండు తలాంతులు తీసుకొనిన వాడు మరి రెండు తలాంతులు సంపాదించెననియు చదువు చున్నాము (మత్తయి 25:16,17). దేవుడు మనకిచ్చిన తలాంతులను రెట్టింపు చేసుకొనడమనగా మనకున్న తలాంతులను దేవుని పరిచర్యలో సక్రమముగా వాడుకొనడమని అర్థము. ఉన్న తలాంతులను వినియోగించినప్పడే కృపావరములో యింకను బలపడి, వృద్ధిపొందుదుము.

యేసు క్రీస్తును వెంబడించు ప్రతివిశ్వాసికి ఒకటి లేదా యెక్కువ తలాంతులు అనుగ్రహింపబడినవి. అందరి ప్రయోజనము కొరకు ప్రతివానికి ఆత్మ

ప్రత్యక్షత అనుగ్రహింపబడుచున్నది (1కొరింథి 12:7). తనలో దాగియున్న ఆ ప్రత్యక్షతను లేదా తలాంతును ప్రతి విశ్వాసి ప్రజ్వలింప చేసు కొనవలెను (2 తిమోతి 1:6). తన తలాంతును కనుగొనిన తరువాత ప్రతి విశ్వాసి దానిని దేవుని పరిచర్య లో నమ్మకముగా వాడ వలయును. దేవుని నానావిధమైన కృప విషయమై మంచి గృహనిర్వాహకులై యుండి, యొక్కొక్కడు కృపావరము పొందిన కొలదీ యొకనికొకడు ఉపచారము చేయుడి. ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించునట్లు బోధింపవలెను. ఒకడు ఉపచారము చేసిన యెడల దేవుడు అను గ్రహించు సామర్థ్యము నొంది, చేయవలెను (1 పేతురు 4:10,11)

యీ ఉపమానములో, అయిదు తలాంతులు పొందిన దాసుడు మరి అయిదు తలాంతులు సంపాదించి, తన యజమానిముందు నిలిచినపుడు, అతని యజమానుడు - భళా,నమ్మకమైన మంచి దాసుడా, నీవు యీ కొంచెములో నమ్మకముగా ఉంటివి. నిన్ను అనేకమైన వాటిమీద నియమించెదను. నీ యజమానుని సంతోషములో పాలు పొందుమని అతనితో చెప్పెను. అలాగే రెండు తలాంతులు సంపాదించిన దాసునితోనూ చెప్పెను (మత్తయి 25:20-23). దీనిని బట్టి, మన నమ్మకత్వమును బట్టి దేవుడు మనకు అధికమైన బాధ్యత అప్పగించునని చూచు చున్నాము. అంతే గాక క్రీస్తు మహిమలోను, సంతోషములోను పాలివారమైయుందుమని చెప్పబడుచున్నాము (1పేతురు 5:1; 2 థెస్సలొనీ కయులకు 1:9).

అయితే, ఒక్క తలాంతు పొందిన దాసుడు భూమిని త్రవ్వి, దానిని దాచిపెట్టెననియు, మరియు తనలెక్క అడిగినప్పడు యజమానునితో యెంతో నిర్లక్ష్యముగా మాటలాడెననియు మనము చదువు చున్నాము (మత్తయి 25:18, 24, 25). తలాంతును భూమిలో దాచిపెట్టడమనగా దేవుడను గ్రహించిన కృపావరమును పరిచర్యలో వాడకుండా, పూర్తిగా నిర్లక్ష్యము చేసి, సోమరిగా వుండుట. ఒక్క తలాంతు పొందిన దాసుడు, దానిని దాచిపెట్టడమే కాకుండా తన యజమానుడు లెక్క అడిగినపుడు 'అయ్యా, నీవు విత్తని చోట

కోయువాడవును, చల్లని చోట పంట కూర్చుకొను వాడవునైన కఠినుడవని నేనెరుగుదును. కనుక నేను భయపడి, వెళ్లి నీ తలాంతును భూమిలో దాచిపెట్టితిని. ఇదిగో నీది నీవు తీసికొనుమని' చెప్పెను (మత్తయి 25:24,25). యిట్లుచెప్పట ద్వారా సోమరియైన ఆదాసుడుతన సొంత జ్ఞానమును ప్రదర్శించెను. కనుకనే, 'హేతువులు చూపగల యేడుగురి కంటె సోమరి తన దృష్టికితానే జ్ఞానిననుకొనునని' వ్రాయబడినది (సామెతలు 26:16). యిటువంటి దాసులు తమ ప్రతిఫలమును అనుభవించెదరని మత్తయి 25:26-30 వచనములలో చదువు చున్నాము.

ప్రియులారా, దేవుడిచ్చిన తలాంతులను దేవుని పరిచర్యలో వాడు చున్నామా ?

## (c) మినాలు (లూకా 19:11-27)

'తలాంతులు' అను ఉపమానములో క్రీస్తు రెండవ రాకడవరకూ దేవుడు మనకిచ్చిన తలాంతులతో వ్యాపారము చేసి (దేవుని పరిచర్యలో వాడి), వాటిని అధికము చేసుకొనవలెనన్న సత్యమును చూచితిమి. ఇదే అర్థమునిస్తూ యేసు క్రీస్తు 'మినాలు' అను ఉపమానమును చెప్పెను. 'తలాంతులు' అను ఉపమానమును యేసు క్రీస్తు యెరుషలేములో ప్రవేశించి, సిలువ వేయ బడుటకు ముందు తన చివరి వారములో చెప్పెను. అయితే, 'మినాలు' అను యీ ఉపమానమును యేసుక్రీస్తు యెరూషలేములోనికి గాడిదపిల్లమీద ప్రవేశించుటకు ముందు చెప్పెను.

యీ ఉపమానము చెప్పటకు ముందు యూదులు దేవుని రాజ్యము వెంటనే అగుపడునని తలంచుచుండిరి(లూకా 19 :11). అపొ.కా. 1:6లో కూడా శిష్యులు, 'ప్రభువా, యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా ?' అని యేసుక్రీస్తును అడిగినపుడు, 'కాలములను, సమయములను తండ్రి తన స్వాధీనమందుంచు కొని యున్నాడు. వాటిని తెలిసికొనుట మీపనికాదు' (అపొ.కా.1:7) అని చెప్పెను. దీనిని బట్టి, భౌతికపరమైన క్రీస్తు రాజ్యము యేసు క్రీస్తు సిలువ వేయబడి, రాజుగా తన రెండవరాకడలో

వచ్చినపుడు ఏర్పరచునని తెలిసి కొందుము. అయితే, తాను రాజుగా వచ్చువరకు, తన పరిచర్యలో నిమగ్నులై యుండుడని తెలుపుటకు 'మినాలు' అను ఉపమానమును చెప్పెను.

లూకా 19:12-15 లో యీలాగు వ్రాయబడినది. "రాజకుమారుడొక రాజ్యము సంపాదించుకొని, మరల రావలెనని దూరదేశమునకు ప్రయాణమై, తన దాసులను పదిమందిని పిలిచి, వారికి పది మినాల నిచ్చి, నేను వచ్చు వరకు వ్యాపారము చేయుడని వారితో చెప్పెను. అయితే అతని పట్టణస్థులతని ద్వేషించి, ఇతడు మమ్మునేలుట మాకిష్టములేదని అతని వెనుక రాయబారము పంపిరి. అతడా రాజ్యము సంపాదించుకొని, తిరిగి వచ్చినపుడు, ప్రతివాడును వ్యాపారము వలన ఏమేమి సంపాదించెనో తెలిసికొనుటకై తాను సొమ్మిచ్చిన దాసులను తన యొద్దకు పిలువుమని ఆజ్ఞాపించెను." యేసుక్రీస్తు పరలోకమునకు వెళ్లి, దూతలమీదను, అధికారుల మీదను, శక్తులమీదను అధికారము పొందినవాడై, దేవుని కుడి పార్శ్వమున ఉన్నాడు (1 పేతురు 3:22). దేవుడు తన బలాతిశయము చేత క్రీస్తును మృతులలో నుండిలేపి, సమస్తమైన ఆధిపత్యము కంటెను, అధికారము కంటెను, శక్తికంటెను, ప్రభుత్వముకంటెను, ఈ యుగమునందు మాత్రమేగాక రాబోవు యుగమునందును పేరు పొందిన ప్రతి నామము కంటెను ఎంతో హెచ్చుగా పరలోకమునందు ఆయనను తన కుడిపార్శ్వ మున కూర్చుండబెట్టు కొనియున్నాడు (ఎఫెసీ 1:21). ఉపమానములో చెప్పబడిన రాజకుమారుడు రాజ్యము సంపాదించుకొని వచ్చిన రీతిలో, దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింపబడిన ప్రభువైన యేసుక్రీస్తు "రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు" అను నామమును కలిగినవాడై, తెల్లని గుర్రము మీద తన పరిశుద్ధుల సమూహముతో వచ్చునని దేవుని వాక్యము సెలవిస్తున్నది (ప్రకటన 19:11-16).

'తలాంతులు' అను ఉపమానములో యజమానుడు దాసుల యొక్క తలాంతుల లెక్క అడిగిన విధానములో యీ ఉపమానములో కూడా రాజు తన దాసుల వ్యాపారపు లెక్క అడుగు చున్నాడు (లూకా 19:15). తలాంతులు' అను

' ఉపమానములో చెప్పబడినట్లు తమ కప్ప జెప్పబడిన బాధ్యతను నమ్మకముగా నిర్వర్తించు వారికి అధికమైన బాధ్యత నప్పగించి, తన సంతోషములో వారు పాలుపొందునట్లు చేసి, నిర్లక్ష్యముగా వ్యవహరించుదాసులను శిక్షించునని లూకా 19:16-26 వచనములలో చదువు చున్నాము. అంతే గాక, తన రాజరికమును తృణీకరించు వారుకూడా శిక్షింపబడుదురని లూకా 19:27లో చదువు చున్నాము.

# ౧౦. దేవుని రాజ్యమును తృణీకరించు వారికి తీర్పు

ప్రియులారా, అయిదవ అధ్యాయములో దేవుని రాజ్యము కొరకైన యేసుక్రీస్తు పిలుపును తృణీకరించు వారిని గురించి నాలుగు ఉపమానముల ద్వారా తెలిసి కొంటిమి. చివరిదైన యీ అధ్యాయములో యేసుక్రీస్తు పిలుపును తృణీకరించి, దేవుని రాజ్యమును, యేసుక్రీస్తు పరిపాలనను ధిక్కరించిన యెడల కలుగు శిక్షను గురించి దేవుని వాక్యములో చెప్ప బడిన నాలుగు ఉపమానములను గూర్చి తెలిసికొందము.

యేసుక్రీస్తును గురించి యోహాను 1:11లో, 'ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను. ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు' అని చదవుచున్నాము. ఇశ్రాయేలీయులు యెహోవాను విసర్జించి, ఆయనను విడిచి, తొలగిపోయి, నిత్యము తిరుగుబాటు చేసిరి (యెషయా 1:4,5). 'దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు. వారు చెడిపోయిన వారు అసహ్యకార్యములు చేయుదురు. మేలు చేయువాడొకడును లేడని' కీర్తన 14:1లో వ్రాయబడియున్నది. రోమా1:21-23 వచనములలో 'వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు. కృతజ్ఞతాస్తుతులు చెల్లింపనులేదు గాని తమ వాదములయందు వ్యర్థులైరి. వారి అవివేక హృదయము అంధకార మయమాయెను. తాను జ్ఞానులమని చెప్పకొనుచు, బుద్ధిహీనులైరి. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యుల యొక్కయు, పక్షుల యొక్కయు, చతుష్పాద జంతువుల యొక్కయు, పురుగుల యొక్కయు ప్రతిమా స్వరూపముగా మార్చిరని' చదివెదము. ప్రతి అక్రమమును, అవిధేయత యు న్యాయమైన ప్రతిఫలము పొందును (హెబ్రీ 2:2). యిదిగో త్వరగా వచ్చు చున్నాను. వానివాని క్రియచొప్పన ప్రతివానికిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద వున్నది (ప్రకటన 22:12). దేవుని తీర్పును తెలియ జేయుటకు యేసుక్రీస్తు చెప్పిన నాలుగు ఉపమానములు యీ క్రింద తెలుపబడినవి.

## (a) ఫలింపని అంజూరపు చెట్టు (లూకా 13:6-9)

యేసుక్రీస్తు దినములలో, పిలాతు చేత చంపబడిన కొందరు గలిలయుల విషయము మరియు సిలోయములోని గోపురముపడి, చచ్చిన పదునెనిమిది మంది విషయము తన దృష్టికి తీసుకురాబడినపుడు, ఆయన, ఆరీతిగా చనిపోయిన వారు బ్రతికియున్న మిగిలినవారికంటె యెక్కువ పాపమేమియు చేయలేదని చెప్పెను. మరియు వారు మారుమనసు పొందని యెడల చని పోయిన వారివలె వారుకూడా నశించుదురని యూదులతో చెబుతూ, 'ఫలింపని అంజూరపుచెట్టు' ఉపమానమును చెప్పెను (లూకా 13:1-5).

లూకా 13:6-9 వచనములలో యీలాగు వ్రాయబడినది :

'మరియు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను - ఒక మనుష్యుని ద్రాక్షతోటలో అంజూరపు చెట్టొకటి నాటబడియుండెను. అతడు దానిపండ్లు వెదకవచ్చినపుడు ఏమియు దొరకలేదు. గనుక అతడు ఇదిగో మూడేండ్ల నుండి నేను యీ అంజూరపు చెట్టున పండ్లు వెదకవచ్చు చున్నానుగానీ, యేమియు దొరకలేదు, దీనిని నరికివేయుము. దీనివలన యీ భూమియు ఏల వ్యర్థమై పోవలెనని ద్రాక్షతోట మాలితో చెప్పెను. అయితే వాడు - అయ్యా, నేను దాని చుట్టు త్రవ్వి, యెరువు వేయుమట్టుకు ఈ సంవత్సరముకూడా ఉండనిమ్ము, అదిఫలించిన సరి. లేనియెడల నరికించి వేయుమని అతనితో చెప్పెను.

పై వాక్య భాగములో యేసుక్రీస్తు ఇశ్రాయేలీయులను ఉద్దేశించి, వారిని అంజూరపు చెట్టుతో పోల్చి చెప్పినప్పటికీ, యీసత్యము అందరికీ వర్తిస్తున్నది. యీ వాక్యభాగములో క్రింద చెప్పబడిన విషయములను గమనించుదుము.

**(1) ఒక మనుష్యుడు అంజూరపు చెట్టును ద్రాక్షతోటలో నాటెననుమాట** దేవుడు ఇశ్రాయేలీయులను శ్రేష్టమైన దేశములో వుంచి, వారు దేవుని కట్టడలను అనుసరించునట్లుగా ధర్మ శాస్త్రమును, ప్రవక్తలను వారి మధ్యనుంచెనను సత్యమును సూచిస్తున్నది. 'దుష్టులైన ద్రాక్షతోట కాపులు' ఉ

ప్రమానములో యీ సత్యమును గూర్చి తెలిసికొంటిమి. యెషయా 5:1-2లో, 'నా ప్రియుని గూర్చి పాడెదను వినుడి. అతని ద్రాక్షతోటనుబట్టి నాకిష్టుడైన వాని గూర్చి పాడెదను వినుడి. సత్తువ భూమిగల కొండమీద నాప్రియునికొక ద్రాక్షతోట యుండెను. ఆయన దానిని బాగుగా త్రవ్వి, రాళ్లను ఏరి, అందులో శ్రేష్టమైన ద్రాక్ష తీగెలను నాటించెను. దాని మధ్యను బురుజు ఒకటి వేయించి ద్రాక్ష తొట్టిని తొలిపించెను.' అని చదువు చున్నాము.

**(2) అంజూరపు చెట్టును నాటిన మనుష్యుడు దాని పండ్ల వెదకవచ్చినపుడు యేమియు దొరక లేదు (లూకా 13:6) :** దేవుడు మనికిచ్చిన ఆయు రారోగ్యములు, ఐశ్వర్యము, జ్ఞానమును బట్టి దేవుని మరచిపోక, ఆయన నెరిగి జీవించుట దేవుని ఉద్ధేశ్యమై యున్నది. అంజూరపు చెట్టు ఫలించకపోవడమనునది మానవుడు తన పాపమును బట్టి మారు మనస్సు పొందక పోవుటను సూచిస్తున్నది. మారు మనస్సుకు తగిన ఫలము ఫలించుడని బాప్తిస్మమిచ్చు యోహాను ఇశ్రాయేలీయులకు చెప్పెను. అయితే, దేవుడు, వివేకము కలిగితనను వెదకువారు కలరేమో అని ఆకాశమునుండి నరులను పరిశీలించినపుడు, వారందరు దారి తొలగి బొత్తిగా చెడియున్నారని, మేలు చేయువారెవరును లేరని దేవుని వాక్యము సెలవిస్తున్నది. (కీర్తన 14:2,3). ఏ భేదమూ లేదు. అందరును పాపము చేసి, దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవు చున్నారు (రోమా 3:23).

**(3) ఆ మనుష్యుడు అంజూరపు చెట్టు ఫలముకొరకు మూడు సంవత్సరములు యెదురు చూచెను (లూకా 13:7) :**

పైన చెప్పబడిన మాట మానవుని పట్ల దేవునికున్న సహనమును గూర్చి తెలియజేయుచున్నది. మనప్రభువు యొక్క దీర్ఘశాంతము రక్షణార్ధమైనదని యెంచుకొనుడి (2 పేతురు 3:15). కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడుగాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనసు పొందవలెనని కోరుచు,

మీయెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు (2 పేతురు 3:9). ఆయన, మనుష్యులందరు రక్షణపొంది, సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించు చున్నాడు (1 తిమోతి 2:4).

**(4)ఆమనుష్యుడు అంజూరపు చెట్టును నరికి వేయమని నపుడు తోటమాలి ఆగుమని (బతిమాలెను (లూకా 13:7,8) :**

తోట యాజమానుడు ఫలించని అంజూరపు చెట్టును నరికి వేయుమని తోటమాలితో చెప్పినపుడు ఆయన, అయ్యా, నేను దానిచుట్టు త్రవ్వి, యెరువు వేయుమట్టుకు ఈ సంవత్సరము కూడా ఉండనిమ్ము. అది ఫలించినసరి, లేనియెడల నరికించి వేయుమని అతనితో చెప్పెను (లూకా 13:7-9). యీ వాక్యభాగములో 'తోటమాలి' ప్రభువైన యేసుక్రీస్తును సూచిస్తున్నాడు. దేవుడొక్కడే, దేవునికి నరులకును మధ్యవర్తియు ఒక్కడే. ఆయన క్రీస్తు యేసను నరుడు (1 తిమోతి 2:5). యేసు క్రీస్తు మృతులలోనుండి లేచి, దేవుని కుడిపార్శ్వమున ఉన్నవాడై, మనకొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు (రోమా 8:34). తన ద్వారా దేవుని యొద్దకు వచ్చువారి పక్షమున విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించు చున్నాడు(హెబ్రీ 7:25). ఫలింపని అంజూరపు చెట్టును నరికి వేయించుటకు ముందు యింకొక్క సంవత్సరము ఆగుమని తోటమాలి తనయజమానునితో చెప్పినట్లు, ప్రభువైన యేసుక్రీస్తు మానవుల కొరకు తండ్రియైన దేవుని సన్నిధిలో విజ్ఞాపన చేయుచున్నాడు. పరిశుద్ధ గ్రంధములో మోషే, యెహోషువ, దాని యేలు, పౌలు మొదలగువారు యితరులకొరకు విజ్ఞాపన చేసిరని వ్రాయబడినది (నిర్గమ కాం. 32:11-13; యెహోషువ 7:6-9; దానియేలు 9:3-19, కొలొస్సయులకు 1:9-12).

**(5) ఫలింపని అంజూరపు చెట్టు నరికించి వేయబడును (లూకా 13:9)** బాప్తిస్మమిచ్చు యోహాను దేవుని రాజ్యమును గూర్చి యూదులకు బోధిస్తూ, 'ఇప్పడే గొడ్డలి చెట్ల వేరున ఉంచబడియున్నది గనుక మంచిఫలము ఫలింపని ప్రతి చెట్టును నరకబడి, అగ్నిలోవేయబడునని' చెప్పెను (మత్తయి 3:10). 'నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసిపారవేయును. 'ఎవడైనను నాయందు

నిలిచియుండని యెడల, వాడు తీగెవలె బయట పారవేయబడి, యెండిపోవును' (యెహాను 15:2,6). దేవుని వాక్యములో 'పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికులందరును అగ్నిగంధకములతోమండు గుండములో పాలు పొందుదురు. ఇది రెండవ మరణము' (ప్రకటన 21:8) అని చదువు చున్నాము.

తోటమాలి తన యజమానుడు అంజూరపు చెట్టును నరికించి వేయకుండా ఒక సంవత్సరము ఆపిన రీతిలో, ప్రభువైన యేసుక్రీస్తు దేవుని ఉగ్రత లోకము మీద రాకుండా విజ్ఞాపన చేయుచున్నాడని యీ ఉపమానముద్వారా తెలుసు కొనుచున్నాము. అయితే, సంవత్సర కాలమైన తరువాత, యజమానుడు ఫలించని అంజూరపు చెట్టును యే లాగు నరికించునో, ఆలాగు యేసుక్రీస్తు విజ్ఞాపన కాలము పూర్తయిన వెంటనే దేవుని ఉగ్రత లోకము మీదికి వచ్చునని మనము గ్రహింపవచ్చును (2 పేతురు 3:7,10).

## (b) గురుగులు(మత్తయి 13:24-30, 36-43) :

యీలోకములో దేవుని రాజ్యసంబంధులతో పాటు దుష్టుని సంబంధులు(గురుగులు) ఉన్నారనియు, దేవుని తీర్పు యుగాంతమందు దుష్టుని సంబంధులపై ఉండుననియు తెలియజేయుటకు యేసుక్రీస్తు 'గురుగులు' అను ఉపమానమును చెప్పెను.

మత్తయి 13:24-30 వచనములలో యీలాగు వ్రాయబడినది. 'ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను. ఏమనగా పరలోక రాజ్యము, తన పొలములో మంచి విత్తనము విత్తిన యొక మనుష్యుని పోలియున్నది. మనుష్యులు నిద్రించుచుండగా, అతని శత్రువువచ్చి, గోధుమల మధ్యను గురుగులు విత్తిపోయెను. మొలకలు పెరిగి, గింజ పట్టినప్పుడు గురుగులు కూడా అగపడెను. అప్పుడు యింటి యజమానుని దాసులు అతని యొద్దకు వచ్చి, అయ్యా, నీవు

నీపొలములో మంచి విత్తము విత్తితివిగదా, అందులోగురుగు లెక్కడనుండి వచ్చినవని అడిగిరి. ఇది శత్రువు చేసిన పని అని అతడు వారితో చెప్పగా, ఆదాసులు, మేము వెళ్లి వాటిని పెరికి కూర్చుట నీకిష్టమా ? అని అతనిని అడిగిరి. అందుకతను - వద్దు, గురుగులను పెరుకుచుండగా, వాటితో కూడా ఒకవేళ గోధుమలను పెల్లగింతురు. కోతకాలము వరకూ రెంటిని యెదుగనియ్యుడి. కోత కాలమందు గురుగులను ముందుగా కూర్చి, వాటిని కాల్చివేయుటకు కట్టలు కట్టి, గోధుమలను నాకొట్టులో చేర్చి, పెట్టుడని కోతగాండ్రతో చెప్పదుననెను.'

పై ఉపమాన భావమును తెలియజేయుమని యేసుక్రీస్తును తన శిష్యులు అడిగినపుడు మత్తయి 13:36-43 వచనములలో ఆయన ఉపమాన భావమును యీ క్రింది విధముగా చెప్పెను.

**(1) మంచి విత్తనము విత్తువాడు మనుష్యకుమారుడు (మత్తయి 13:37) :** మంచి విత్తనముదేవుని రాజ్యమును గూర్చిన సువార్త. దానిని విత్తువాడు యేసుక్రీస్తు. యేసు యూదుల సమాజమందిరములలో బోధించుచు, దేవుని రాజ్యమును గూర్చిన సువార్తను ప్రకటించుచుండెను (మత్తయి 4:23,9:35; 11:1; లూకా 4:43). యోహాను చెరపట్ట బడిన తరువాత యేసు - కాలము సంపూర్ణమైయున్నది. దేవుని రాజ్యము సమీపించి యున్నది. మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని చెప్పచు దేవుని సువార్త ప్రకటించుచు, గలిలయకు వచ్చెను (మార్కు 1:14-15).

**(2) పొలము లోకము (మత్తయి 13:38) :** యీలోకము (దేవునెరుగని పాపముతో కూడిన వ్యవస్థ) ఒక పొలముగా వర్ణించబడినది. దేవుడు యిటువంటి లోకమును యెంతో ప్రేమించెను (యోహాను 3:16). పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెను (1 తిమోతి 1:15). యేసుక్రీస్తు దేవుని యొద్దనుండి బయలు దేరి లోకమునకు వచ్చెనని యోహాను 16:28లో వ్రాయబడినది. యేసు క్రీస్తు తన శిష్యులతో, 'సర్వలోకమునకు వెళ్లి, సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడని' చెప్పెను (మార్కు 16:15).

**(3) మంచి విత్తనములు రాజ్య సంబంధులు (మత్తయి 13:38)** దేవుని రాజ్య సువార్తనుగైకొని, తమ పాపములను బట్టి పశ్చాత్తాపపడి, మారుమనస్సు పొందువారందరూ మంచి విత్తనములుగా యెంచబడుచున్నారు. అట్టివారు వెలుగు సంబంధులును, పగటి సంబంధులునై యున్నారు (1థెస్సలోనీకయులకు 5:5). వారు దేవుని రాజ్యమును స్వతంత్రించు కొందురు గనుక రాజ్య సంబంధులుగా పిలువబడుచున్నారు.

**(4) గురుగులు దుష్టుని సంబంధులు (మత్తయి 13:38):** యేసు క్రీస్తు 'మీరు మీతండ్రియగు అపవాది సంబంధులు. మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు. ఆదినుండి వాడు నరహంతకుడైయుండి, సత్యమందు నిలిచినవాడు కాడు. వాడు అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడునై యున్నాడని' సాతానుని గూర్చియు, వానిని వెంబడిస్తున్న యూదులను గూర్చియు చెప్పెను (యోహాను 8:44). అట్టి వారు దుర్నీతి పరులుగా చెప్పబడుచున్నారు (మత్తయి 13:41). వారు పాపములచేతను అపరాధములచేతను చచ్చినవారై, వాయుమండల సంబంధమైన అధిపతిని (సాతానును) అనుసరించి, యీ ప్రపంచధర్మము చొప్పన నడుచుకొనుచున్నారని ఎఫెసి 2:2లో చదువుచున్నాము. దుష్టుని సంబంధులు విశ్వాసులమధ్య కూడా ఉన్నట్లుగా దేవుని వాక్యము సెలవిస్తున్నది. అపొ.కా.20:29-30 వచనములలో పౌలు, 'నేను వెళ్లిన తరువాత క్రూరమైన తోడేళ్లు మీలో ప్రవేశించుననని నాకు తెలియును. వారు మందను కనికరింపరు. మరియు శిష్యులను తమవెంట ఈడ్చుకొని పోవలెనని వంకరమాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలు దేరుదురని' చెప్పెను. ఇది ఆశ్చర్యము కాదు. సాతాను తానే వెలుగుదూత వేషము ధరించుకొను చున్నాడు (2 కొరింథి 11:14).

**(5) గరుగులను విత్తిన శత్రువు అపవాది (మత్తయి 13:38)** ఏదేను వనములో సాతాను సర్పరూపములో ప్రవేశించి, హవ్వను మోసపరచుట ద్వారా లోకములో పాపమును ప్రవేశపెట్టెను. అపవాది గర్జించు సింహమువలె

ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు, తిరుగుచున్నాడు (1 పేతురు 5:8). యీ అపవాది అవిశ్వాసుల మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగజేయును (2 కొరింథి 4:4). వారిని మోసపరచును (ప్రకటన 20:7,8).

**(6) కోతయుగసమాప్తి, కోత కోయువారు దేవదూతలు (మత్తయి 13:39):** యుగసమాప్తియందు ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతోకూడ పరలోకమునుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని యెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునని 2 థెస్సలోనీకయులకు 1:6-8 లో చదువుచున్నాము. యీవచనములు గమనించినచో, యుగ సమాప్తియందు నీతిమంతులనుండి దుష్టులు వేరు పరచ బడుదురు (మత్తయి 7:21-23, 25:41-46, లూకా 13:25-27)

**దుష్టులకు కలుగబోవు ప్రతిదండన:**

(1) వారు అగ్నిగుండ ములో పడవేయబడుదురు (మత్తయి 13:41; ప్రకటన 20:12-15): యీ అగ్నిగుండము నరకాగ్నిగా (మత్తయి 5:22, 10:28, 18:8-9), అగ్నిగంధకములతో మండు గుండముగా (ప్రకటన 21:8), ఆరని అగ్నిగా (మార్కు9:43-48, మత్తయి 25:41), వెలుపటి చీకటిగా (మత్తయి 8:12, 22:13, 25:30), నిత్య శిక్షగా (మత్తయి 25:46) చెప్పబడినది.

(2) అచ్చట ఏడ్పును, పండ్లు కొరకుటయు వుండును (మత్తయి 8:12, 22:13, 24:51, 25:30): ప్రియులారా, యిటువంటి దేవుని ఉగ్రత నుండి తప్పించుకొనుమని యేసుక్రీస్తు తెలియజేసెను. 'నామాటవిని, నన్ను పంపిన వానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు. వాడు తీర్పులోనికి రాక మరణములోనుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను' (యోహాను 5:24). తన దినములలో సువార్తను నమ్మని పట్టణములను దేవుని ఉగ్రతను గూర్చి హెచ్చరించెను (మత్తయి 10:15, 11:20-24).

## (C) వల (మత్తయి 13:47-50) :

ప్రస్తుతలోకములో దేవుని రాజ్యము అదృశ్యముగా వున్నది. కనుక 'గురుగులు' అను ఉపమానములో చూచినట్లు, యిందులో గోధుమలతో పాటు గురుగులు కూడా పెరుగు చున్నవనియు, గోధుమలు కొట్లలో చేర్చబడి, గురుగులు కాల్చబడు లాగున యుగాంతమందు నీతిమంతులు పరలోక రాజ్యములో చేర్చబడి, అనీతిమంతులు దేవుని శిక్షను యెదుర్కొందురు. యిదే సత్యమును తెలియ జేయుటకు యేసుక్రీస్తు 'వల' అను మరొక ఉపమానమును చెప్పెను.

మత్తయి 13:47-50 వచనములలో ఈలాగు వ్రాయబడినది. 'పరలోక రాజ్యము సముద్రములో వేయబడి, నానా విధములైన చేపలను పట్టిన వలను పోలియున్నది. అది నిండినప్పుడు దానిని దరికిలాగి, కూర్చుండి, మంచివాటిని గంపలలో చేర్చి, చెడ్డవాటిని బయట పార వేయుదురు. ఆలాగే యుగసమాప్తి యందు జరుగును. దేవదూతలు వచ్చి, నీతిమంతులలో నుండి దుష్టులను వేరుపరచి, వీరిని అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును, పండ్లు కొరుకుటయును ఉండును'.

పై ఉపమానములో సముద్రములో వేయబడిన వలలోనికి నానా విధములైన చేపలు వచ్చు చున్నవనుమాట, యీలోకము నీతిమంతులు, అనీతిమంతులు యిరువురితో నిండుచున్నదని తెలియ జేయుచున్నది. 'వల నిండుట' యనునది 'యుగసమాప్తి'ని సూచిస్తున్నది. మంచి చేపలు గంపలలో చేర్చబడి, చెడ్డ చేపలు పార వేయబడులాగున యుగ సమాప్తియందు నీతిమంతులు పరలోక రాజ్యములో చేర్చబడి, దుష్టులు నిత్యశిక్షకు లోనగుదురు.

## (d) ధనవంతుడు - లాజరు (లూకా 16:19-31)

యేసుక్రీస్తు దేవుని వాక్యములో 'ఒక మనుష్యుడు లోక మంతయు సంపాదించుకొని, తన ప్రాణమును పోగొట్టు కుంటే అతనికేమి ప్రయోజనము ? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా యేమి యియ్యగలడు?' (మత్తయి 16:26) అని చెప్పెను. మరియు వెర్రి ధనవంతుని గూర్చిన ఉపమానము తెలియజేస్తూ 'ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము కాదని' చెప్పెను (లూకా 12:15). ధనాపేక్ష గలిగి, ధనమునే సర్వస్వమని నమ్ము పరిసయ్యుల నుద్దేశించి (లూకా 16:14) యేసుక్రీస్తు 'ధనవంతుడు-లాజరు' అను ఉ

పమానమును చెప్పెను. ధనవంతులుగా వుండియు దేవుని యెరుగని జీవితములతో నరకములో మండుటకంటే, భూమిమీద దరిద్రులుగా జీవించియు, దేవుని యెరిగి, పరలోక రాజ్యములో ప్రవేశించుట యెంతో మేలన్న సత్యమును తెలియజేస్తూ ఆయన ఈ ఉపమానమును చెప్పెను.

లూకా 16:19-31 వచనములలో యీలాగు వ్రాయబడినది: 'ధనవంతుడొకడుండెను. అతడు ఊదారంగు బట్టలను, సన్నపు నార వస్త్రములను ధరించుకొని, ప్రతి దినము బహుగా సుఖపడు చుండువాడు. లాజరు అను ఒక దరిద్రుడుండెను. వాడు కురుపులతో నిండిన వాడై, ధనవంతుని యింటి వాకిట పడి యుండి, అతని బల్లమీదనుండి పడు రొట్టెముక్కలతో ఆకలి తీర్చుకొనగోరెను. అంతేగాక కుక్కలు వచ్చి వాని కురుపులు నాకెను. ఆ దరిద్రుడు చనిపోయి దేవదూతలచేత అబ్రహాము రొమ్మున (ఆనుకొనుటకు ) కొనిపోబడెను. ధనవంతుడు కూడా చనిపోయి, పాతిపెట్టబడెను. అప్పుడతడు పాతాళములో బాధపడుచు, కన్నులెత్తి దూరమునుండి అబ్రహామును, అతని రొమ్మున (ఆనుకొనియున్న) లాజరును చూచి, 'తండ్రివైన అబ్రహామా, నాయందు కనికరపడి, తన వ్రేలికొనను నీళ్లలోముంచి, నా నాలుకను చల్లార్చుటకు లాజరును పంపుము. నేను యీ అగ్ని జ్వాలలో యాతన పడుచున్నానని కేకలు వేసి చెప్పెను' అందుకు అబ్రహాము - కుమారుడా, నీవు నీ జీవితకాలమందు నీకిష్టమైనట్టు సుఖము అనుభవించితివి. ఆలాగుననే లాజరు కష్టము అనుభవించెనని జ్ఞాపకము చేసి కొనుము. ఇప్పుడైతే వాడు యిక్కడ నెమ్మది పొందుచున్నాడు. నీవు యాతన పడుచున్నావు. అంతేగాక ఇక్కడ నుండి మీయొద్దకు దాట గోరువారు దాటి పోజాలకుండునట్లును, అక్కడి వారు మా యొద్దకు దాటి రాజాలకుండునట్లును, మాకును మీకును మధ్య మహా అగాధముంచబడియున్నదని చెప్పెను. అప్పుడతడు - తండ్రీ, ఆలాగైతే నా కయిదుగురు సహోదరులున్నారు. వారును యీ వేదనకరమైన స్థలమునకు రాకుండ, వారికి సాక్ష్యమిచ్చుటకై నా తండ్రియింటికి వాని పంపవలెనని నిన్ను వేడుకొను చున్నాననెను. అందుకు అబ్రాహాము, వారి యొద్ద మోషేయు, ప్రవక్తలును ఉన్నారు. వారి మాటలు వినవలెనని అతనితో

చెప్పగా, అతడు - తండ్రివైన అబ్రాహామా, ఆలాగు అనవద్దు. మృతులలోనుండి ఒకడు వారి యొద్దకు వెళ్లిన యెడల వారు మారుమనస్సు పొందుదురని చెప్పెను. అందుకతడు - మోషేయు ప్రవక్తలును (చెప్పిన మాటలు) వారు వినని యెడల మృతులలో నుండి ఒకడు లేచినను వారు నమ్మరని అతనితో చెప్పెననెను'.

పై వాక్య భాగములో యీ క్రింది సత్యము గ్రహింపగలము

### (1) దేవుని యెడల మనము ధనవంతులమై యుండవలెను

యీ ఉపమానములో చెప్పబడిన ధనవంతుడు ఖరీదైన వస్త్రములు ధరించు కొని, బహుగా సుఖపడుచుండెడి వాడని చూచితిమి (లూకా 16:19). అయితే, ఈ ధనవంతుడు దేవుని భయము యేమాత్రమును లేక, తన యింటి వాకిట పడియున్న లాజరును కనికరింపలేదు (లూకా 16:20,21). దేవుని ప్రేమను రుచి చూసిన వారు యెదుటి వారిని ప్రేమింతురు. నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింపవలయును (లూకా 10:29). మన పొరుగువారికి మనము దానధర్మములు చేయుట ద్వారా రక్షింపబడము (ఎఫెసి 2:9). కానీ, మనలో జరిగిన రక్షణ కార్యమును బట్టి మనము నిష్ఫలులము కాకుండు నిమిత్తము అవసరమును బట్టి సమయోచితముగా సత్‌క్రియలను శ్రద్ధగా చేయుటకు నేర్చుకొనవలెను (తీతు 3:14). యీ ధనవంతుడు దేవుని యెరిగియున్న వాడైన యెడల బీదవాడైన లాజరుకు సహాయము చేసియుండువాడు (సామెతలు 14:21,31; 19:17). కానీ దేవుని నిర్లక్ష్యము చేసిన వాడుగా జీవించెను. కనుక యీ ధనవంతుడు దేవుని యెడల దరిద్రుడైన వ్యక్తిని సూచిస్తున్నాడు (లూకా 12:21). అయితే, బీదవాడైన లాజరు యిహలోకములో దరిద్రుడైనప్పటికిని, దేవుని యెడల ధనవంతుడైన వ్యక్తిని సూచిస్తున్నాడని క్రింద తెలుపబడిన సత్యమును బట్టి గమనించుదుము (యాకోబు 2:5)

**(2) మరణము తరువాత జీవము :** ప్రతిమానవుడు తన కిష్టమున్నను, లేకున్నను శారీరకముగా ఒకానొక రోజు మరణమును యెదుర్కొనవలయును.

అయితే, భూమిమీద తాను జీవించు జీవితము మీద మరణించిన తరువాత తన నిత్యత్వము ఆధారపడునని దేవుని వాక్యము సెలవిచ్చు చున్నది. యోహాను 5:8-29లో యేసు క్రీస్తు, 'ఒక కాలము వచ్చుచున్నది. ఆ కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని, మేలు చేసిన వారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు' అని సెలవిచ్చెను. మేలు చేయుట యనగా యేసుక్రీస్తు నందు పాపక్షమాపణ పొంది, దేవుని వాక్యానుసారము జీవించుట. కీడు చేయుట యనగా క్రీస్తును తృణీకరించుట. ఉపమానములో చెప్పబడిన ధనవంతుడు చనిపోయి, పాతాళములో తన నిత్యత్వ మనుభవింప సాగెను (లూకా 16:23). పాతాళములో బాధ, నిట్టూర్పు, వేదన, ఏడ్పును, పళ్లు కొరుకుటయును వుండును (లూకా 16:24). అచ్చట అగ్ని ఆరదు. పురుగు చావదు (యెషయా 66:24). అచ్చటనుండు వారికి భూమిమీద జీవితము యొక్క జ్ఞాపక స్మృతులు వుండును. వారు యితరులను గుర్తించెదరు. ధనవంతుడు అబ్రహామును, లాజరును గుర్తించెను. తన యింటివారిని రక్షించమని బ్రతిమాలు కొనెను (లూకా 16:27,28).

బీదవాడైన లాజరు పరలోక రాజ్యములో అబ్రహాము రొమ్మున ఆనుకొనియుండుటకు కొనిపోబడెనని లూకా 16:22లో చదువు చున్నాము. అబ్రహాము రొమ్ము అనునది దేవుని పరిశుద్ధ పట్టణమును సూచిస్తున్నది (ప్రకటన 21:2, 10-27; 22:1-5). దేవుడు దేనికి శిల్పియు, నిర్మాణకుడునైయున్నాడో, పునాదులు గల ఆపట్టణము కొరకు అబ్రహాము యెదురు చూచు చుండెనని హెబ్రీ 11:10లో చదువుచున్నాము. యిది శ్రేష్ఠమైన దేశము, పరలోక సంబంధమైన దేశముగా (హెబ్రీ 11:16), పరదైసుగా (2 కొరింథి 12:2,4; లూకా 23:43), దేవుని రాజ్యముగా (మత్తయి 25:34) చెప్పబడినది. అచ్చట దుఃఖమైనను, ఏడ్పైనను, వేదనయైనను వుండదు (ప్రకటన 21:4). రాత్రి యికనెన్నడు వుండదు. దీపకాంతి యైనను, సూర్య కాంతి యైనను వారి కక్కరలేదు. దేవుడైన ప్రభువే వారి మీద ప్రకాశించును. వారు యుగయుగములు రాజ్యముచేయుదురు (ప్రకటన 22:5).

ధనవంతుడు తన సహోదరులు మరణించిన లాజరు తిరిగి లేచివెళ్లుట ద్వారా దేవునియందు విశ్వాసముంచుదురు గనుక లాజరును పంపమని అబ్రహామును వేడుకొనెను. అందుకు అబ్రహాము భూమిమీదనున్న మోషేయు, ప్రవక్తలును చెప్పిన మాటలు వారు వినని యెడల, మృతులలో నుండి ఒకడు లేచినను వారు నమ్మరని అతనితో చెప్పెను (లూకా 16:27-31). విశ్వాసము వినుట వలన కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును (రోమా 10:17). యేసుక్రీస్తు మరియు సోదరుడగు లాజరును మృతులలోనుండి సజీవునిగా లేపినపుడు ప్రధానయాజకులు క్రీస్తునందు విశ్వాసముంచక, లాజరును చంపవలెనని ఆలోచన చేసిరి (యోహాను 12:9-11). అలాగే కొరాజీను, బెత్సయిదా పట్టణములవారు యేసుక్రీస్తు వారిమధ్య విస్తారమైన అద్భుతములు చేసినప్పటికీ, మారుమనసు పొందలేదని మత్తయి11:20-22 లో చదువుచున్నాము.

ప్రియులారా, యీ అధ్యాయములో చెప్పబడిన నాలుగు ఉపమానములు (ఫలింపని అంజూరపు చెట్టు, గురుగులు, వల, ధనవంతుడు - లాజరు) యేసుక్రీస్తునందు విశ్వసించని వారిపై రాబోవు దేవుని ఉగ్రతను గూర్చి వివరిస్తున్నవి. దేవుని కుమారుని (యేసుక్రీస్తును) అంగీకరించువాడు జీవము గల వాడు. దేవుని కుమారుని అంగీకరింపనివాడు జీవము లేనివాడే (1 యోహాను 5:12). దేవుడు యీ ఉపమానముల ద్వారా మీతో మాటలాడు చున్న యెడల, 'యేసు ప్రభువా ! నేను పాపిని, నాపాపములను కడుగుము. నిత్యజీవము దయచేయుమని' ప్రార్థించిన యెడల దేవుని రక్షణ పొందినవారై, ఉగ్రతనుండి తప్పించ బడుదురు. యేసు ప్రభువని నీ నోటితో ఒప్పకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమునందు విశ్వసించిన యెడల నీవు రక్షింప బడుదువు (రోమా 10:9). దేవుని కృప మనకు తోడైయుండును గాక !